www.manatelangana.news
Mana Telangana
మన తెలంగాణ
హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 49 | మంగళవారం | 8 ఆగస్టు, 2017
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



కార్పొరేట్ ఆసుపత్రులపై హైకోర్టు ఆగ్రహం

- పిల్ విచారణకు సహకరించక దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నందుకు ధర్మాసనం గుస్సా
- నాసిరకం, అక్రమ వైద్యం అందిస్తున్నారన్న పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు రాష్ట్ర ప్రభుత్వానికి రెండు వారాల గడువు
- హాజరు కాని ఎపి న్యాయవాది

మన తెలంగాణ/ హైదరాబాద్ : కార్పొరేట్ ఆసుపత్రుల తీరుపై హైకోర్టు మండిపడింది. ప్రైవేట్ హాస్పిటల్స్‌పై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేసేందుకు హైకోర్టు ధర్మాసనం వారం గడువిచ్చింది. విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున న్యాయవాది హాజరు కాలేదు. కేర్ ఆసుపత్రిలో మూడేళ్లుగా చికిత్స పొందుతున్న తౌటం సునీతకు క్యాన్సర్‌ను గుర్తించకుండా నాసిరకం వైద్యం అందించారని, గ్లోబల్ ఆసుపత్రిలో ఎత్తు పెరిగే చికిత్స చేయించుకున్న నిఖిల్‌రెడ్డి ఇంకా కోలుకోలేదని, అవసరం లేకున్నా అపెండిక్స్ ఆపరేషన్లను కొంత మంది వైద్యులు చేస్తున్నారని, వైద్యం అందించకుండానే కొన్ని ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నిధులు మింగేశాయని ఆరోపిస్తూ బాధితుడు కాజీపేట నరేందర్ గతంలో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలతో చెలగాటమాడుతున్నాయని ఆయన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిల్‌ను విచారిస్తూ కౌంటర్ దాఖలు చేసేందుకు కావాల్సినంత సమయం ఇచ్చినప్పటికీ దాటవేత ధోరణి కనబర్చిన కార్పొరేట్ ఆసుపత్రులను మందలించిన జస్టిస్‌లు వి.రామసుబ్రమణ్యం, సి.రజనీలతో కూడిన ధర్మాసనం మరో వారం మాత్రమే గడువు ఇస్తున్నట్లు తెలిపింది. ప్రభుత్వం తరువాయి 6లో

18న విజయవాడలో కృష్ణా బోర్డు భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్: కృష్ణా బోర్డు సమావేశం ఈనెల 18న విజయవాడలో జరగనుంది. బోసిపోతున్న శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న కొద్దిపాటి నీటిని ఎలా సర్దుబాటు చేసుకోవాలనే తరువాయి 6లో

భూ రికార్డుల క్షాళన

- గ్రామస్థాయిలో పక్కా సర్వేకు స్పెషల్ డ్రైవ్
- ఏ భూమి ఎవరి పేర ఉన్నదో తేడాలు లేకుండా కింది నుంచి పై వరకు ఒకే సమాచారం ఉండేలా ఆన్‌లైన్ నమోదు
- బ్యాంకు ఖాతాలను పోలిన స్పష్టత, పారదర్శకత
- ఆ సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర సంస్కరణ
- సుదీర్ఘ సమీక్షలో సిఎం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలోని భూ రికార్డులన్నీ ప్రక్షాళన చేయాలని, ఏ భూమి ఎవరి పేరు మీదున్నదనే విషయం నిగ్గు తేల్చి బహిరంగ పర్చాలని సిఎం కెసిఆర్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సర్వే సెటిల్‌మెంట్ చేయాలని కోరారు. గ్రామస్థాయి రికార్డుల్లో ఉన్న వివరాలు సిసిఎల్ఎ (భూ పరిపాలనా ప్రధాన కమిషనర్) దగ్గర కూడా ఉండాలి. ఎక్కడ ఏ మార్పు జరిగినా ఆన్‌లైన్‌లోనే అన్ని చోట్లా రికార్డులు మారాలి. బ్యాంకులో వేసిన డబ్బులు ఏ ఎటిఎంలో తీసుకున్నా వెంటనే మెస్సేజ్ రావడం, బ్యాంకు రికార్డుల్లో వివరాలు నమోదు కావడం ఎలా జరుగుతుందో, ఆ విధంగా భూ రికార్డుల నిర్వహణ కూడా ఉండాలన్నారు. బ్యాంకులు అవలంబిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దీనికి ఉపయోగించాలని సిఎం చెప్పారు. భూమి రికార్డుల ప్రక్షాళనకు అనుసరించాల్సిన వ్యూహం ఖరారు చేయడానికి సిఎం కెసిఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏడు గంటల పాటు జరిగిన ఈ సుదీర్ఘ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపై భూమి అమ్మకాలు, కొనుగోళ్లన్నీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని చెప్పారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, పహాణీ పత్రాలు మరింత తరువాయి 6లో



కెసిఆర్‌కు రాఖీ కడుతున్న ఎంఎల్ఎ గొంగిడి సునీత



సంక్షోభంలో కాంగ్రెస్

- మోడీ, అమిత్ షా దెబ్బకు విలవిల
- పార్టీకి అస్తిత్వ సమస్య
- నాయకత్వ తీరుమారాలి
- రాహుల్ సందిగ్ధం వీడాలి : జైరామ్ రమేష్

కోచి : కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అస్తిత్వ సమస్యను ఎదుర్కొంటోందని ఆ పార్టీ సీనియర్ నాయకులు జైరామ్ రమేష్ చెప్పారు. సవాళ్లను అధిగమించేందుకు నేతలంతా సంఘటితంగా కృషి చేయాల్సి ఉందని రమేష్ పిలుపునిచ్చారు. ప్రధాని తరువాయి 6లో

ఐటికి డ్రగ్స్ ఇచ్చా

- టాలీవుడ్‌తోనూ పరిచయాలు : కమింగా



మన తెలంగాణ/ హైదరాబాద్: డ్రగ్స్ కేసులో నెదర్లాండ్‌కు చెందిన మైక్ కమింగా విచారణ సోమవారంతో ముగిసింది. అధికారులు అతడిని రంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా చంచల్‌గూడ జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఐటి రంగంలో నిష్ణాతుడిగా, పలు సాఫ్ట్‌వేర్ల ఇన్‌స్టాలర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కమింగా నిత్యం డ్రగ్స్ తీసుకుంటానని వెల్లడించినట్లు సమాచారం. మరోపక్క ఐటి రంగంలోని కొంత మందికి డ్రగ్స్‌ను తరచూ సరఫరా చేసినట్లు కూడా అంగీకరించాడని అంటున్నారు. బహుళజాతి కంపెనీలలో ఉన్నత స్థానాల్లో పని చేస్తున్న పలువురికి కమింగా డ్రగ్స్ సరఫరా చేసినట్లు గుర్తించిన అధికారులు అందుకు సంబంధించిన కొన్ని ఆధారాలను సేకరించారు. వీరితో పాటు సినీ రంగంలోని పలువురితోనూ ఆయనకు పరిచయాలున్నాయని, డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడు కెల్విన్ ద్వారా టాలీవుడ్‌లోని కొంత మందితో కమింగాకు పరిచయాలు ఏర్పడ్డాయని గుర్తించారు. అయితే తరువాయి 6లో

మైనారిటీ వైద్య కన్వీనర్ కోటా భర్తీ

జిఒ 130 మేరకే



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రభుత్వం జారీ చేసిన కొత్త జిఒలపై స్టే మంజూరీ చేసింది. మైనార్టీ వైద్య, దంత వైద్య కాలేజీలలో 2017–18 విద్యా సంవత్సరానికి 60:40 నిష్పత్తిలో ఇంతకు ముందటి జిఒ 130 పరిధిలోనే అడ్మిషన్లను చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తులు వి రామసుబ్రమణియన్, టి.రజనీతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ కీలక రూలింగ్ వెలువరించింది. 'ఎ' కేటగిరి సీట్లను తగ్గిస్తూ, బి, సి కేటగిరి సీట్లను పెంచుతూ వెలువరించిన నూతన ప్రభుత్వ ఉత్తర్వులను ఈ ప్రవేశాల ప్రక్రియకు అన్వయింప చేయరాదని, ఇంతకు ముందటి విధానమే పాటించాలని ఆదేశించారు. గత నెలలో వెలువరించిన జిఒ 115, 117,119లను ఎంబిబిఎస్ ప్రవేశాల దరఖాస్తుదార్లు బషీరుద్దీన్ సిద్దిఖీ మరో 13 మంది కోర్టులో సవాలు చేశారు. కొత్త ఆదేశాలతో కన్వీనర్ కోటా సీట్లు తగ్గి, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పెరుగుతున్నాయని తరువాయి 6లో

ఉగ్రవాదులు హతం

- సరిహద్దుల్లో చొరబాటుకు యత్నించిన ఐదుగురి కాల్చివేత

శ్రీనగర్ : కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట ఉగ్రవాదుల భారీ చొరబాటు యత్నాన్ని భద్రతా బలగాలు భగ్నం చేశాయి. ఐదుగురు ఉగ్రవాదులను కాల్చి చంపాయి. సోమవారం సాయంత్రం మాచిల్ సెక్టార్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. 'భారీ చొరబాటు ప్రయత్నాన్ని తిప్పికొట్టాం. ఐదుగురిని మట్టుబెట్టాం. ఐదు తుపాకులు స్వాధీనం చేసుకున్నాం' అని సైనిక అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైనికుల అప్రమత్తత వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. మరికొంత మంది ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. పాంపోర్‌లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన ఉమర్ అనే ఉగ్రవాదిని సైన్యం మట్టుబెట్టింది. పాకిస్తాన్‌కు చెందిన అబు ఇస్మాయిల్ గ్రూప్‌లో పనిచేస్తున్న



ఇతన్ని సిఆర్‌పిఎఫ్–సైన్యం ఉమ్మడి ఆపరేషన్‌లో కాల్చివేశాయని సైన్యం ఆ ప్రకటనలో పేర్కొంది. అమర్‌నాథ్ యాత్రికుల బస్సుపై దాడితో ఇతనికి సంబంధముందని వెల్లడించింది. ఇప్పటి వరకు ఈ సంవత్సరంలో చొరబాటుకు యత్నించిన 40 మంది ఉగ్రవాదులను సైన్యం కాల్చివేసింది.



పాముకు రాఖీ

రాఖీ పండుగ సందర్భంగా సోమవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్ల వాడలో నివాసముంటున్న అఫ్జల్ వద్ద ఉన్న పాముకు ఓ యువతి రాఖీ కట్టింది. ఈ దృశ్యాన్ని చూసేందుకు కాలనీవాసులు ఆసక్తి కనబర్చారు

- మన తెలంగాణ/ హుజూరాబాద్ టౌన్



110 గొర్రెలు సజీవ దహనం

మన తెలంగాణ/ మెదక్: విద్యుదాఘాతంతో 110 గొర్రెలు సజీవ దహనమైన ఘటన మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ తాండాలో చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారు జామున 3 గంటలకు ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు దరావత్ శంకర్ తెలిపాడు. కొట్టాలలో ఉన్న గొర్రెలను కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా నిప్పు అంటుకొని గొర్రెలు కాలిబూడిదయ్యాయని చెప్పాడు. గతంలో తనకు బర్రెలు ఉండేవని, గ్రాసానికి ఇబ్బంది కావడంతో వాటిని అమ్మివేసి గొర్రెలను కొనుగోలు చేసి పెంచుతున్నట్లు తెలిపాడు. తనకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితుడు విన్నవించుకున్నాడు.

కుంచెపోటు



ఎంత డబ్బిచ్చినా మీరు లొంగరని చెప్పా, అయితే టమాటాలు, ఉల్లిగడ్డలు ఇస్తామన్నారు!

ఉత్తమ్‌పై ఎత్తిన బాణం?

- పెరుగుతున్న ఆయన పట్టుపై జానా, భట్టి భేటీ?
- విక్రమార్క ఇంట్లో మూడు గంటలసేపు చర్చ!
- రాష్ట్ర కాంగ్రెస్‌లో రగులుతున్న కుంతియా కుంపటి
- దిగ్విజయ్ ఉద్వాసనకు పిసిసి అధ్యక్షుడే కారణమని ప్రచారం



మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకులు కుందూరు జానారెడ్డి, టిపిసిసి వర్కింగ్ కమిటీ అధ్యక్షులు భట్టి విక్రమార్క ఇటీవల సమావేశమైనట్లు సమాచారం. రాష్ట్ర రాజకీయాలతో పాటు, కాంగ్రెస్ అంతర్గత విశేషాలను వారిరువురు చర్చించినట్లు తెలిసింది. రాష్ట్ర కాంగ్రెస్‌లో పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి పట్టు పెరుగుతుండడంతో వారి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. భట్టి నివాసంలో వారిరువురి మధ్య ఆదివారం సుమారు 3 గంటల పాటు సమావేశం జరిగినట్లు తెలిసింది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా దిగ్విజయ్‌సింగ్ స్థానంలో డాక్టర్ ఆర్.సి.కుంతియా నియామకం వెనుక ఉత్తమ్ హస్తం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దిగ్విజయ్‌తో ఉత్తమ్‌కు అంతగా సత్సంబంధాలు లేవు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ మార్పు జరిగిన సమయంలో ఇప్పటి వరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలకు సహ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎఐసిసి కార్యదర్శి కుంతియాను పూర్తిస్థాయి ఇన్‌చార్జ్‌గా చేయడం వెనుక ఢిల్లీ స్థాయిలో ఉత్తమ్ చేసిన లాబీయింగే కారణమని చెబుతున్నారు. సాధారణంగా ఎఐసిసి ప్రధాన కార్యదర్శి స్థాయి వారికే రాష్ట్ర వ్యవహారాల పూర్తిస్థాయి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వడం ఆనవాయితీ. కానీ కార్యదర్శిగా ఉన్న తరువాయి 6లో

నయీమ్ గ్యాంగ్‌పై పి.డి

- 14 మందిపై ప్రయోగించినట్లు సిట్ వెల్లడి



మన తెలంగాణ/ హైదరాబాద్ : కరుడుగట్టిన నేరస్థుడు నయీమ్ గ్యాంగ్ సభ్యులలో 14 మందిపై పిడి చట్టం ప్రయోగించినట్లు సిట్ ఐజి నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నయీమ్ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రజలందరూ మరచిపోయిన సమయంలో ఐజి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నగర శివార్లలోని షాద్‌నగర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో నయీమ్ హతమై ఏడాది కావస్తుంది. ఏడాది కాలంలో సిట్ దర్యాప్తు అందరూ ఊహించినంత వేగంగా జరగలేదు. అసలు నిందితులను అరెస్టు చేయడంలో సిట్ పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నయీమ్ గ్యాంగ్‌తో పోలీసులు, పోలీసు ఉన్నతాధికారులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో పాటు పలువురు రాజకీయ నేతలు, రియల్ వ్యాపారులు కూడా మిలాఖత్ అయి సామాన్య ప్రజల రక్త మాంసాలను పీక్కు తిన్నారన్న విషయం ఎన్‌కౌంటర్ తర్వాత జరిగిన దర్యాప్తులో అధికారులకు తెలిసింది. సంచుల కొద్దీ నగదు, వందల కొద్దీ డాక్యుమెంట్లు, పదుల సంఖ్యలో మారణాయుధాలు కూడా పట్టుబడ్డాయి. మైనర్ బాలికలపై అత్యాచారాలు, అక్రమాలకు అడ్డు వచ్చిన తరువాయి 6లో

అబార్షన్ వికటించి ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి 2

విద్యుదాఘాతంతో రైతు మృతి

మనతెలంగాణ/నిడమనూరు: విద్యుత్‌షాక్‌తో రైతు భగ వంత్‌రెడ్డి (45) మృతి చెందిన సంఘ టన నిడమనూరు మండలంలోని రేగులగడ్డ శివారులోని రామారావు క్యాంపులో సోమ వారం సాయంత్రం చోటు చేసుకుంది.

సిరిసిల్లలో పోలీసులదే రాజ్యం

మనతెలంగాణ/ఎల్లారెడ్డిపేట: మృతి చెందిన రిమాండ్ ఖైదీ వెంకటేశ్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 30లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు.


ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న సిఎం : షబ్బీర్ అలీ



మన తెలంగాణ/కరీంనగర్ ప్రతినిధి : ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకుండా సిఎం కెసిఆర్ ఊసరివెల్లిలా రంగులు మారుస్తున్నాడని శాసన మండలిలో కాం గ్రెస్ నేత షబ్బీర్ అలీ ఆరోపించారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రం లో పొన్నం చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కరీంనగర్‌లో మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేస్తానని మూడు సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీని కెసిఆర్ అమలు పర్చకపోవడంతో మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఆమరణ దీక్ష చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మభ్యపెడుతున్న సీఎంకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలపై జీఎస్టీ అమలు చేస్తే కోర్టుకు పోతున్నని అంటున్న ముఖ్యమంత్రి మల్లాన్న సాగర్ ప్రాజెక్టు ముంపు రైతులు కోర్టులను ఆశ్రయిస్తే కాంగ్రెస్‌పై అక్కసు వెళ్ళగ్రక్కారని ఆరోపించారు.


ఆన్‌లైన్‌లో ఆక్యుపెన్సీ నివేదికలు

- క్షేత్ర పరిశీలన ముగిసిన 24 గంటల్లోనే నివేదిక సిద్ధం
- స్థానిక సంస్థలను ఆదేశించిన పురపాలక శాఖ



మన తెలంగాణ/హైదరాబాద్: భవన నిర్మాణాల అనుమతులు, ఆక్యుపెన్సీ, ఆస్తుల మార్పిడి తదితర ధృవ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యానికి పురపాలక శాఖ చెక్ పెట్టింది. ఇక నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగిన 24గంటల్లోనే ఆ పనులకు సంబంధించిన నివేదికను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన అధికారుల బృందం తమ పరిశీలన నివేదికను తమ మున్సిపాలిటీ, నగర పంచాయతీల వెబ్‌సైట్‌తో పాటు డిపిఎంఎస్ (డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం)లో ఆన్‌లైన్‌లో పెట్టాలని సూచించింది. ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను ఆదేశిస్తూ ఒక సర్క్యూలర్‌ను జారీ చేసింది. పరిశీలన నివేదికను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమన్ని నిరంతరం పర్యవేక్షించాలని స్థానిక సంస్థలను ఆదేశించింది. భవన నిర్మాణాలకు చెందిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, భూ వినియోగ మార్పిడి తదితర ధృవ పత్రాల విషయంలో జాప్యం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని స్థానిక సంస్థల పరిధిలో పని భారం ఎక్కువగా ఉండడంతో క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షించడంలోనే తీవ్ర ఆలస్యం జరుగుతోందని పలువురు పేర్కొంటున్నారు. మరోవైపు భవన నిర్మాణాల విషయంలో కూడా కొన్ని స్థానిక సంస్థల పరిధిలో విపరీత జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. భవన నిర్మాణాల అనుమతుల విషయంలో జాప్యం జరగకుండా చూడాలని పురపాలక శాఖ పదే పదే చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని మున్సిపాలిటీల్లో అమలు కావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ భవన నిర్మాణాల అనుమతులలో 20 నుంచి 30 శాతం వరకు ఆలస్యం జరుగుతున్నదని, దీనిని కూడా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులు సంబంధిత స్థానిక సంస్థలను ఆదేశించినట్లు తెలిసింది. ఆక్యుపెన్సీ, భూ వినియోగ మార్పిడి తదితర ధృవపత్రాల జారీ అంశంలో కిందిస్థాయి అధికారులు వీలైనంత త్వరగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పరిశీలన పూర్తైన 24గంటల్లోనే నివేదికను సిద్ధం చేయాలని సూచించింది. దీనిని సక్రమంగా అమలు చేసే బాధ్యతను స్థానిక సంస్థల కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు తీసుకోవాలని పురపాలక శాఖ సూచించింది.

గాంధీ ఆసుపత్రిలో పలు మార్పులు



మన తెలంగాణ/హైదరాబాద్ : గాంధీ ఆసు పత్రిలో పలు విభాగాల్లో మార్పులు, చేర్పులు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. గాంధీ హాస్పిటల్‌ని మంత్రి ఆదివారం సందర్శించారు. పలు వార్డుల్లో కలియతిరిగిన మంత్రి రోగులు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. 65 పడకల ఐసియుని ఆయన పరిశీలించారు. పిల్లల, ప్రసూతి, ఓపి, గైనిక్, ఆరోగ్యశ్రీ, రేడియాలజీ, ప్యాథాలజీ తదితర విభాగాలను మంత్రి తనిఖీ చేశారు. అనంతరం మరుగుదొడ్లను మంత్రి లక్ష్మారెడ్డి పరిశీలించారు. మంత్రి వెంట వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదు పాయాల అభివృద్ధి సంస్థ (టిఎస్‌ఎంఐడిసి) ఎండి వేణుగోపాల్, సిఇ లక్ష్మణరెడ్డి, గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్ ఉన్నారు.

ఒక్క పైసా విడుదల చేయలేదు

మన తెలంగాణ/హైదరాబాద్: విశ్వ బ్రాహ్మణులకు బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించినా ఇప్పటి వరకు ఒక్క పైసా విడుదల చేయలేదని వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సమాఖ్య కార్యాల యంలో సోమవారం వృత్తి సంఘాల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచవృత్తిదారుల అభ్యున్నతికిప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టకపోవడం అన్యాయమన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండురంగాచారి మాట్లాడుతూ ఈ నెల 9న సంఘం వ్యవస్థాపక దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


బంగ్లాదేశ్‌కు నాణ్యమైన విత్తనాల సరఫరా!

- అందుకు సిద్ధంగా ఉన్నాం : పార్థసారథి

మన తెలంగాణ/హైదరాబాద్ : బంగ్లాదేశ్ అవసరాల మేరకు కావల్సిన వరి, జనము, కూరగాయల నాణ్యమైన విత్తనాలను ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి తెలిపారు. బంగ్లాదేశ్ వ్యవసాయ మంత్రిత్వ శాఖ నుండి ఖాజీ జహంగీర్ కబీర్ నేతృత్వంలోని విత్తన ధృవీకరణ సంస్థ అధికారుల బృందం భారతదేశంలో విత్తన ధృవీకరణ క్రమాన్ని అధ్యయనం చేయటానికి మూడు రోజుల పర్యటనకై ఆదివారం హైదరాబాద్ చేరుకుంది. సోమవారం హాకాభవన్‌లోని తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ అథారిటి సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమైంది. ఆ బృందంతో భేటీ అయిన పార్థసారథి మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థ టిఎస్ఎస్‌డిసి నుండి ఎగుమతి చేస్తామన్నారు. ఈజిప్ట్, సూడాన్, ఫిలిప్పైన్స్ దేశాలకు ఒఇసిడి విత్తన ధృవీకరణ విత్తనాలు భారతదేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రం నుండి మొత్తం 17,000 క్వింటాళ్లకు గాను 4000 క్వింటాళ్లకు పైగా ఎగుమతి అయ్యాయన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఇరు దేశాల విత్తన ధృవీకరణ మాన్యువల్‌లను పరస్పరం అధ్యయనం కోసం ఇచ్చి పుచ్చుకున్నారు. సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు విత్తన ధృవీకరణతో పాటు, ఆన్‌లైన్ విత్తన ధృవీకరణ క్రమము, అంతర్జాతీయ ఒఇసిడి విత్తన ధృవీకరణ, సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణ, సంస్థ చేస్తున్న కార్యాకలాపాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మన రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ దేశంలోనే అగ్రగామి విత్తన ధృవీకరణ సంస్థగా అవతరించిందన్నారు.

బంగ్లాదేశ్‌లో కొత్త విత్తన చట్టం :


ఖాజీ జహంగీర్ కబీర్ మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో కొత్త విత్తన చట్టం రానున్నదని, తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ విత్తన ధృవీకరణ, అంతర్జాతీయ ఒఇసిడి విత్తన ధృవీకరణ, సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణలపై సంస్థ చేస్తున్న కార్యాలాపాలు అభినందనీయమని కొనియాడారు. నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ లాంటి మోడల్ విత్తన గ్రామాలు, విత్తన ధృవీకరణ, అంతర్జాతీయ (ఐఎస్‌టిఎ) స్థాయి విత్తన పరీక్షా విధానాలు, క్వాలిటి కంట్రోల్ విధానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ, సహకారాలు బాగున్నాయన్నారు. తమ దేశంలో సిబ్బంది నైపుణ్యతను పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వ సహయ, సహకారం కావాలన్నారు. బంగ్లాదేశ్‌లో నోటిఫై చేసిన పంటల రకాలన్నీ ధృవీకరణ చేయాల్సిందేనన్నారు.



వికటించిన అబార్షన్


- ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి
- పోలీసుల అదుపులో ప్రియుడు, డాక్టర్

మన తెలంగాణ/సిటీబ్యూరో : వారిద్దరు ప్రేమించుకున్నారు. విషయం నలుగురికి తెలిస్తే పరువు పోతుందనే భయంతో ప్రియుడు ఆమెకు అబార్షన్ చేయించాడు. వైద్యం వికటించడంతో ఆ ఇంజనీరింగ్ విద్యార్థిని తనువు చాలించింది. దీంతో ప్రియుడ్ని, వైద్యురాలిని పోలీసులు అరెస్టు చేశారు.విషాదకర ఉదంతం వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామచంద్రాపురం బీరంగూడకు చెం దిన ఓ అమ్మాయి (20) షేరిగూడ శ్రీఇందూ ఇంజనీరింగ్ కాలేజీలో ఈఈఈ సెకండియర్ చదువుతోంది. ఆమె సమీప బంధువు అయిన మధు (22) ప్రేమించాడు. ఆమె ఐదు నెలల గర్భం దాల్చింది. ఈ విషయం పెద్దలకు తెలిస్తే చంపేస్తారన్న ఉద్దేశంతో మధు ఆమెకు అబార్షన్ చేయించాలని నిర్ణయించాడు. డబ్బులు తీసుకుని అబార్షన్ చేసే ఆసుపత్రుల కోసం నెల రోజుల నుంచి వెతికాడు. చివరకు వనస్థలిపురంలోని అనూష నర్సింగ్ హోంకు వెళ్లాడు. అక్కడున్న గిరిజారాణి అబార్షన్ చేసేందుకు అంగీకరించారు. అందుకు మధు నుంచి రూ.20 వేలు కూడా తీసుకున్నారు. చివరకు ఆదివారం అమ్మాయికి అబార్షన్ చేశారు. అయితే వైద్యం వికటించాడంతో ఆమె మృతి చెందింది. ఈ విషయం మధుకు తెలియకుండా ఆమె పరిస్థితి విషమంగా ఉంది ఉస్మానియాకు తరలించాలని కోరడంతో అంబులెన్స్‌లో తీసుకెళ్లాడు. అయితే దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి మధు తీసుకెళ్లాడు. అయితే అప్పటికే అమె మృతి చెందిందని అక్కడి వైద్యులు తెలిపారు. దీంతో మధు వనస్థలిపురం పోలీసులను ఆశ్రయించాడు. తమ కూతురు చనిపోయిందని తెలుసుకున్న తల్లిదండ్రులు కూడా స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయడంతో ప్రియుడు మధుతో పాటు డాక్టర్ గిరిజారాణిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులపై ఐపిసి 314, 312 కింద కేసు నమోదు చేశారు.






గిరిజన సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన, అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని గిరిజన అభి వృద్ధి శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ అన్నారు. గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధిని గిరిజనుల అభివృద్ధికి పూర్తి స్థాయిలో ఖర్చు పెట్టాలన్నారు. హైదరాబాద్‌లో సోమవారం తన నివాసం నుంచి గిరిజనాభివృద్ధి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పథకాలు, కార్యక్రమాల అమలు తీరును మంత్రి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రహదారుల ఏర్పాటుకు ఏజెన్సీ ప్రాంతంలో రూ. 247 కోట్లు, మైదాన ప్రాంతంలో రూ. 200కోట్లను మంజూరు చేశామని, ఈ నిధులతో త్వరితగతిన రహదారులను ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన తండాలు, గూడాల రూపు రేఖలను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నదన్నారు. తండాలు, గూడాల్లో వైద్యసేవలను మరింత విస్తృత పర్చాలన్నారు. గిరిజన విద్యా సంస్థలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రతి నెలా వైద్య పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు కలిపంచడం, రెసిడెన్షియల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం, కళ్యాణలక్ష్మి తదితర పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరించేందుకు ప్రయత్నిస్తున్నాయని మంత్రి తెలిపారు.

సౌదీలో చంపేస్తారు..రక్షించండి



మన తెలంగాణ/హైదరాబాద్‌సిటీబ్యూరో: సౌదీ అరేబియాలో ఉద్యోగం అనగానే ఎగిరి గంతే శాడు.. రెండుమూడేళ్లు పనిచేసుకుని జీవితంలో స్థిరపడాలనే ఆశతో వెళ్లాడు. చెప్పిన ఉద్యోగం ఇప్పించకుండా అడవిలో ఒంటెల వద్ద వెట్టిచాకిరిలో తోసేశాడు ఏజెంట్. బతుకు జీవుడా అంటూ 11 నెలలు అడవిలోనే జంతువుల మధ్య అడవిలోనే బతుకీడుస్తున్నాడు.నెలవారి జీతం కూడా ఇవ్వడం లేదు. బాధితుడికి అతని కుటుంబ సభ్యులకు కూడా కనీసం ఫోన్ సంభాషణలు కూడా లేవు. ఈ విషయం తెలుసుకున్న అక్కడి ఓ భారతీయుడు బాధితుడి గురించి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు లేఖ రాయడంతో ఈ ఉదాంతం వెలుగు చూసింది. సాధిక్‌ను కాపాడాలంటూ అతడు ఆ లేఖలో పేర్కొన్నాడు. పూర్తి వివరాలు...పాతబస్తీలోని తలాబ్‌కట్టకు చెందిన సయ్యద్ సాధిక్ (30)కు అర్షద్ అనే ఓ ఏజెంట్ గతేడాది పరిచయం అయ్యాడు. అతని మాటలు నమ్మిన సాధిక్, అర్షద్‌కు రూ.లక్ష ఇచ్చాడు. దీంతో అతనికి వీసా ఇప్పించి గత ఏడాది జూన్‌లో సాధిక్‌ను సౌదీ అరేబియాకు పంపించాడు. అక్కడ విమానాశ్రయంలో దిగగానే ఓ అరబ్ వ్యక్తి వచ్చి అతన్ని నేరుగా అడవికి తీసుకెళ్లాడు. అక్కడ సుమారు 150 ఒంటెలు ఉన్నాయి. వాటి బాగోగులు చూసుకోవాలని చెప్పడంతో సాధిక్ విస్తూ పోయాడు. ఏజెంట్ అర్షద్ చివరకు తనను మోసగించడాన్ని గ్రహించి అక్కడే గడపసాగాడు.



ఉపరితల ఆవర్తనం : వర్షసూచన

మన తెలంగాణ/హైదరాబాద్: ఉత్తర కర్ణాటక సమీపంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది ప్రస్తుతం 5.8 కిలోమీటర్ల ఎత్తులో పయనిస్తోంది. ఇది కాకుండా ఉత్తర చత్తీస్‌గఢ్ సమీపంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. చత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా ద్రోణి పయనిస్తోంది. ఫలితంగా రాష్ట్రంలోని పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో ఖమ్మం జిల్లా కోయిడ, గద్వాల జిల్లా ఆలంపూర్‌లో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఇదేవిధంగా దుమ్ముగూడెం, చంద్రుగొండలో 2, మధిర, టేకులపల్లి, ములకలపల్లి, ఏటూరునాగారం, ఖమ్మం, పేరూరులో 1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో వైపు సోమవారం నాడు భద్రాచలంలో 36.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం, నల్లగొండలో 35, హన్మకొండలో 34.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

జిఎస్‌టితో తలనొప్పి!



- ఆదాయ వృద్ధిలో మేమెప్పుడూ ముందంజే
- నీటిని సద్వినియోగం చేసుకుంటే ఇరు రాష్ట్రాలు బాగుపడతాయి
- వివిధ అంశాలపై ఎన్.రామ్‌తో అభిప్రాయాలు పంచుకున్న సిఎం

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం ఉండాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న జిఎస్‌టి విధానం ఒక ప్రయోగమని, దీని ఫలితాలు ఎలా ఉంటాయనేది ఎదురుచూడాల్సి ఉందని సిఎం కెసిఆర్ అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో చాలా దేశాలు జిఎస్‌టి విధానం తెచ్చినా అమలులో ఏర్పడిన ఇబ్బందుల వల్ల వెనక్కి తగ్గాయన్నారు. పన్నుల శ్లాబుల విషయంలో కూడా భిన్నా భిప్రాయాలు ఉన్నాయి. వినతులపై కేంద్రం ఎలా స్పం దిస్తుందో చూడాలన్నారు. గోదావరి, కృష్ణా నదుల్లో చాలి నంత నీరుంది. వాటిని సద్వినియోగం చేసుకోవడం వల్ల తెలంగాణ, ఎపి రాష్ట్రాలు బాగుపడతాయని సిఎం చెప్పారు. సమైక్య పాలనలో తెలంగాణ పట్ల చూపించిన వివక్ష, నిర్లక్ష్యం వల్లనే తెలంగాణ ఉద్యమం చేయాల్సి వచ్చిందని గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఉద్యమ సమయంలో తాము అనేకమార్లు చెప్పినట్లే, తెలంగాణ రాష్ట్రం ఆదాయ వృద్ధి రేటులో ముందంజలో ఉందని ప్రకటించారు. హిందూ దిన పత్రిక మాజీ ఎడిటర్ ఇన్ చీఫ్, ప్రస్తుత కస్తూరి అండ్ సన్స్ లిమిటెడ్ చైర్మన్ ఎన్.రామ్ సోమవారం ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్‌ను కలుసుకున్నారు. ఆయన ఇటీవల రాసిన 'వై స్కామ్స్ ఆర్ హియర్ టు స్టే' పుస్తకాన్ని సిఎం కెసిఆర్‌కు అందించారని సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా సమకాలీన అంశాలతో పాటు, తెలంగాణ ఉద్యమం, కొత్త రాష్ట్ర పయనిస్తున్న తీరుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రామ్ సిఎంను పలు ప్రశ్నలు అడిగారు. ముందుగా జిఎస్‌టి విధానంపై అభిప్రాయం ఏమిటని అడిగారు. '1956లో హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంతో కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశారు. దీనిపై మొదట్లోనే వ్యతిరేకత వచ్చింది. ఫజల్ అలీ కమిషన్ తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగానే ఉంచాలని సిఫారసు చేసింది. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఆంధ్ర ప్రాంతం వారు తెలంగాణ ప్రాంతాన్ని కోరుకోవడం సామ్రాజ్యవాద విస్తరణ కాంక్ష మాత్రమే అని చెప్పారు. అయినా సరే, ఆంధ్ర వాళ్లు ఢిల్లీలో లాబీయింగ్ చేసి హైదరాబాద్ స్టేట్‌ను కలుపుకున్నారు. నిజాం రాజ్యంలో ఉన్న తెలంగాణ నాయకులకు ఢిల్లీతో పరిచయాలు తక్కువ. ఆంధ్ర ప్రాంతం బ్రిటీష్ రాజ్యంలో ఉండడం వల్ల వారికి మొదటి నుంచి ఢిల్లీ వారితో సన్నిహితంగా ఉండేవారు. ఢిల్లీలో లాబీయింగ్ చేసి ఎపిని ఏర్పాటు చేశారు. కాని దీనిపై కేవలం తొమ్మిదేళ్లకే తెలంగాణ ప్రజలలో వ్యతిరేకత వచ్చింది. 1966లో నిరసన ప్రారంభమైంది. 1969లో మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో ఉధృతమైన ఉద్యమం వచ్చింది. అప్పుడు నేను 9వ తరగతి చదువుతున్నాను. నేను కూడా లాఠీ దెబ్బలు తిన్నాను. మా ఇంట్లో చెన్నారెడ్డి 10 రోజులు ఉన్నారు. సమైక్య పాలనలో రోజురోజుకు వివక్ష ఎక్కువైంది తప్ప తక్కువ కాలేదు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన వెంటనే నేను టిడిపిలో చేరాను. దాదాపు రెండు దశాబ్దాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా పనిచేశాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రిగా ఉన్న నేను తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై నిత్యం పంచాయతీ పెట్టుకునే వాడిని. చివరికి 1999లో కరెంటు ఛార్జీలు పెంచడంతో రైతులు బాగా నష్టపోతారని చెప్పినా వినలేదు. దీంతో నేను పదవులన్నీ వదిలి ఉద్యమం మొదలుపెట్టాను. వివక్ష, నిర్లక్ష్యం అన్ని రంగాల్లో కొనసాగింది. తెలంగాణ ప్రజలు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రం సాధించారు. 21 శాతం ఆదాయం వృద్ధి రేటుతో దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నాం. గోదావరి, కృష్ణా నదుల నీళ్లను సద్వినియోగం చేసుకునేందుకు ప్రాజెక్టులు కడుతున్నాం '' అని సిఎం వివరించారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హై అలర్ట్

మన తెలంగాణ/శంషాబాద్ : ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఈ నెల 8నుంచి 20వరకు శంషా బాద్ ఎయిర్‌పోర్టులో హై అలెర్ట్‌ను ప్రకటించినట్టు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. దేశంలోని అన్ని విమా నాశ్రయంలో మంగళవారం నుంచి ఈనెల 20 వరకు హై అలర్ట్‌ను ప్రకటిస్తున్న తెలిపింది. అం దులో భాగంగా హైదారాబాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చే అన్ని వాహనాలను ముమ్మ రంగా తనిఖీ చేసిన తర్వాతే ఎయిర్‌పోర్టులోకి అనుమతి ఇస్తున్నామని పేర్కొన్నారు. నేటి నుండి అన్ని రకాల పాసులు సైతం రద్దు చేసి సందర్శ కులకు అనుమతిని నిషేదించారు. ఎయిర్ పోర్టులో పోలీసులు సిఐఎస్‌ఎఫ్, రక్షా, డాగ్‌స్క్వా డ్, బాంబ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు.

అంబేడ్కర్ వర్శిటీ డిగ్రీ ఫలితాలు విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సరం ఫలితాలు ప్రకటించారు. మే, 2017లో జరిగిన పరీక్షలకు సంబంధించిన ఫలితాలు సోమవారం విడుదల కాగా, 'www.braou.ac.in' వెబ్‌సైట్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. మార్కుల జాబితాను విద్యార్థులు 'www.braouonline.in' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, రీవాల్యుయేషన్‌కు ఆగస్టు 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యుత్ ఫీడర్ల ఏర్పాటు వేగవంతం

మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయ విద్యుత్‌కు ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటును డిస్కంలు వేగవంతం చేయనున్నాయి. రాష్ట్రంలో 4101 ఫీడర్లను వ్యవసాయ, వ్యవసాయేతర ఫీడర్లుగా విభజించాల్సి ఉంది. ఇప్పటి వరకు 61 ఫీడర్లు మాత్రమే విభజించారు. ఇన్నాళ్లుగా ఈ విషయాన్ని సీరియస్‌గా పట్టించుకోని డిస్కంలు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో దృష్టి పెట్టింది. నిర్దేశిత లక్ష్యం దశల వారీగా ఫీడర్ల విభజన పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా 11000 మెగావాట్ల పీక్‌లోడ్ డిమాండ్ వస్తుందన్న అంచనాతో డిస్కంలు విద్యుత్ వ్యవస్థను సిద్ధం చేశాయి. మిషన్ భగీరథ, తొమ్మిది గంటల సరఫరా కోసం కొంత మేర వ్యవస్థను బలోపేతం చేశారు. ఇందుకోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్‌స్టేషన్ల ఏర్పాటు వంటి కారణాలతో ఇటీవల రాష్ట్ర చరిత్రలోనే గరిష్టంగా 9326 మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చినా వ్యవస్థ తట్టుకుంది. 24 గంటల సరఫరాను ప్రయోగాత్మకంగా మూడు జిల్లాల్లో ప్రారంభించారు. గరిష్టంగా 195 మిలియన్ యూనిట్ల డిమాండ్ వచ్చినా తట్టుకుని విద్యుత్‌ను సరఫరా చేశారు. గరిష్టంగా మరో ఏడాది లోపు ఫీడర్ల విభజన పూర్తవుతుందని డిస్కం అధికారులు చెబుతున్నారు.

మౌలిక వసతుల కల్పన పెనుభారం

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు జిఎస్‌టి పెనుభారంగా మారనుంది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, డబుల్ బెడ్‌రూం, సాగునీటి ప్రాజెక్టులు, ఇతరత్రా మౌలిక, కనీస అవసరాల ప్రాజెక్టులపై 12 శాతం జిఎస్‌టి విధించడంతో ప్రాజెక్టుల అంచనాలన్నీ భారీగా పెరగనున్నాయి. ఇప్పటి వరకు 5 శాతం వ్యాట్‌తో ప్రాజెక్టుల అంచనాలు తయారు చేయగా, అవి మధ్యలో ఉండగానే 12 శాతానికి ప్రభుత్వం జిఎస్‌టి పేరుతో పెంచింది. తొలుత ఈ ప్రాజెక్టులన్నీ 18 శాతం స్లాబ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల ఆందోళనతో వీటిని 12 శాతం స్లాబ్‌కు కేంద్రం మార్చింది. దీంతో రాష్ట్రంపై రూ.18 నుంచి 23 వేల కోట్ల వరకు ప్రత్యక్ష, పరోక్ష భారం పడే అవకాశం ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఇంటింటికీ తాగునీటి పథకాన్ని ప్రభుత్వం రూ.35,000 కోట్ల అంచనాతో చేపట్టింది. దీనిపై 12 శాతం జిఎస్‌టి విధిస్తే అది రూ.4200 కోట్లు అవుతుంది. గతంలో 5 శాతం వ్యాట్ రూ.1200 కోట్లు ఉండేది. ఇదేవిధంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ.16000 కోట్ల అంచనాతో ప్రారంభించగా, 5 శాతం వ్యాట్‌తో 800 కోట్లు ఉండగా, జిఎస్‌టితో 1920 కోట్లకు చేరింది. మిషన్ కాకతీయను రూ.22 వేల కోట్లతో ప్రారంభించగా 5 శాతం వ్యాట్‌తో 1100 కోట్లు చెల్లించాల్సి ఉండేది. జిఎస్‌టి కారణంగా అది 2640 కోట్లకు చేరింది. లక్ష కోట్లతో ఇరిగేషన్ ప్రాజెక్టులు మధ్యలో ఉన్నాయి. వీటిపై 12 శాతం జిఎస్‌టి విధిస్తారు. దీనిపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు తయారు చేసే పనిలో అధికారుల నిమగ్నమయ్యారు. లెక్కలన్నీ కొలిక్కి వస్తే, సమగ్ర లెక్కలతో ప్రధానికి లేఖ రాస్తానని ముఖ్యమంత్రి చెప్పారు.

లండన్‌లో ఘనంగా జయశంకర్ జయంతి



మన తెలంగాణ/హైదరాబాద్: ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను లండన్‌లో ఘనంగా నిర్వహించారు. యుకెలో తెలంగాణ మద్ధతుదార్ల సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. సురేష్ గోపతి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో జయశంకర్ గొప్పదనాన్ని, ముందుచూపును వక్తలు కొనియాడారు. నాన్ ముల్కీ ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు గొప్ప పాత్రను పోషించారన్నారు. ప్రవాస తెలంగాణ సంఘాలన్నీ ఆయన ఆలోచనల్లోంచి వచ్చిన మానస పుత్రికలన్నారు. ఈ వేడుకల్లో గోలి తిరుపతి, రంగు వెంకట్, సిక్కా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ మృతి చెందలేదు

మన తెలంగాణ/గణపురం: కందూర్‌పల్లి సమీపంలో లారీ గొర్రెలను ఢీ కొట్టిన ఘటనలో లారీ డ్రైవర్ జమీల్ గాయాలై చనిపోలేదని వరంగల్ జిల్లా ఎస్‌పి ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జమీల్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. అలాగే లారీడ్రైవర్‌పై దాడి చేసిన చంద్రు, బానోతు శివలపై కూడా వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. లారీపత్రాలు సరిగా లేకపోతే యజమానిపై కూడా కేసు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

ఎన్నికల ఖర్చులో చాలావరకు అప్రకటిత ఆదాయమే

ఎన్.రామ్ రాసిన వై స్కామ్స్ ఆర్ హియర్ టు స్టే పుస్తకావిష్కరణలో మంత్రి కెటిఆర్



మన తెలంగాణ/హైదరాబాద్ : భారత్‌లో టి.ఎన్.శేషన్ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా వచ్చిన తర్వాతే ఎన్నికల సంఘం తన విధిని నిర్వర్తించిందని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. ది హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్.రామ్ రాసిన వై స్కామ్స్ ఆర్ హియర్ టు స్టే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎలక్షన్ ఫండింగ్ అనేది అన్ని దేశాల్లో ఉందని, అయితే అత్యధికంగా అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ట్రంప్, క్లింటన్‌లు బిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టారన్నారన్నారు. ప్రజలు, పెద్ద, పెద్ద సంస్థల నుంచే అగ్రదేశంలో రాజకీయ పార్టీలకు నిధులు అందుతున్నాయని, అదంతా లాబీయింగ్ పద్ధతిలోనే సాగుతుందన్నారు. ఎన్నికల్లో ఖర్చు చేస్తున్న డబ్బులో చాలావరకు అప్రకటిత ఆదాయం ఉందన్న విషయం వాస్తవమేనన్నారు. ఇది అవినీతి, ఇది కాదు అని ఎలా చెప్పగలరని మంత్రి కెటిఆర్ ప్రశ్నించారు.

ఎన్నికల సంఘం విఫలం : ఎన్.రామ్

ఎన్.రామ్ మాట్లాడుతూ, ఎలక్షన్ ఫండింగ్‌లో జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవడంలో ఎన్నికల సంఘం విఫలమైందన్నారు. రాజకీయ అవినీతి వల్ల ఏడాదంతా కుంభకోణాలు జరుగుతూనే ఉన్నాయని రామ్ అన్నారు. రాజకీయ పార్టీలకు వచ్చే కార్పొరేట్ ఫండింగ్ ఆగడం లేదన్నారు. ఇటీవల పాస్ చేసిన ఫైనాన్స్ బిల్లులో లొసుగులు ఉన్నాయన్నారు. రాజకీయ పార్టీలకు విరాళాలు అందజేసే పెద్ద వ్యక్తుల గుర్తింపును గోప్యంగా ఉంచే విధంగా చట్టాలు తయారు చేశారని ఆయన విమర్శించారు. చెక్కులు, బాండ్ల ద్వారా వచ్చే నిధులపై పారదర్శకత ఉండదన్నారు. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ నిధులు ఆగనంత వరకు అవినీతి, కుంభకోణాలు ఆగవన్నారు. అవినీతి నిర్మూలనను ఉద్యమంలా చేపట్టలేదన్నారు. చిన్న చిన్నగా అవినీతిని అంతం చేసే ప్రయత్నాలు చేయాలని రామ్ సూచించారు. అవినీతిని ఎలా ఎదుర్కోవాలన్న అంశంతో తన పుస్తకం ముగుస్తుందని ఆయన చెప్పారు.

జిఎస్‌టిపై సిఎం కొత్త డ్రామా



టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి

మన తెలంగాణ / హైదరాబాద్ : జిఎస్‌టి విషయంలో కోర్టును ఆశ్రయిస్తామంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలను ఏమార్చేందుకు కొత్త డ్రామాకు తెరలేపుతున్నారని టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'జిఎస్‌టి బిల్లు ఆమోదంలో మీరే భాగస్వాములవుతారు. మీరే ఆమోదిస్తారు.. మీరే కేసులు వేసుకుంటారు.. ఇదంతా ఎవరిని మోసం చేయడానికి?' అని ప్రశ్నించారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, అధికార ప్రతినిధి వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్‌ఎ సండ్ర వెంకట వీరయ్యతో కలిసి సోమవారం టిడిఎల్పీలో రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాల కంటే ముందుగా జిఎస్‌టికి మద్దతు తెలిపిన సిఎం కెసిఆర్ చేయాల్సినదంతా చేసి ఇప్పుడు న్యాయ స్థానానికి వెళ్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి కేంద్రానికి సిఎం కెసిఆర్ ఎప్పుడో లొంగి పోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గతంలో కేంద్రంలో కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణానికి సంబంధించిన వెలుగుబంటి సూర్యనారాయణ కుంభకోణంలో భాగస్వామిగా ఉన్నారని, దీనిపై 2011లో సిబిఐ కేసు నమోదు చేసిందన్నారు. ఈ కేసులో 2015 అక్టోబర్‌లో సిబిఐ అధికారులు హైదరాబాద్‌కు వచ్చి కెసిఆర్‌ను కూడా మూడు సార్లు విచారించారని చెప్పారు. ఒక సందర్భంలో కెసిఆర్ సిబిఐ అధికారుల విచారణకు హాజరుకావొద్దని ప్రయత్నిస్తే నోటీసులు ఇచ్చి విచారణ కోసం చెన్నైకి పిలవాల్సి వస్తుందని సిబిఐ అధికారు లు హెచ్చరించడంతో విచారణకు సిఎం కెసిఆర్ సహకరించారని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కేసులోనే కాకుండా రూ.1.25 లక్షల ఉద్యోగులు ఉన్న సహారా ఇండియా ఉద్యోగుల నుంచి మినహాయించిన పిఎఫ్ మొత్తాన్ని దానికి సహారా సంస్థ జమ చేయాల్సిన మొత్తాన్ని కలిపి ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేయడానికి బదులుగా ఆ రెండు మొత్తాలను సహార సంస్థ వద్దనే పెట్టుకోవచ్చంటూ కెసిఆర్ అనుమతి ఇచ్చారని రేవంత్ రెడ్డి అన్నారు. సుమారు రూ. 7 వేల కోట్లకు పైబడిన సహారా సంస్థ వద్దనే పెట్టుకోవచ్చునని కెసిఆర్ అనుమతి ఇచ్చారన్నారు. ఈ 7 వేల కోట్ల కుంభకోణంలో సహార పిఎఫ్ కుంభకోణంలో ఆ సంస్థ ఎండి జైలులో ఉన్నారని రేవంత్ రెడ్డి అన్నారు. సిబిఐ దర్యాప్తు చేస్తున్న ఈ కేసులో తాను కూడా జైలుకు వెళ్లాల్సి వస్తుందని భయపడిన కెసిఆర్ కేంద్రం ముందు మోకరిల్లారని రేవంత్ రెడ్డి విమర్శించారు.

జిఎస్‌టిపై కెసిఆర్ తప్పుడు ప్రచారం

- నాడు బాగుందన్న సిఎం నేడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

మన తెలంగాణ/హైదరాబాద్ : జిఎస్‌టిపై ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు గడచిన రెండు రోజులుగా చేస్తున్న వ్యాఖ్యలను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిఎం ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. జిఎస్‌టి అనేది కేవలం తెలంగాణకే పరిమితమైనట్లుగా, తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తుందనే విధంగా ముఖ్యమంత్రి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందుగానే జిఎస్‌టికి అసెంబ్లీలో ఆమోదముద్ర వేయించారని, ఆ సందర్భంగా కూడా జిఎస్‌టి వల్ల రాష్ట్రానికి భవిష్యత్‌లో మేలు చేకూరుస్తుందని సిఎం చెప్పారని లక్ష్మణ్ గుర్తు చేశారు. ఇప్పుడు పూర్తిగా యు టర్న్ తీసుకుని రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టులపై 18 శాతం పన్ను విధించడం వల్ల రూ. 19 వేల కోట్ల అధనపు భారం పడుతుందన్న అసంబద్ధ వాదనను తెరపైకి తీసుకు రావడంలో అంతర్యం ఏమిటని లక్ష్మణ్ ప్రశ్నించారు. మరోవైపు ఏ ప్రాజెక్టుపై ఎంత భారం పడుతుందో లెక్కలు తేల్చాలని అధికారులకు సిఎం ఆదేశించారన్నారు. లెక్కలు తేలక ముందే కేంద్రంపై నిందలు వేయడం వెనుక ఉన్న పరమార్థం ఏమిటని ఆయన నిలదీశారు. ప్రాజెక్టులకు ప్రధాన వనరులైన సిమెంట్, స్టీల్, కంకరపై జిఎస్‌టి వల్ల 10 శాతం పన్ను తగ్గిన విషయాన్ని సిఎం ఎందుకు దాస్తున్నారని నిలదీశారు. జిఎస్‌టిని ప్రవేశపెట్టేందుకు రెండేళ్ళ ముందు నుంచే రాష్ట్రాలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు, సమావేశాలను నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, మేధావులతో భేటీలు జరిపి పలు అంశాలపై అభిప్రాయాలను కూడా సేకరించిన అనంతరం 23 శాతం ఉన్న పన్నును 18 శాతానికి కుదించారన్నారు. జిఎస్‌టి వల్ల ఇబ్బందులుంటే చెప్పాలని అరుణ్‌జైట్లీ చెబుతున్నప్పటికీ కావాలని రాద్ధాంతం చేయడం దారుణమన్నారు. **అఖిలపక్షం నిర్వహించండి :** ఏ ప్రాజెక్టుపై ఎంత భారం పడుతుందన్న విషయాన్ని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నోసార్లు మంత్రులు ఈటల, కెటిఆర్‌లు జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాలకు వెళ్లినప్పుడు ఈ విషయాలను ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు.









ఘనంగా రక్షాబంధన్

మన తెలంగాణ/హైదరాబాద్ : సోదరీ, సోదరుల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ వేడుక సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగింది. పలువురి ప్రముఖుల ఇళ్లకు చేరుకున్న సోదరీలు వారి సోదరులకు రాఖీలను కట్టి ప్రేమను, ఆప్యాయతను కురిపించారు. ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్‌కు ఆయన సోదరీమణులు విమల, సకల, లక్ష్మీ బాయి, వినోద రాఖీలు కట్టారు. ఎంఎల్‌ఎ గొంగిడి సునీత, కరీంనగర్ జెడ్‌పి చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు ఆయనకు రాఖీ కట్టిన వారిలో ఉన్నారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీకి మలక్‌పేట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాధ తదితరులు రాఖీలు కట్టారు.

కెటిఆర్‌కు హెల్మెట్ బహుకరణ

రక్షాబంధన్ సందర్భంగా ఎంపి కవిత తన అన్న మంత్రి కెటిఆర్‌కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎంపి కవిత తాను ప్రారంభించిన 'సిస్టర్స్ ఫర్ ఛేంజ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా కెటిఆర్‌కు రాఖీ కట్టిన అనంతరం హెల్మెట్‌ను బహుకరించారు. తర్వాత మంత్రి కెటిఆర్ చెల్లెలు కవితకు పోచంపల్లి చేనేత చీరను బహుకరించారు. బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో సిద్ధిపేట నుంచి వచ్చిన మహిళలు మంత్రి హరీశ్‌రావుకు రాఖీలు కట్టారు.

బిజెపి కార్యాలయంలో రక్షా బంధన్

బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మహిళా మోర్చ ఆధ్వర్యంలో జరిగిన రక్షా బంధన్ ఉత్సవంలో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ బిజెఎల్‌పి నేత జి. కిషన్‌రెడ్డి, ఎంఎల్‌సి ఎన్. రాంచందర్‌రావు, ఎంఎల్‌ఎ చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ఆచారి, మహిళా మోర్చ అధ్యక్షురాలు ఆకుల విజయ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని కలిపి ఉంచే రక్షాబంధన్ : ఇఎస్‌ఎల్ నరసింహన్

మన తెలంగాణ/హైదరాబాద్ : రక్షాబంధన్ లాంటి ఉత్సవాలు కుటుంబాలను కలిపి ఉంచుతాయని గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ అన్నారు. రాఖీ పూర్ణిమను పురస్కరించుకొని రాజ్‌భవన్ దర్బార్ హాలులో సోమవారం రక్ష బంధన్ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆప్యాయతను కనబరుస్తారని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆయన రక్షాబంధన్ సందర్భంగా శాంతి, సంతోషం కలగాలని శుభాకాంక్షలు తెలిపారు. జంటనగరాలకు చెందిన 24 పాఠశాలల నుండి 64 మంది ఉపాధ్యాయులు, 350 మంది విద్యార్థినీలు రక్షాబంధన్‌లో పాల్గొని గవర్నర్‌కు రాఖీలను కట్టారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు చెప్పేందుకు రాజ్‌భవన్‌కు వచ్చిన పాఠశాల విద్యార్థులు, చిన్నారులతో రాష్ట్ర ప్రథమ మహిళ విమలా నరసింహన్ ఉత్సాహంగా ముచ్చటిస్తూ గడిపారు. దేవ్‌నార్ స్కూల్ ఫర్ ది బ్లైండ్ విద్యార్థినీలు కార్యక్రమంలో పాల్గొని గవర్నర్‌కు రాఖీలు కట్టారు.

సెలబ్రిటీల రక్షాబంధన్

తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు తారలు రక్షాబంధన్‌ను ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. టాలీవుడ్ హీరోయిన్స్ రకుల్‌ప్రీత్ సింగ్, అనుపమ పరమేశ్వరన్, నివేద థామస్, రాశీ ఖన్నా, ఛార్మి, యాంకర్ సుమలు తమ సోదరులకు రాఖీలు కట్టి విషెస్ అందుకున్నారు.









“ ఫలితాన్ని గురించి ఎంత శ్రద్ధ చూపిస్తారో, ఆ ఫలితాన్ని పొందటానికి ఉపయోగించే పద్ధతుల విషయంలో కూడా అంతే శ్రద్ధను పాటించండి.
–స్వామి వివేకానంద ”



సంపాదకీయం

ఎల్‌డిఎఫ్‌పై జైట్లీ ఆక్రోశం

కేరళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) అధికారంలోకి వచ్చినపుడల్లా రాజకీయ హింస పెరుగుతోందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఆక్రోశం వ్యక్తం చేశారు. తిరువనంతపురంలో సిపిఐ(ఎం) క్యాడర్లుగా ఆరోపించబడుతున్న వారు హత్యచేసిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త రాజేశ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన జైట్లీ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల హింసను అంగీకరించటానికి నిరాకరించారు. తమ కార్యకర్తలను ఆర్‌ఎస్‌ఎస్ వారు హత్యచేశారన్న సిపిఐ(ఎం)వాదనను ‘‘బాధితులు, హింసకు ఒడిగట్టిన వారి మధ్య ‘బూటకపుపోలిక’గా కొట్టివేసిన జైట్లీ, అటువంటి వైఖరి హింసను అంతం చేయదన్నారు. సిపిఐ(ఎం) నాయకులు తమ కార్యకర్తలను రాజకీయ ప్రత్యర్థులపైకి పురికొల్పకుండా నియంత్రణలో ఉంచే రాజకీయ సంకల్పం, కృతనిశ్చయం ప్రదర్శించాలని సూచించారు. కేరళలో రాజకీయ హింసకు ఆర్‌ఎస్‌ఎస్ కూడా కారణమన్న వాదనతో ఏకీభవించబోనన్న జైట్లీ అభిప్రాయం పక్షపాత దృష్టికి నిదర్శనం.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అది అనుసరిస్తున్న ‘అసహన’ విధానాలను, మైనారిటీలు, దళితులపై ఏదోక సాకుతో సాగుతున్న హత్యలు, దాడులను కేరళలోని హత్యాఘటనతో కప్పిపుచ్చుకునేందుకు జైట్లీ ప్రయత్నం హాస్యాస్పదంగా ఉంది. ‘ఇటువంటి హత్య బిజెపి పాలిత రాష్ట్రంలో జరిగి ఉంటే అవార్డులు తిరిగి ఇచ్చేవారు, సంపాదకీయాలు రాసేవారు, పార్లమెంటు జరగకుండా అడ్డుకునేవారు, దేశం లోపల, బయట ప్రచారాందోళన సాగించేవారు’ అంటూ తన అక్కసునంతా వెళ్లగక్కారాయన.

తిరువనంతపురంలో అత్యంత కిరాతకంగా గావించిన హత్య అత్యంత గర్హనీయం. కొన్ని సంవత్సరాలుగా ఆర్‌ఎస్‌ఎస్–సిపిఐ(ఎం) కార్యకర్తల మధ్య కన్నూర్‌జిల్లాకే పరిమితమైన హత్యా రాజకీయాలు రాష్ట్ర రాజధానికి విస్తరించటం విచారకరం. పార్టీ కార్యాలయాలు, పార్టీవారి ఇళ్లపై దాడులకు పాల్పడరాదని గతంలో జరిగిన అఖిలపక్ష శాంతి సమావేశంలో కుదిరిన అంగీకారానికి భిన్నంగా తిరువనంతపురంలోని కొన్ని ప్రదేశాల్లో ఈ పర్యాయం పరస్పరం దాడులు జరిగాయి. రాజేశ్ హత్యానంతరం గవర్నర్ పి.సదాశివన్ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను పిలిపించి హింసను అరికట్టటానికి తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించారు. ఒక ఘటన ఆధారంగా గవర్నర్ చర్య అసాధారణంగా కనిపించినా పరిస్థితి తీవ్రతకు అది నిదర్శనం. ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో హింస ఆవృత్తాన్ని నిలుపు చేయాల్సిన అవసరాన్ని నాయకులందరూ – సిపిఐ(ఎం), బిజెపి సహా నొక్కి చెప్పారు. తమ కార్యకర్తలను నియంత్రిస్తామని ఆ రెండు పార్టీల నేతలు వాగ్దానం చేశారు. కాని ఆచరణ ఆశించినంతగా లేదు.


హింసను అరికట్టి, శాంతిని పరిరక్షించాల్సిన బాధ్యత పాలకపార్టీగా సిపిఐ(ఎం)పై ఉంది. అదుపు తప్పి హింసకు పాల్పడుతున్న కార్యకర్తలపై అది క్రమశిక్షణాచర్య తీసుకుంటే, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ కూడా అటువంటి పనిచేయక తప్పదు. కేరళలో రాజకీయ హింస గూర్చి బిజెపి వారు జాతీయస్థాయిలో నిందాపూర్వక ప్రచారం చేస్తున్నారు. శాంతి–భద్రతల నిర్వహణలో వైఫల్యం పేరుతో కేంద్ర జోక్యాన్ని రాష్ట్ర బిజెపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కన్నూర్‌ను ‘కల్లోలిత ప్రాంతం’గా ప్రకటించాలని అంతకు ముందు కోరారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారంవల్ల రాష్ట్ర అభివృద్ధి ఎజండా, కీలకమైన టూరిజం రంగం దెబ్బతింటాయని ముఖ్యమంత్రి విజయన్ తాజా అఖిలపక్ష సమావేశం తర్వాత ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి హింసను అరికట్టటానికి ప్రభుత్వం దృఢంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతను, అందుకు పార్టీ తోడ్పడాల్సిన అవసరాన్ని ఇది వక్కాణిస్తున్నది. అరుణ్‌జైట్లీగారు తమ పార్టీని కూడా అదుపు చేయాలి. రాజకీయ కార్యకలాపాలకు హింసను జోడించి విస్తరించాలనే ఆ పార్టీ తాపత్రయం ఇంతవరకు ఫలితాలివ్వలేదు. రెండు చేతులు కలిస్తేనే చప్పుడు అవుతుందన్నట్లు సిపిఐ(ఎం), బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ రెండూ హింసను విడనాడితేనే శాంతిస్థాపన సంపూర్ణంగా సాధ్యం.

సిటీల్లోనూ ఆడశిశుద్వేషమే!

చూపు

దేశంలో ఢిల్లీ, ముంబయి సహా అత్యంత పెద్ద నగరాలు కొన్నిటిలో స్త్రీ, పురుష నిష్పత్తి పడిపోవడం సమస్య ప్రబలంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో కంటె పెద్ద నగరాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. బాలికల పట్ల వివక్షవల్ల గ్రామాల్లోనే ఈ నిష్పత్తిలో తేడాపాడాలు ఉంటాయనే సాధారణ భావనలకు ఇది విరుద్ధమని ప్రభుత్వ సమాచారాన్ని విశ్లేషిస్తే తెలుస్తోంది. 2011లో సగటున ఆరేళ్ల వయస్సు గల ప్రతి 1000 మంది బాలురకు 852 మంది బాలికలే ముంబయిలో ఉన్నా రు. ఈ సగటు ఢిల్లీలో 1000:832 కాగా, హైదరాబాద్‌లో 1000: 942. కన్యా డాట్ లైఫ్ అనే అమెరికాలోని హైస్కూల్ విద్యార్థి తరుణ్ అమర్‌నాథ్ నెలకొల్పిన స్వచ్ఛంద సంస్థ ఈ సమాచారాన్ని విశ్లేషించింది. కేంద్ర ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, జనాభా లెక్కల కమిషనర్ కార్యాలయం ఈ సమాచారాన్ని అందించింది.

దేశంలో స్త్రీ పురుష నిష్పత్తిపై అందుబాటులోఉన్న తాజా సమాచారం అదే. గుజరాత్‌లోని మెహసనాలో బాలలకు ఈ నిష్పత్తి అత్యంత అధ్వానంగా ఉంది. అక్కడ ప్రతి 1000 మంది బాలురకు 762 మంది మాత్రమే బాలికలు ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో యుపిలోని ఆగ్రా (772), మోడీ నగర్ (778), పశ్చిమ బెంగాల్‌లోని ఇంగ్లీష్ బజార్ (781) నిలిచాయి. పశ్చిమ బెంగాల్‌లోని బాలీలో ప్రతి 1000 మంది బాలురకు ఎక్కువగా (1,185) బాలికలు ఉన్నారు. అలాగే అసోంలోని నాగోన్‌లో 1,043, తమిళనాడులోని తాంబరంలో 1,019 మంది బాలికలు ఉన్నారు. కొత్తగా జన్మించిన శిశువులలో సగటున లింగ నిష్పత్తి జాతీయ స్థాయిలో ప్రతి 100 మంది బాలికలకు 102 –106 బాలురుగా ఉంది.



ప్రకృతిలో నిష్పత్తి సర్దుబాటు ఏర్పాటు!

ప్రతి 1000 మంది బాలురకు 943–980 మంది బాలికలుండడం ప్రకృతి సహజం. ప్రకృతి సిద్ధమయిన ఏర్పాటు వల్ల కూడా ఈ నిష్పత్తి సర్దుబాటయ్యే అవకాశం ఉంది. బాలురు పెరిగి పెద్దవారవుతున్న కొద్దీ చనిపోయే ప్రమాదం అధికంగా ఉంటుంది కాబట్టి బాలికల పుట్టుక సంఖ్య అందుకు తగినట్టుగా సర్దుబాటు అవుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా.

దేశంలో పుట్టే బిడ్డ ఆడ/మగ అయివుండాలని కోరుకునే పరిస్థితి ఉందా అన్నది జనాభా లెక్కల సమాచారం విశ్లేషిస్తే ఈ విషయం కొంత వరకు తెలుస్తుంది. సాధారణ లింగ నిష్పత్తి ప్రతి 1000 మంది బాలురకు 943 980 మంది బాలికలుగా ఉంటుంది. ఈ సగటును పరిశీలిస్తే బాలికలపట్ల వివక్ష కనిపిస్తోంది. పుట్టేది ఆడబిడ్డ అని తెలిస్తే పిండం దశలోనే వదుల్చుకోవడం, పుట్టిన తర్వాత చంపడం, గర్భస్రావం చేయించుకోవడంవంటి పద్ధతుల రూపంలో ఆ వివక్ష వుంటోంది.

2031లో మన దేశంలో ప్రతి 1000 మంది పురుషులకు 936 మంది మహిళలు ఉంటారనిప్రపంచ బ్యాంకు నిపుణులు జోస్యం చెబుతున్నారు. ఇది 1951 నాటి లింగ నిష్పత్తి కంటే తక్కువ. అప్పుడు ప్రతి 1000 మంది పురుషులకు 946 మంది మహిళలు ఉన్నారు. 2011లో దేశంలో అత్యంత అధిక జనాభాగల 500 నగరాల సమాచారాన్ని విశ్లేషించి కన్యాడాట్‌లైఫ్ సంస్థ ఈ వివరాలు చెప్పింది. ఆ జనాభా లెక్కల సేకరణలో అత్యంత పెద్ద మునిసిపాలిటీ (ఇప్పటికి కూడా) గ్రేటర్ ముంబయి. దాని జనాభా అప్పట్లో కోటి 20 లక్షలు. మధ్యప్రదేశ్‌లోని నగడా అతిచిన్న నగరం. దాని జనాభా కేవలం లక్ష. 500ల అతిపెద్ద భారతీయ నగరాల్లో మొత్తం జనాభా 22 కోట్ల 10 లక్షలు. ఇది బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ మొత్తం జనాభాతో ఇంచుమించు సమానం.

2011 నుంచి కొద్దిగా మెరుగు

2011లో మన గ్రామీణ ప్రాంతాలతో సమంగా ఈ నగరాల్లో లింగ నిష్పత్తి ఉంది. సగటున అది ప్రతి 1000 మంది పురుషులకు 923 మంది మహిళలు. జనాభా లెక్కల సేకరణ జరిగిన 2011 నుంచి దేశంలో శిశు జననాల్లో నిష్పత్తి కొద్దిగా మెరుగయింది. 2011లో ప్రతి 1000మంది బాలురకు 902 మంది బాలికలు కాగా, 2015 నాటికి ఆ నిష్పత్తిలో బాలికల సంఖ్య 903కి పెరిగిందని ప్రపంచ బ్యాంకు తేల్చింది.

ఆడబిడ్డలపట్ల సాంప్రదాయ దృక్పథంతో సాగుతున్న మారణ కాండను ఆపడంలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలకు ఈ నగరాల నిష్పత్తి సమాచారం ఎంతగానో తోడ్పడుతుంది. అయితే మన దేశంలో ఈ నిష్పత్తి కొన్ని ఇతర దేశాల్లో కంటే మెరుగ్గా ఉంది. లీచ్‌టెన్ స్టీన్ (794), చైనా (867), అజర్‌బైజాన్ (879), ఆర్మేని యా (883)గా బాలికల నిష్పత్తి ఉంటోంది. వాటితో పోల్చితే మన దేశం కొద్దిగా నయం.

ఇరుగు పొరుగు కంటే వెనుకబడ్డాం

అయితే ఈ విషయంలో మనం పాకిస్థాన్ (920), దక్షిణ కొరియా (952), నైజీరియా (944), నేపాల్ (939) కంటే వెనుకబడి ఉన్నామని ప్రపంచ బ్యాంకు హెచ్చరిస్తోంది. మన దేశంలో పుదిచ్చేరి, ఐజ్వాల్ (మిజోరం), కోలార్ (కర్నాటక), కుంభకోణం (తమిళనాడు), నాగర్‌కోయిల్ (తమిళనాడు) నగరాల్లో లింగ నిష్పత్తి భేషుగ్గా ఉంది. గత మూడు దశాబ్దాలుగా దేశంలోని బాలల్లో ఈ నిష్పత్తి పడిపోతూ వస్తోంది. 1991లో ప్రతి 1000 మంది బాలురకు 945 మంది బాలికలు వుండేవారు. 2011 నాటికి ఈ నిష్పత్తి 918కి తగ్గింది. హర్యానా, పంజాబ్, జమ్ము కశ్మీర్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రలలో ప్రతి 1000 మంది బాలురకు 900 కంటే తక్కువ బాలికలు వుంటున్నారు. ఇది ముందుముందు దేశ జనాభాపై ప్రభావం చూపే సమస్య కాగలదు. 1960 దశకంలో పుట్టే బిడ్డ ఆడోమగో తేల్చే సాంకేతిక విజ్ఞానం పెరిగాక ఆడ శిశువులను పుట్టకముందు లేక పుట్టాక హతమార్చే దురాచారం పెరిగింది. దీనికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది అని ఆశ.

– తరుణ్ అమర్‌నాథ్

చట్టం తన పని తాను...



బి.నర్సన్
9440128169

కోర్టు స్టే ఆర్డర్లు గాంధీభవన్ చెట్లకు కాయడం లేదు, కాంగ్రెస్ వాళ్లు ఇలా తెంపి అలా ప్రభుత్వంపై విసరడానికి. ఏ పాలనైనా పాలకుల ఇచ్ఛానుసారంగా సాగదు. పాలకుల అభీష్టానికి, రాజ్యాంగ విధానానికి మధ్య రక్షణగా ఉండేదే న్యాయ వ్యవస్థ. రాష్ట్ర అధినేత తన ఇష్టానుసారంగా ప్రభుత్వ ఉత్తర్వులనిస్తూ, విధానాలను సవరిస్తూ పోతూ ఉంటే నష్ట నివారణ చర్యలుగా ఎవరో ఒకరు కోర్టుల నాశ్రయించక తప్పదు.

మూడున్నరేళ్ల తెలంగాణ ప్రభుత్వంపై మొత్తం 196 కేసులు వేసినట్లు స్వయాన ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించారు. అందులో 170 దాకా నీటి పారుదల ప్రాజెక్టులపైన వేసినవి కాగా మిగతావి ఉద్యోగ నియామక ప్రక్రియలపై వేశారని వివరించాయన.

వచ్చిన కేసునల్లా స్వీకరించేందుకు న్యాయ వ్యవస్థ సిద్ధంగా ఉండదు. అడగగానే స్టే ఆర్డర్లు ఇవ్వడమే దానిపనికాదు. ఎవరి చర్యలలోనైనా న్యాయ బద్ధత లేదని, దాని ద్వారా పౌరులకు నష్టం జరుగుతుందని భావించినపుడే అది చర్యలకుపక్రమించుతుంది. అది ఎవరి జేబు సంస్థ కాదు, నిజానికి కేసునైనా, స్టే పిటిషన్‌నైనా కోర్టులు స్వీకరించేది సమస్యను పరిష్కరించడానికే. విచారించి తీర్పు చెప్పడం వాటి విధి. స్టేలకు కూడా కాలపరిధిని విధిస్తుంది. స్టే ఇచ్చిన తర్వాత కూడా జరుగుతున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకొని స్టేని ఎత్తివేసే అధికారం ఆ కోర్టులకుంటుంది. ఒక కోర్టు ఇచ్చిన స్టే హేతుబద్ధంగా లేనిపక్షంలో బాధితులు అదే కోర్టు ద్వారా గాని, పై కోర్టు ద్వారాగాని స్టేని తొలగింపచేసుకోవచ్చు. ఇదంతా సివిల్ ప్రొసీజర్ కోడ్, సెక్షన్ 10 లో పేర్కొన్న విధానాలకు కట్టుబడి ఉంటుంది.

ఎవరి పాలననైనా ఏదోరకంగా ఎండగట్టేందుకు ప్రతిపక్షాలు దారులు వెతుక్కుంటాయి. అందులో న్యాయస్థానాలకు వెళ్లడం ఒకటి. ప్రభుత్వాలు న్యాయకోవిదుల సలహాలు స్వీకరించి, చేపట్టబోయే చర్యలపై వారితో కూలంకషంగా చర్చించి ముందుకుసాగితే ఇలాంటి ఇబ్బందులు ఎదురుకావు. అప్పుడే తక్కువ సమయంలోనే స్టేని తొలగించుకునే అవకాశం కూడా ఉంటుంది. ప్రభుత్వాధినేతలు దురాలోచనలతో, తమకు ఎదురేముంది అనే భ్రమలతో, కోర్టులో ఆగిపోవాలనే తలంపుతో దుందుడుకుగా ప్రవర్తించినపుడు మాత్రం న్యాయవ్యవస్థ వలలో చిక్కుకోక తప్పదు.

తెలంగాణ ప్రభుత్వం విధానాలపై, ఉత్తర్వులపై కోర్టుల్లో వేసిన కేసుల్లో అధికం ప్రభుత్వపు తొందరపాటు చర్యల, తప్పుడు నిర్ణయాల వల్లనే జరిగినట్లు చెప్పుకోవచ్చు. ఇంకా హైకోర్టు విభజన జరగకపోవడంవల్ల తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. న్యాయవ్యవస్థ కేంద్రం ఆధీనంలో ఉన్నా స్వరాష్ట్ర హైకోర్టును ప్రభుత్వం కొంతలో కొంతైనా ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించవచ్చు. న్యాయమూర్తుల నియామకంలో కేంద్రాన్ని ప్రభావితం చేసుకోవచ్చు. ఉద్యోగనియామకాలు వీలయినంత ఆలస్యం చేయాలనే తలంపుతో తెలంగాణ ప్రభుత్వమే నోటిఫికేషన్లలో లొసుగులు, పరీక్షల నిర్వహణల్లో, నిబంధనల్లో ఇష్టమొచ్చిన మార్పులు తలపెడుతోందని ఓ దినపత్రిక సంపాదకులు ఈ మధ్య టీవీ చర్చలో అభిప్రాయపడ్డారు. ఇందులో నిజమెంతో గాని, నియామక ప్రక్రియల్లో అపరిపక్వత మాత్రం బయటపడుతోంది.

> వచ్చిన కేసునల్లా స్వీకరించేందుకు న్యాయ వ్యవస్థ సిద్ధంగా ఉండదు. అడగగానే స్టే ఆర్డర్లు ఇవ్వడమే దానిపనికాదు. ఎవరి చర్యలలోనైనా న్యాయ బద్ధత లేదని, దాని ద్వారా పౌరులకు నష్టం జరుగుతుందని భావించినపుడే అది చర్యలకుపక్రమించుతుంది. అది ఎవరి జేబు సంస్థ కాదు, నిజానికి కేసునైనా, స్టే పిటిషన్‌నైనా కోర్టులు స్వీకరించేది సమస్యను పరిష్కరించడానికే. విచారించి తీర్పు చెప్పడం వాటి విధి. స్టేలకు కూడా కాలపరిధిని విధిస్తుంది. స్టే ఇచ్చిన తర్వాత కూడా జరుగుతున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకొని స్టేని ఎత్తివేసే అధికారం ఆ కోర్టులకుంటుంది.

కొంత వివరాల్లోకి వెళితే – జులై 2017లో అధ్యాపకుల అర్హతపరీక్షపై హైకోర్టు స్టే ఇచ్చింది. దానికి కారణం విధివిధానాల్లో మార్పులు చేయడమే. వింతైన విషయమేమిటంటే 2017 జూన్ 11 నాడు సంబంధిత పరీక్ష నిర్వహించినాక 2017 జూన్ 29నాడు ఎంపిక విధానాల్లో మార్పులు చేపట్టారు. ఆట మొదలైనాక ఆట విధివిధానాలు మార్చడం ఎలా కుదురుతుందని ప్రశ్నిస్తూ కోర్టు స్టే ఇచ్చింది.

గ్రూప్ II ఫలితాలను నిలుపుదల చేస్తూ 2017 జూన్‌లో హైకోర్టు స్టే ఇచ్చింది. కొందరు అభ్యర్థులు జవాబుపత్రాలను వైటెనర్ పూసి సవరించడమే దీనికి కారణం. ఏప్రిల్‌లో కొందరు పరీక్ష రాసినవారు తాము అనివార్య పరిస్థితులలో జవాబులు దిద్దినామని తమ జవాబు పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు నాశ్రయించారు. అయితే తమ నిబంధన ప్రకారం ఆ జవాబు పత్రాలు చెల్లవని టిఎస్‌పిఎస్‌సి హైకోర్టుకు తెలిపింది. తీరా ఫలితాలు వచ్చేసరికి జవాబులు దిద్దుకున్నవారు మెరిట్‌లిస్టు లో ప్రత్యక్షం అయ్యారు. దీనిపై ఆగ్రహించిన కొందరు కోర్టు తలుపులుతట్టారు. ఇందులో పిఎస్‌సి వైఫల్యమే దాగి ఉంది.

విద్యుత్‌శాఖలో పోయినేడు 1450 ఉద్యోగుల భర్తీ కోసం నియామకం జరిగింది. అయితే ఎంపిక అయిన అభ్యర్థుల్లో 430 మంది ఉద్యోగాల్లో చేరలేదు. వీటిని బ్యాక్‌లాగ్ పోస్టులుగా పరిగణించకుండా మొదటి జాబితాలోంచి మరింత మందికి ఉద్యోగాలు ఇస్తున్నట్లు నిర్ణయం తీసుకుంది. దీనిపై కోర్టు స్టే ఇచ్చింది. సరిపోయేంత మంది ఉద్యోగాల్లో చేరని పక్షంలో అదే జాబితాలోంచి తర్వాతి అభ్యర్థులకు ఉద్యోగాలు ఈయడం జరుగుతుందని ముందే విడుదల చేసిన నోటిఫికేషన్ నియమనిబంధనల్లో పేర్కొనకపోవడమే ఈ స్టేకి ప్రధాన కారణం.

మెడికల్ పిజి కోర్సులకు ఫీజుపెంపు విషయంలో కూడా ప్రభుత్వం కోర్టుకు దొరికిపోయింది. పిజి కోర్సులకు డిసెంబర్ 2016 లో ప్రవేశపరీక్షలు జరిపి అప్పుడే చెప్పని ఫీజు పెంపును మే 9, 2017 న ప్రకటించింది. క్రితం ఐదు లక్షలున్న ఫీజును 24 లక్షలు చేయడంతో అభ్యర్థులు తెల్లమొకం వేశారు. దీనిపై కోర్టు కేవలం నాలుగు వారాల స్టే విధించింది.

సెప్టెంబర్ 2015లో బిసి కులాల జాబితాలోని తెలంగాణ ప్రాంతంలో లేని 26 కులాలను తొలగిస్తున్నట్లు జివో మూడు, 16లో ప్రకటించింది. అయితే బి.ఆర్.అంబేద్కర్ , తెలుగు విశ్వవిద్యాలయాలు విభజన కానందువల్ల ఈ తొలగింపు తొందరపాటు చర్య అంటూ కోర్టు ఆ జీవోలను కొట్టివేసింది.

ఆగస్టు 2015లో గ్రీన్ ఫార్మాసిటీ కోసం రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్ పేటలో 493 ఎకరాల భూసేకరణ కోసం జిఒ 45 విడుదల చేసింది. భూసేకరణ, కేంద్రం స్థిరపరచిన చట్టం 2013 ప్రకారం జరగాలని భావిస్తూ కోర్టు జిఒ 45 చెల్లదంది.

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల నియామకంలోనూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ విధించిన పదేళ్ల ప్రొఫెసర్ అనుభవం అనే నిబంధనను ప్రభుత్వం ఐదేళ్లకు కుదించింది. దీనిపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం నడుస్తోంది.

కోర్టులు ప్రతి పిటిషన్‌కు స్టే ఇస్తాయనుకోవడం కూడా పొరపాటే. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల పంప్‌హౌస్ నిర్మాణ పనులు ఆపి వేయాలని హైకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. దాన్ని హైకోర్టే కాదు సుప్రీంకోర్టు కూడా స్వీకరించలేదు.

మల్లన్నసాగర్ భూసేకరణ విషయానికొస్తే న్యాయపోరాటంలో ప్రభుత్వాన్ని అతలాకుతలం చేసిన జివో 123కి చరమగీతం పాడిన చారిత్రక సందర్భమది. మల్లన్న సాగర్ భూసేకరణకు వ్యతిరేక కూటమితో రచనారెడ్డి అనే అడ్వకేట్ కలిసి రైతులను గందరగోళ పరుస్తున్నారని గత అసెంబ్లీ సమావేశాల్లో స్వయాన ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రస్తావించారు. ఒక ముఖ్యమంత్రి అడ్వకేటు పేరు అసెంబ్లీలో ఎత్తుకోవడం బహుశ ఇదే ప్రథమమేమో.

రచనారెడ్డి సాధారణ లా గ్రాడ్యుయేట్ కాదు, ఆమె ఇంగ్లాండులో యూనివర్శిటీలో అంతర్జాతీయ మానవ హక్కులపై పిహెచ్‌డి చేశారు. ఆ తర్వాత నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయంలో పనిచేశారు. స్వయంగా వెళ్లి మల్లన్నసాగర్ రైతులగోడు తెలుసుకొని వారి పక్షాన న్యాయపోరాటం చేసేందుకు ఆమె సిద్ధపడ్డారు. అసలు రచనారెడ్డి ఈ రంగంలోకి దిగకపోతే జివో 123 రద్దు అయ్యేది కాదేమో. ఇప్పుడు పేరంతా కాంగ్రెస్‌కు దక్కుతున్నట్లుంది.

చట్టం తన పని తాను చేసుకుంటుంది అనే సామెత ఉండనే ఉంది. చట్టం నా మాట వినాలి, నా పనికి అడ్డం రాకూడదు అనుకుంటే ఇబ్బందులు తప్పవు. సొంత తప్పటడుగులను ప్రతిపక్షాల మీదికి తోయడం కూడా రాజకీయమే.

‘ఆధార్’ అంత అవసరమా?



చెన్నూరి గణేశ్
88973 00975

‘సకల రోగ నివారిణి జిందా తిలస్మాత్’ అన్న చందాన తయారైంది కేంద్రంలోని మోడీ సర్కార్ వ్యవహార శైలి. నిన్న మొన్నటి వరకు నల్లడబ్బు పేరుతో నానా హంగామా చేసిన వారు తాజాగా ఆధార్ కార్డు పేరుతో రచ్చ చేస్తున్నారు. ఆధార్ కేవ లం గుర్తింపు కార్డు మాత్రమేనని, దాన్ని తప్పనిసరి చేయాల్సిన పనే లేదని అత్యున్నత న్యాయస్థానం రెండేళ్ల క్రితమే స్పష్టం చేసినా కేంద్రం మాత్రం తన వైఖరి మార్చుకోవడం లేదు. చివరకు ఆధార్ వ్యవహారం ప్రాథమిక హక్కుల భంగం వరకు వెళ్లి దానిపై రాజ్యాంగ ధర్మాసనం విచారించే వరకు వచ్చింది. ఆధార్ గురించి చర్చించే ముందు దాని పూర్వాపరాలు తెలుసుకోవాల్సిన అవసరం కూడ ఉంది. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు దేశ ప్రజలందరికీ ఒకే గుర్తింపు కార్డు ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియ ప్రారంభించారు. నిజానికి వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు 2000 సంవత్సరంలోనే దేశ పౌరులందరికీ ఒకే గుర్తింపు కార్డు ఉంటే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. అందులో భాగంగానే 2003లో అప్పటి హోంమంత్రి అద్వానీ సిటిజెన్ షిప్ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

పదేళ్ళు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ దీనిలో కొన్ని సవరణలు ప్రతిపాదించి చివరకు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నిలేకని నేతృత్వంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (UIDIA) నెలకొల్పారు. ఆధార్ సృష్టికర్తగా భావించే నిలేకని కూడ తాను అనుకున్నది ఒకటైతే జరుగుతున్నది ఒకటి అని వ్యాఖ్యానించడం జరిగింది. అనేక గందరగోళాల నడుమ ఎట్టకేలకు దేశ వ్యాప్తంగా ఆధార్ నమోదు ప్రక్రియను చాలా విస్తృతంగా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఆశించిన మేరకు దీనికి ప్రజల నుంచి మంచి స్పందనే లభించింది.

రానురాను ఆధార్ కార్డు వ్యవహారం ఎంతగా శృతి మించిందంటే ప్రజలపై ప్రభుత్వానికి నమ్మకం లేనంతగా..అలాగే ప్రజలకు ప్రభుత్వంపై అపనమ్మకం పెరిగేంతగా..మొదట కేవలం గుర్తింపు కార్డుగానే పరిగణిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ తర్వాత ప్రజల నుంచి తమకు కావాల్సిన వివరాలు సేకరించుకునేందుకు ఉపయోగిస్తుందా అన్న అపోహలు తలెత్తేలా ప్రవర్తించడం మొదలు పెట్టింది. ఆధార్‌లో ఇచ్చిన ఆధారాల ప్రకారం సబ్సిడీలు ఎత్తివేస్తారనే ప్రచారం జరిగింది. ఎన్నికల సందర్భంగా కేవలం ఆధార్‌ను మాత్రమే గుర్తింపు కార్డుగా పరిగణిస్తామని ప్రకటించిన ఎన్నికల సంఘం కూడా తర్వాత తమ అభిప్రాయం మార్చుకుని మిగతా గుర్తింపు కార్డులకు కూడా అనుమతిచ్చింది.

ఆధార్‌పై ప్రజలకున్న అనుమానాలను నివృత్తి చేస్తూ సుప్రీం కోర్టు 2015లోనే విస్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా మాత్రమే చూడాలని, అవసరమైనంత మేరకే సమాచారం తీసుకోవాలని, ప్రజల గోప్యతకు ఎక్కడా భంగం వాటిల్లకూడదని ధర్మాసనం ఆనాడే స్పష్టం చేసింది. ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని అడిగే హక్కు ప్రభుత్వానికి లేదని సుప్రీం ఆనాడే స్పష్టం చేసింది.

సుప్రీం కోర్టు మార్గ దర్శకాలను సైతం పక్కన పెట్టి ప్రభుత్వంలో భాగమైన ఆదాయ పన్ను శాఖతో సహా బ్యాంకులు, ఇతర సేవా సంస్థ లు చివరకు సెల్‌ఫోన్ సంస్థలు కూడ ఆధార్ అనుసంధానం చేయాలని, లేకుంటే లావాదేవీలు నిలిపి వేస్తామని హెచ్చరికలు కూడా చేస్తున్నాయి. మోడీ సర్కార్ నల్లధనం పేరుతో చేసిన ప్రహసనాల తర్వాత ఆదాయ పన్ను శాఖ మరీ రెచ్చిపోవడమే కాదు ప్రజలంతా దొంగలనే భావన కలిగేలా చేస్తోంది. పన్ను ఎగవేతదారులను, సాధారణ ప్రజలకు ఒకే గాటన కట్టి కేవలం ఒక ప్రభుత్వ శాఖగా కాకుండా సర్వం తానే అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఇక ప్రభుత్వ ఆజమాయిషీలో పని చేయాల్సిన బ్యాంకుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

ఖాతాదారులు మా దేవుళ్లనే బోర్డులను మూలననెట్టి బ్యాంకులకు వచ్చిన వారిని దోషులుగా చూస్తున్నారు. ఆధార్ లేనిదే అసలు ఖాతాలు తెరవని బ్యాంకులు ఇప్పుడు అనుసంధానం పేరుతో సరికొత్త డ్రామాకు తెరలేపాయి. బ్యాంకులకూ చివరకు సెల్‌ఫోన్ కంపెనీలకు కూడా ఆధార్‌లోని వ్యక్తిగత వివరాలు ఎంతవరకు అవసరమో ఎవరికీ అంతుచిక్కని రహస్యం. వ్యక్తిగత వివరాలు వెల్లడించాలని ఒత్తిడి చేయడం ప్రాథమిక హక్కులకు భంగకరమంటూ దాఖలైన పలు పిటీషన్లను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం జస్టిస్ ఖేహర్ నేతృత్వంలో విచారణ మొదలుపెట్టింది. వ్యక్తిగత వివరాలు ప్రాథమిక హక్కులో భాగం కాకపోయినా ఆధార్ అనుసంధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న హడావుడి మాత్రం కచ్చితంగా ప్రజల హక్కులకు భంగకరమే...

ఎడిటర్‌కు లేఖ

తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలి

జోన్ల రద్దు తర్వాత తీసుకోవలసిన చర్యల అధ్యయనానికి నియమించిన సురేష్ చందా కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో

1.ఎల్‌డిసి(జూనియర్ అసిస్టెంట్)స్థాయికి సమానము లేక తక్కువ స్థాయి పోస్టులన్ని జిల్లా స్థాయి పోస్టులుగానే ఉంటాయి. 2.సీనియర్ అసిస్టెంట్ స్థాయి నుండి ఎక్కువస్థాయి నాన్–గెజిటెడ్, గెజిటెడ్ పదవులన్నీ స్టేట్ క్యాడర్ పోస్టులవుతాయి. 3.స్టేట్ క్యాడర్ పోస్టులకు స్థానిక రిజర్వేషన్లు కల్పించుట సాధ్యపడదు.4.ఎక్కువభాగం స్టేట్ క్యాడర్ పోస్టులు పదోన్నతుల ద్వారా నింపుకోవాలి.

పైన పేర్కొన్న అంశాల ప్రకారం పదవులన్నిటికి సీనియర్ అసిస్టెంట్ స్థాయినుండి పైస్థాయి పదవులన్నింటికి గతంలోవున్న రిజర్వేషన్లు(70% నాన్ గెజిటెడ్ పదవులు, 60% గెజిటెడ్ పదవులకు వున్నవి రద్దవుతాయి. అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పరిస్థితి కంటే అధ్వాన్నమైన పరిస్థితి దాపురిస్తుంది. ఈ పరిస్థితి రాకుండా నివారించి, తెలంగాణ ప్రయోజనాలు కాపాడటానికి దిగువచర్యలు అవసరం.

1) కొత్తగా ఏర్పాటైన జిల్లాలను, జిల్లా స్థాయి పోస్టులకు యూనిటుగా తీసుకోవాలి. 2) గత 10 జిల్లాలను 10 జోన్లుగా మార్చాలి. జోనల్ రిజర్వేషన్లు 70%, 60% లను ఈ యూనిట్లకు వర్తింపచేయాలి. 3)గత రెండు జోన్లు v&v1 లలోని జిల్లాలను, మల్టీ జోనల్ గ్రూపింగ్స్‌గా పరిగణించాలి. సివిల్ అసిస్టెంట్ సర్జన్ వంటి పదవుల 60% రిజర్వేషన్లు ఈ జోన్ల వారీగా అమలు చేయాలి.4) ప్రసిడెన్షియల్ ఆర్డరులో 7వ పేరాగ్రాఫ్‌లోని a(i) లో నిర్దేశించబడిన 4సం౹౹ల చదువును, (10) సం౹౹రాల చదువుగా మార్చాలి. అలాగే a(ii) సబ్ పేరాలో మినిమమ్ క్వాలిఫికేషన్ లేని పోస్టులకు, 4సం౹౹రాల నివాసం, బదులు(10)సం౹౹రాలకాలం నివాసం ఉండాలని మార్పు చేయాలి. 5) అదే 7వ పేరాగ్రాఫ్‌లోని సబ్ పేరా(b)(iv)లో తల్లిదండ్రుల నివాసంతో సంబంధం లేకుండా పిల్లల నివాసం పరిగణించాలనే అంశాన్ని తొలగించి, తల్లిదండ్రుల నివాసం బట్టే పిల్లల నివాసం నిర్ణయించాలి.

చాలా రాష్ట్రాలు తల్లిదండ్రులు 10, 15 సం౹౹రాలు నివాసం వుంటేనే, ప్రభుత్వ పదవులు పొందడానికి పిల్లలకు అర్హత కల్గించాయి. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో 10సం౹౹రాలు, హర్యానాలో 15 సంవత్సరాలు, తమిళనాడులో 6 సం౹౹రాలు యిలా, అనేక రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. కనుక తెలంగాణ కూడా తల్లిదండ్రుల నివాసం 15 సం౹౹రాలుగా మార్చడంలో చట్టవ్యతిరేకత ఏమీ లేదు. మన పిల్లల ప్రయోజనాల పరిరక్షణకు అది అవసరం. పై చర్యల ద్వారా తెలంగాణ పిల్లల ప్రయోజనాలు కాపాడబడి ఉద్యోగాలు పూర్తిగా లభిస్తాయి. అలాకాక, జోన్లు, మల్టీజోన్లు రద్దు చేసి జిల్లా, స్టేట్ కాడర్లే వుంటే రిజర్వేషన్లీ (70%&60%)రద్దవుతాయి. ముల్కీరూల్స్ ఆర్టికల్ 371(1), పెద్ద మనుషుల ఒప్పందం ఆర్టికల్, 371–D అన్నీ రద్దు చేసుకున్న పరిస్థితి ఔతుంది. ఆత్మహత్యా సదృశంగా మారుతుంది.

– కె.పురుషోత్తం, 9441609836

యువత



ఈ రోజుల్లో ప్రజలకు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ, అవగాహన పెరిగాయి. ఇంటర్‌నెట్ అందరికీ అందుబాటులో ఉండటంతో ముందుగానే సీజనల్ వ్యాధుల గురించి తెలుసుకుని జాగ్రత్త పడుతున్నారు. నెట్‌తోపాటు ఎప్పటికప్పుడు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు హెల్త్‌కేర్ సర్వీస్ ప్రొవైడ్ సెంటర్లు కృషిచేస్తున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు చికిత్సను అందజేస్తున్నాయి. అపార అవకాశాలను కల్పిస్తోన్న హెల్త్‌కేర్ సర్వీస్ ప్రొవైడర్స్ గురించి తెలుసుకుందాం...

ఆరోగ్యానికే పెద్దపీట

మారుతున్న కాలంతో పాటు కొత్త కొత్త జబ్బులు, రకరకాల రోగాలు కూడా వస్తున్నాయి. ఇప్పటి వారిలో ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన ఎక్కువనే చెప్పవచ్చు. దాదాపు అందరికీ అందుబాటులో ఉన్న టెక్నాలజీ ఇందుకు సహకరిస్తోంది. అన్ని ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించడానికి డిజిటల్ ఇండియా ద్వారా ప్రభుత్వం ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా ముందుకు వచ్చిన వారే హెల్త్‌కేర్ ప్రొవైడర్స్. వీరు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అవసరమైన చికిత్సను అందజేస్తారు. అన్ని రంగాలతోపాటు హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోనూ డిజిటలైజేషన్ పెరిగింది. దీంతో అనేక అవకాశాలు వస్తున్నాయి. భారత దేశంలో హెల్త్‌కేర్ ఇండస్ట్రీ రోజురోజుకీ విస్తరిస్తోంది. ఆరోగ్యం కోసం ఎంత ఖర్చయినా పెట్టడానికి ప్రజలు వెనుకాడటం లేదు. ఇందుకు కారణం ఆర్థిక పరిస్థితి అంతకు ముందు కన్నా మెరుగ్గా ఉండటమే. అంతేకాకుండా విద్యావంతుల సంఖ్య పెరగడం కూడా ఓ కారణం. దీని వల్ల హెల్త్ కేర్ సెంటర్ల ప్రాధాన్యం పెరిగింది.

ఉపాధి అవకాశాలు : మెడికల్ విషయాలకు సంబంధించిన పుస్తకాలు, పరికరాలు, వైద్యరంగంలోనూ ప్రైవేటు ప్రభుత్వ భాగస్వామ్యం పెరిగింది. మెడికల్ టూరిజం వల్ల హెల్త్‌కేర్ సెంటర్ల అవసరం కూడా పెరిగింది. అందువల్ల ఈ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువయ్యాయి. విద్యార్థులతోపాటు ప్రొఫెషనల్స్ కూడా ఐటి, మెడిసిన్ రంగంపై ఆసక్తి చూపుతున్నారు. హెల్త్ సైన్స్‌లో అవకాశాలు అధికంగా ఉండటంతో వీటివైపు మొగ్గుచూపుతున్నారు. హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రికార్డ్స్‌ని డిజిటలైజ్ చేయడం వంటివి చేస్తున్నాయి.

శిక్షణ అవసరం : హెల్త్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో ఉద్యోగం సాధించాలంటే కంప్యూటర్ సైన్స్‌లో శిక్షణ అవసరం. బిజినెస్ మేనేజ్‌మెంట్, ఆసుపత్రులతో సంబంధాలు, ప్రజల ఆరోగ్య విషయాలపై అవగాహన ముఖ్యం. అందుకోసం ఎందులోనైనా బ్యాచిలర్ డిగ్రీ, లేదా మాస్టర్స్ డిగ్రీ , మెడికల్ లేదా కంప్యూటర్ డిగ్రీ చేసినవారై ఉండాలి. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ (IIHMR), ఢిల్లీ ఇందుకు సంబంధించిన కోర్సులను అందిస్తోంది.



స్కిల్స్ ఉండాలి : కంప్యూటర్ అప్లికేషన్, ప్రాసెస్‌ను అవగాహన చేసుకోవడం, సమస్యను పరిష్కరించడం, మార్కెట్ పరిశీలన, వాక్చాతుర్యం, టీం వర్క్‌ను ప్రోత్సహించడం, లీడర్‌షిప్ లాంటి స్కిల్స్ ఈ రంగంలో రాణించడానికి ఉపయోగపడతాయి. ఈ రంగంలో హెల్త్‌కేర్ ఐటి ఎగ్జిక్యూటివ్, హెల్త్ ఇన్‌ఫర్మాటిక్స్ టెక్నీషియన్, చీఫ్ మెడికల్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్లు, హెల్త్‌కేర్ బిజినెస్ అనలిస్ట్, ప్రాజెక్టు మేనేజర్, డెవలపర్, ట్రెయినర్‌లుగా స్థిరపడవచ్చు.

అధిక వేతనాలు : ఈరంగంలో స్థిరపడినవారికి వేతనాలు కూడా బాగుంటాయి. సంవత్సరానికి 3 నుంచి 8 లక్షల వరకు ఉంటుంది. ఆరోగ్యానికి సంబంధించిన అదనపు విజ్ఞానం, సమస్యలపై వెంటనే స్పందించడం, హెల్త్‌కేర్ యూనిట్‌కు దగ్గరగా ఉండటం, టెక్నాలజీ పరంగా అదనపు అవగాహన ఇవన్నీ వున్నవారికి ఈ రంగంలో వేగంగా ఎదగడానికి అవకాశం ఉంది.

కునుకులోనే ఉంది కులాసా





సక్సెస్ కావాలా? వెంటనే ముసుగుతన్ని నిద్రపోండి.. అదేంటి ఎవరైనా కష్టపడండి.. బాగా ప్రిపేరవ్వండి.. నైటవుట్లు చేయండి లాంటివి చెబుతారు. కానీ మీరేంటి ఇలా మంచమెక్కి ముసుగుతన్ని నిద్రపొమ్మంటారు? అని క్వశ్చన్ మార్క్ ఫేస్‌తో మా వైపు చూడకండి. మీరు విన్నది నిజమే హాయిగా ఆరాంగా పడుకోండి.

వేళకు తిండి, కంటి నిండా నిద్రలేక యువత ఆరోగ్యం పాడుచేసుకుంటోంది. సకాలంలో పడుకోవచ్చు కదా అని అడిగితే పనులున్నాయంటారు. ఆఫీసు పనులే పనులా? నిద్రపోవడం కూడా ఒక పనే! ఆఫీసు పని సకాలంలో పనిచేయకపోతే ఎలాంటి ఇబ్బందులు ఉంటాయో వేళకు తిని కాసేపు పడుకోపోతే కూడా అంతకు మించి సమస్యలుంటాయి. ఇదిచాదస్తం కొద్దీ చెబుతున్న మాటలు కావు. సైంటిస్టులు పరిశోధనలు చేసి చెబుతున్న వాస్తవాలు. ప్రశాంతంగా, పీస్‌ఫుల్‌గా హాయిగా ఎవరైతే నిద్రపోతారో వారికి మంచి జ్ఞాపకశక్తి ఉంటుందని కొత్తగా జరిపిన పరిశోధనలలో తేలింది. మంచి నిద్రవల్ల శరీరం, మెదడు, మనసు సేదతీరి శక్తి పుంజుకుని చురుకుగా, పదునుగా, పకడ్బందీగా పనిచేస్తాయి అని సైంటిస్టులు తేల్చి చెప్పారు. కలలురాని, కలతలు లేని నిద్రవల్ల శరీరం శక్తి పుంజుకుని యాక్టివేట్ అవుతుందని వారు చెబుతున్నారు. మనిషి ఎదుగుదలకు కష్టించి పనిచేయడం ఎంత ముఖ్యమో నిద్రపోవడం కూడా అంతే ముఖ్యం. నిద్రపొమ్మన్నారు కదా అని మరీ భారీగా కుంభకర్ణుడి బాబులా నిద్రపోకూడదు. నిద్రపోయేది కాసేపే అయినా హాయిగా పడుకోవాలన్నది వారి సూచన. అంతంత నిద్రలు ఎక్కడ పట్టిఛస్తున్నాయిలెండి అం టారా? నిజమేలేండి..చాలా మంది ఇదే మాట అంటున్నారు. ఈ మధ్య కాలంలో నిద్రలేమి అనేది పెద్ద ఆరోగ్య సమస్యగా తయారవుతోంది. నిద్ర కొరవడితే ఏకాగ్రత దెబ్బతింటుంది. మానసిక ఒత్తిడి పెరిగి గుండెపోటు, కేన్సర్ తగులుకునే ప్రమాదం ఉంది. మధుమేహం, ఊబకాయం ఎటాక్ చేస్తాయి. సరిగా నిద్రపోలేదంటే దానికి కచ్చితంగా కారణాలను అణ్వేషించాల్సిందే. ప్రపంచ ప్రఖ్యాత వెబ్ సైట్ ద హాఫింగ్టన్ పోస్ట్ సహ వ్యవస్థాపకురాలు, ఎడిటర్ ఇన్ చీఫ్ తన జీవితంలో కీలకమైన నిద్రను ఘోరంగా మిస్సవుతున్నానని గుర్తించారు. నిద్ర అనేది ఒక అద్భుతం. ఒకసారి పడుకుని లేచాక ప్రపంచాన్ని ఫ్రెష్ ఐస్ తో చూడొచ్చు. బ్రెయిన్ చకచకలాడుతుంది కనుక ఒంటికి నూతన ఉత్తేజం వస్తుంది. నిద్రలేమితో చాలాకాలం బాధపడ్డాను. వ్యాధులు చుట్టుముట్టాయి. ఎన్ని పనులున్నా సమయానికి పసిపాపలా పడుకుంటున్నాను. ఇప్పుడు హాఫింగ్టన్ నిద్రకు చాలా ప్రాధాన్యతనిస్తారు. ద స్లీప్ రివల్యూషన్: ట్రాన్స్ ఫార్మింగ్ యువర్ లైఫ్, వన్ నైట్ ఎట్ ఎ టైమ్ అనే పేరుతో ఒక పుస్తకాన్నికూడా రాస్తున్నారు. నిద్ర ఉత్పత్తి ఒకే నాణేనికి బొమ్మా బొరుసుల్లాంటివి అంటారామె. నిద్రపోనివారు చాలా అనారోగ్య సమస్యలను ఎదుర్కొవాల్సి ఉంటుందని అందుకే ప్రతీ ఒక్కరూ చంటిపాపలా నిద్రపోవాలనేది ఆమె సలహా.

ఆన్ డిమాండ్ డ్రైవర్ సర్వీస్ వ్యవస్థాపకుడు రాకేశ్ మన్ననూరు పని ఒత్తిడివల్ల రోజుకు మూడు నాలుగు గంటలే నిద్రపోయేవారు. తన సంస్థ స్థాపించకముందు చాలా టెన్షన్ పడేవారు. 40 రోజులపాటు ఇలాగే కష్టపడ్డారు. అయితే మనిషి దేన్నైనా త్యాగం చేయొచ్చుగానీ నిద్ర విషయంలో మాత్రం కాదంటున్నారు. నిద్రను ప్రతి వ్యక్తి అత్యంత ప్రాధాన్యతాంశాల జాబితాలో చేర్చాల్సిందేనంటారాయన. తను పనిచేసే టైమింగ్స్ ఆడ్‌గా ఉండడంతో నాలుగు గంటలకొకసారి 20 నిమిషాలపాటు కునుకు తీయడం అలవాటు చేసుకున్నారు. జీవితమున సగభాగం నిద్దురకే సరిపోవు అని అన్నాడు కాని ఆరుద్ర.. వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. ప్రతీ వ్యక్తి జీవితంలో మూడో వంతు నిద్రకే కేటాయిస్తుంటారు. సరిగా నిద్రపోకపోతే మైండ్ ఆబ్సెంట్ బాడీ ప్రజెంట్ అన్నట్టుగా ఉంటుంది. ఫలితంగా చీదర చీదగా, చిర్రగా కూడా ఉంటుంది. కళ్ళు నిద్ర కోసం ఆవులించుకుపోతుంటాయి. ఎర్రబడి నిప్పుకణికల్లా తయారవుతాయి. ఒక్క నిమిషం కూడా ఒరగడానికి అవకాశం లేకపోవడంతో చికాకు కలుగుతుంది, తలనొప్పి వస్తుంది. కొన్ని నెలలపాటు ఇలాగే జరిగితే బరువు పెరుగుతుంది, కంటిచూపు తగ్గుతుంది, గుండె జబ్బులు వస్తాయి, వ్యాధినిరోధక శక్తి తగ్గుతుంది. కేన్సర్ కూడా వచ్చే ప్రమాదముంది.

హెచ్చరికలతో బెదరగొట్టడం బాగానే ఉందికానీ.. హాయిగా నిద్రపోవడం ఎలాగో చెప్పండి అని అడుగుతున్నారా? అయితే వినండి..

1.నిద్రపోవడానికి రెండు, మూడు గంటల ముందు కాఫీ తాగడం మానేయండి.
2. నిద్రపోవడానికి ముందు స్మార్ట్ ఫోన్ చూడc ఆపేయండి. అందులోనుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల బ్రెయిన్ యాక్టివేట్ అయ్యి నిద్రకు దూరమయ్యే అవకాశముంది. ఐఫోన్ ఉపయోగించే వారు నైట్ షిఫ్ట్ మోడ్ లో పెట్టుకుని నిద్రపోవాలి. ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్స్ నైట్ షిఫ్ట్ యాప్ డౌన్ లోడ్ చేసుకుని రాత్రి పూట దాన్ని యాక్టివేట్ చేయాలి.
3. నిద్రపోయే గది చాలా చీకటిగా ఉండేలా చూసుకోవాలి. నైట్ కిటికీలకు బ్లాక్ కర్టెన్స్ ఏర్పాటుచేసుకోవాలి. శ్రావ్యమైన శబ్దాలు వచ్చే యాప్స్ డౌన్ లోడ్ చేసుకుంటే అవి నిద్రపుచ్చుతాయి. యాప్ స్టోర్ లో వైట్ నాయిస్ యాప్స్ దొరుకుతాయి. డౌన్ లోడ్ చేసుకోండి. వర్షం, అలల చప్పుడు ఆ యాప్స్ నుంచి వస్తాయి.
4. ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. జిహ్వాచాపల్యాన్ని పక్కనపెట్టి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.
5. నిద్రపోయే ముందు లైట్ గా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్, కబాబ్స్ తినడం తగ్గించండి. అవి తింటుంటే ఉంటుంటే ఉంటాయి.. కానీ.. ఏం చేస్తాం.. తప్పదు..
6. వీకెండ్స్‌లో బారెడు పొద్దెక్కినా నిద్రలేవకపోవడం, మిగిలిన రోజులు తెల్లవార్లు మేలుకొని పనులు చేయడం ఎంత మాత్రం మంచిదికాదు.
7. రోజుకు ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. నిద్ర లేవడానికే కాదు ఎప్పుడు నిద్రపోవాలో కూడా గుర్తుచేసేలా అలారం సెట్ చేసుకోవాలి.
8. స్టార్టప్స్ ప్రారంభించేవారు ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఒకే సారి పది విషయాల గురించి ఆలోచించాల్సి ఉంటుంది. నిద్రపోయే ముందు మెదడును ఒత్తిడికి గురిచేయరాదు.
9. ఎప్పుడు నిద్రపోవాలో అప్పుడు నిద్రపోయి మెదడును కంట్రోల్ చేయాలి. ఎన్ని పనులున్నా ఇట్స్ టైం ఫర్ స్లీప్ అంటూ బెడ్ మీదకు వెళ్లిపోవాలి. లేకపోతే కూర్చున్న కుర్చీలోనే కాసేపు కునుకుతీయాలి.
10. సరిగా నిద్రపట్టాలంటే పగటిపూట కొంచెంసేపు వ్యాయామం చేయాలి. అనవసర విషయాలపై దృష్టిపెట్ట కూడదు.

ఐటి ఉద్యోగాలు

సాఫ్ట్‌వేర్ డెవలపర్ – నెట్‌వర్కింగ్

కంపెనీ	: సాండ్విన్
అర్హత	: ఎంఇ/ఎం.టెక్, బిఇ/బి.టెక్
స్కిల్స్	: ప్రోగ్రామింగ్ స్కిల్స్, సి/సి++/జావా
జాబ్ లొకేషన్	: బెంగళూరు
చివరి తేదీ	: 11 ఆగస్టు 2017

వెబ్ డెవలపర్

కంపెనీ	: సప్రా
అర్హత	: బిసిఎ, ఎంసిఎ, బిఇ/బి.టెక్
స్కిల్స్	: జావాస్క్రిప్ట్
జాబ్ లొకేషన్	: బెంగళూరు
చివరి తేదీ	: 20 ఆగస్టు 2017

డెవలప్‌మెంట్ ఇంజినీర్– మొబైల్ అప్లికేషన్స్

కంపెనీ	: ఐలాజిక్ హెచ్‌ఆర్ సొల్యూషన్స్
అర్హత	: బిఇ/బి.టెక్
స్కిల్స్	: హార్డ్‌వేర్ మెయింటెనెన్స్
జాబ్ లొకేషన్	: హైదరాబాద్, చెన్నై
చివరి తేదీ	: 15 ఆగస్టు 2017

వెబ్ డిజైనర్

కంపెనీ	: టెక్నోవినిటి సిస్టమ్స్ ప్రై.లిమిటెడ్
అర్హత	: బిఎ,/బి.డిజైన్, బిసిఎ, బి.కామ్
స్కిల్స్	: స్ట్రాంగ్ డెవలప్‌మెంట్ స్కిల్స్, హెచ్‌టిఎంఎల్, సిఎస్ఎస్
జాబ్ లొకేషన్	: ఢిల్లీ, ఫరీదాబాద్, గుర్‌గావ్
చివరి తేదీ	: 20 ఆగస్టు 2017

వెబ్ డిజైనర్

కంపెనీ	: విడి టెక్నో సొల్యూషన్స్
అర్హత	: ఎంఇ/ఎం.టెక్, బిఎస్‌సి,బిఇ/బి.టెక్
స్కిల్స్	: సి++, హెచ్‌టిఎమ్ఎల్
జాబ్ లొకేషన్	: చెన్నై
చివరి తేదీ	: 12 ఆగస్టు 2017

జూ.సాఫ్ట్‌వేర్ డెవలపర్

కంపెనీ	: అటాక్స్ టెక్నాలజీస్
అర్హత	: ఎంఎస్‌సి,ఎంసిఎ, బిఇ/బి.టెక్
జాబ్ లొకేషన్	: హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు
చివరి తేదీ	: 19 ఆగస్టు 2017

పై ఉద్యోగాలకు సంబంధించిన మరిన్ని వివరాలకు www. freshersworld.comలో చూడవచ్చు.

లేడీ కమాండర్‌గా యంగెస్ట్ 'దివ్య'



పైలెట్ కావాలని కన్న కలలను సాకారం చేసుకున్న 30 ఏళ్ల దివ్య 777 బోయింగ్ విమానాన్ని నడిపే మహిళా ఆఫీసర్లలో ప్రపంచంలోనే అత్యంత పిన్నవయస్కురాలు. పఠాన్‌కోట్‌లో పుట్టిన దివ్య బాల్యం అంతా విజయవాడలో గడిచింది. తండ్రి ఆర్మీలో పనిచేసేవారు. ఉద్యోగ రీత్యా ఆమె కుటుంబం కొంతకాలం విజయవాడలో ఉంది. విజయవాడలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుకొంది. నాకు కల్లో కూడా విమానాలు కనిపించేవి. అయితే విజయవాడలో అంత పెద్దగా విమానాలు కనిపించవు. దీంతో విమానాన్ని నడపాలనే కోరిక మరింత ఎక్కువయిందని తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకుంది. నాయకత్వ లక్షణాలు కలిగిన దివ్య అథ్లెటిక్ కూడా. స్కూల్ ఛాంపియన్. ఇంజినీరింగ్‌లో చేరినా పైలెట్ కావాలనే కోరిక తీవ్రం కాసాగింది. రాయ్‌బరేలీ అకాడెమీకి దరఖాస్తు చేసింది. సీటొచ్చింది. 17 ఏళ్ల వయసులోనే ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉరాన్ అకాడెమీలో చేరింది. ఆలిండియా పరీక్షలో 34 మంది ఎంపికయ్యారు. అందులో దివ్య ఒకరు. రాయ్‌బరేలీ ఫ్లయింగ్ స్కూల్‌లో చేర్పించాక కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనికితోడు పైలెట్ అవడం అవసరమా అంటూ చుట్టుపక్కల వారి అవహేళనలు. ఆ సమయంలో తన కుటుంబం తనకు భరోసా ఇచ్చిందని గుర్తుచేసుకుంది దివ్య. 2006లో ఫ్లయింగ్ స్కూల్ పూర్తిచేసింది. అప్పటికి ఆమె వయసు 20. బోయింగ్ 737 నడపడానికి శిక్షణ కోసం స్పెయిన్ వెళ్లింది. కొంతకాలం అవి నడిపాక బోయింగ్ 777 నడపాలనే కోరిక పుట్టింది. దీని కోసం లండన్ వెళ్లింది. ఈ రకం విమానాలు ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ట్విన్ జెట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు. వీటిని నడిపేందుకు ప్రత్యేక శిక్షణ అవసరం. విదేశీ యాసలో ఆంగ్లం మాట్లాడటం దివ్యకు ఎదురైన మరో సమస్య. కొత్తలో ఆమె ఇంగ్లీషు విని నవ్వేవారు. ఎంతో బాధను దిగమింగి ఆ సమస్యను అధిగమించింది. అత్యంత చిన్నవయసులోనే కమాండర్‌గా ఎదిగింది. బోయింగ్ 777 కి కమాండర్. కష్టపడితే సాధించలేనిది ఏమీలేదని నిరూపించింది.

సింధు జలాల ఒప్పందానికి భారత్, అమెరికా విద్రోహం



న్యూఢిల్లీ: 'సింధు జలాల ఒప్పందానికి తూట్లు పొడిచే అంతర్జాతీయ కుట్రకు భారత్, అమెరికా ఒడిగడుతున్నాయి' అని పాకిస్థాన్ మీడియా రాసింది. ఇంకా ఈ రెండు దేశాలు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా అఫ్గానిస్థాన్ చేస్తున్న కుట్రలకు కూడా మద్దతు ఇస్తున్నాయంది. 'పాకిస్థాన్ చేస్తున్న శాంతి ప్రయత్నాలకు అఫ్గానిస్థాన్ ఏ మాత్రం ప్రతిస్పందించకుండా పాకిస్థాన్‌ను లక్ష్యం చేసుకుని నిందలకు పాల్పడుతోంది, ' అని పాకిస్థాన్ కొత్త విదేశాంగ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అన్నారు. కొత్తగా విదేశాంగ మంత్రి అయ్యాక ఏర్పాటు చేసిన తొలి విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ ' పాకిస్థాన్ ఇరుగుపొరుగు దేశాలతో మంచి సంబంధాలు నెలకొల్పుకోవాలనుకుంటోంది. అది పాకిస్థాన్ బలహీనతగా అర్థం చేసుకోకూడదు' అని చెప్పారు. సింధు జలాల ఒప్పందాని కి సంబంధించిన క్లాజుల గురించి ప్రస్తావిస్తూ భారత్, అమెరికాలు ఎలా విద్రోహానికి పాల్పడుతున్నాయన్న విషయాన్ని ఆయన ప్రత్యేకంగా పేర్కొనలేదు. కానీ ఒప్పందానికి సంబంధించిన క్లాజుల విషయంలో అంత ర్జాతీయ సమాజం పాకిస్థాన్‌ను అంధకారంలో ఉంచాయని పేర్కొన్నారు. ఆసిఫ్ అమెరికాను కాకుండా ప్రపం చ బ్యాంకు గురించి అని ఉంటారు. ఎందుకంటే జీలం, చినాబ్ నదులపై రెండు డ్యామ్‌లు భారత్ నిర్మించిం ది. అప్పుడు సింధు జలాల ఒప్పందానికి ప్రపంచ బ్యాంకే గ్యారంటర్‌గా తన పాత్ర పోషించిందని ఆసిఫ్ ఇటీవల తెలిపారు.

ఐసెట్ తుది దశ కౌన్సెలింగ్ షెడ్యూల్

మన తెలంగాణ/హైదరాబాద్ : టిఎస్ఐసెట్ 2017 తుది దశ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను టిఎస్ఐ సెట్ కన్వీనర్ ఎ.వాణిప్రసాద్ విడుదల చేశారు. ఆగస్టు 8న సర్టిఫికేట్లను తనిఖీ చేసి, ఆగస్టు 8, 9వ తేదీల్లో ఆప్షన్లను ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఆగస్టు 11న సీట్లను కేటాయిస్తారు.

ప్రవేశ గడువు పొడిగింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : తొలి దఫా ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సులకు గాను తొలి దశ కౌన్సిలింగ్‌లో సీట్లు కేటాయించబడ్డ అభ్యర్థులు కళాశాల్లో చేరేందుకు గడువును ఆగస్టు 9వ తేదీకి పొడిగించారు. పలువురు అభ్యర్థులు సహాయ కేంద్రానికి చేసుకున్న వినతి మేరకు ఆగస్టు 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు చేరేందుకు అనుమతించినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు.

బయో ఉత్పత్తులపై బడా కంపెనీల ఉక్కుపాదం



మన తెలంగాణ/హైదరాబాద్: పర్యావరణానికి హాని చేయని సురక్షితమైన సేంద్రీయ, బయో ఉత్పత్తులను వ్యయసాయం, రైతు సంక్షేమం కోసమే ఉత్పత్తి చేస్తున్నామని బయో ఉత్పత్తుల తయారీదారుల సంఘం రాష్ట్ర అధ్య క్షులు డాక్టర్ సివి రత్నకుమార్ తెలిపారు. బయోఉత్పత్తులపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బయో ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించే లాబ్స్,పారామీటర్లు లేకపోయినప్పటికీ బయోఉత్పత్తులతో ప్రయోజనం లేదని, తెలుగు రాష్ట్రాల్లో వీటిపై అనధికారికంగా నిషేధం విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు పదివేల మంది ఉద్యోగులు, వారి కింద పని చేసే మార్కెటింగ్ సిబ్బందితో మొత్తంగా వేలాది మంది రోడ్డున పడే ప్రమాదముందన్నారు. బయో ఉత్పత్తులపై బడా కంపెనీలు ఉక్కుపాదం మోపుతున్నాయని ఆరోపించారు. బయో ఉత్పత్తులు పంటలకు హానికారకం కాదని ఏ పరిశోధనా కేంద్రం నిర్ధారించలేదని, ఇప్పటి వరకు వాడిన ఏ రైతూ బయో ఉత్ప త్తుల కారణంగా తమకు నష్టం జరిగిందని ఫిర్యాదు కూడా చేయలేదని ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తంగాసేంద్రీయ ఎరువులను, పురుగుల మందుల ఉపయోగంతో పర్యా వరణాన్ని రక్షించాలనే దిశగా ముందుకు వెళ్తుంటే తెలుగు రాష్ట్రాలలో మాత్రం అందుకు భిన్నంగా బయో ఉత్పత్తులపై ఉక్కుపాదం మోపేందుకు ప్రయత్నించడం మంచి పద్ధతి కాదన్నారు.

డ్రగ్స్ కేసు సిబిఐకి : రేవంత్ పిల్

న్యూఢిల్లీ / హైదరాబాద్: డ్రగ్స్ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడు రేవంత్‌రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. డ్రగ్స్ నియంత్రణపై కీలకపాత్ర పోషించే నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ప్రమేయం లేకుండా సిట్ దర్యాప్తు చేయడం వల్ల ఉపయోగం లేదని పిల్‌లో పేర్కొన్నారు. ప్రతివాదులుగా చేర్చారు. సిట్, కేంద్ర స్థాయి దర్యాప్తు సంస్థలైన ఎన్‌సీబీ, రెవిన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్, కేంద్ర ఆర్థిక ఇంటెలిజెన్స్ బ్యూరో, ఈడీ, సీబీఐ సాయం తీసుకోకపోవడం వల్ల దర్యాప్తు ఉపయోగం లేదన్నారు. కేవలం సినీ రంగానికే కాకుండా బడి పిల్లలు, కాలేజీ విద్యార్థులు, ఎంఎల్‌సీ ఉద్యోగులు బాధితులని, గోవా నుంచి డ్రగ్స్ వస్తున్నాయని చెబుతున్నపుడు జాతీయ స్థాయి సమస్యగా చూసి సీబీఐతో విచారణకు ఆదేశించాలని పిల్‌లో హైకోర్టును కోరారు. ప్రతివాదులుగా సిట్, ఎన్‌సీబీ, సిబీఐ, ఈడీ తెలంగాణ ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శులను చేశారు.
బిసి మీటింగ్ 07082017 పేరుతో ఫోటో బ్యూరో ల్యాన్‌లో ఉన్నది

బిసి బిల్లుకు ఆమోదం లభిస్తుంది

మన తెలంగాణ/హైదరాబాద్: బిసి కమిషన్ బిల్లు రాజ్యాసభలో ఆమోదం పొందుతుందని కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి హన్సరాజ్ గంగారం అమర్ ఆశాభావం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో సోమవారం బిసి రాష్ట్రీయ మహా సంఘటన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడి నాయకత్వంలోనే బిసిలకు న్యాయం జరుగుతుందన్నారు. బిసిలకు ఎప్పుడు అన్యాయం జరిగిన వారికి తాను పూర్తి అండగా ఉంటానని హామీనిచ్చారు. మహాసంఘటనలో 9 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘటనలో జెడియు నేత శరత్‌యాదవ్‌ను సన్మానించారు.ఈ సమావేశంలో జస్టిస్ ఈశ్వరయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య,జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎపి బిసి ప్రజాసంక్షేమ సంఘం అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వర్, బిసి సంఘం నాయకులు ఇ.నిరంజన్, పి.లక్ష్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

వెహికిల్ ఇన్‌స్పెక్టర్లపై సస్పెన్షన్ వేటు

మన తెలంగాణ/హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా విజయవాడ, కడపకు చెందిన లారీలకు అనుమతిఇచ్చిన ఐదుగురు మోటర్ వెహికిల్ ఇన్‌స్పెకర్లను ప్రభుత్వం సస్పెండ్ చేసినట్లు చేసింది. విజయవాడ, కడపకు చెందిన లారీలను కార్యాలయానికి రాకుండానే వాటికి అనుమతినిచ్చారు. ఈ అంశంపై ఐదుగురు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేశారు.

నేడు ఎరువులు, విత్తనాలపై సమీక్ష

మన తెలంగాణ/హైదరాబాద్: సాయిల్ హెల్త్‌కార్డులు, ఎరువులు, విత్తనాలు తదితర అంశాలపై మంగళవారం కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించనున్నారు. అధికారులు సమగ్ర సమాచారంతో రావాలన్నారు.

నయీమ్ గ్యాంగ్‌పై పి.డి

(మొదటిపేజీ తరువాయి)
వారిని నరికేయడం తదితర వాటిపై కూడా అధికారులు ఆధారాలను సేకరించారు. నయీమ్‌తో కలిసి విందులు, వినోదాలు చేసుకున్న అధికారులు, నేతల ఫొటోలను కూ డా సిట్ సేకరించింది. ఈ కేసు దర్యాప్తు మొదట్లో వందల సంఖ్యలో అరెస్టులుంటాయని, అనేక మంది పోలీసు అధికారులు, రాజకీయ నేతలకు కటకటాలు తప్పవని అందరూ భావించారు. కానీ క్రమక్రమంగా సిట్ తన దర్యాప్తును నీరిగార్చింది. నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా మీడియాలో కథనాలు వెలువరించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో సిట్ తాజాగా ప్రకటన విడుదల చేసి తన కేసు దర్యాప్తు నివేదికలోని అంశాలను పేర్కొంది.
వేర్వేరు ప్రాంతాలలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు 227 కేసులను నమోదు చేసిన సిట్ 128 మందిని అరెస్టు చేసి, మరో 109 మందిని పోలీసు కస్టడీకి తీసుకున్నట్లు పేర్కొంది. మొత్తం 22 కేసుల దర్యాప్తు పూర్తి కాగా 9 కేసులలో చార్జ్‌షీట్‌లు దాఖలు చేసినట్లు వెల్లడించింది. మిగతా కేసుల దర్యాప్తు పురోగతిలో ఉందని, నయీమ్ గ్యాంగ్‌లో కీలకులు 14 మందిపై పిడి చట్టం ప్రయోగించామని పేర్కొన్నారు. నయీమ్‌తో అంటకాగిన అయిదుగురు పోలీసు అధికారులను డిజిపి సస్పెండ్ చేయడం జరిగిందని, మరో 20 మంది పోలీసులపై విచారణ కొనసాగుతుందన్నారు. కేసు దర్యాప్తును త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

చిన్న వర్షానికే పెద్ద గుంతలు

- గుంతలమయంగా రహదారులు
- హైదరాబాద్‌లో పరిస్థితి మరింత అధ్వానం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలమయమౌతున్నాయి. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, అలాగే మండలాల నుండి జిల్లాలకు వెళ్లే రోడ్డు కూడా గుంతలు పడి అత్యంత దయనీయంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే నీరు ఆ గుంతల్లోకి చేరుతుండడంతో వాహన చోదకులు దీనిని గమనించడం లేదు. ఫలితంగా పలు జిల్లాల్లో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అన్నింటికి మించి రాజధాని హైదరాబాద్ రోడ్లు అయితే మరీ దారుణంగా ఉన్నాయి. ఈ రోడ్ల మీదుగానే మంత్రులు, ఉన్నతాధికారులూ నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నా తమకేమీ పట్టనట్లు మిన్నకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తన వంతుగా రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించినా ఆ పనులు మరింతగా ఊపందుకోవాల్సి ఉంది.

కోట్లాది నిధులు వెచ్చిస్తున్నా ..

ప్రస్తుత 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఆర్ అండ్ బి శాఖ పరిధిలో రూ. 1550 కోట్లు వ్యయం చేసి 5150 కి.మీ మేర బిటి రోడ్లకు ప్రభుత్వం మరమ్మతులు చేసింది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోనూ రూ.2247 కోట్ల వ్యయంతో 14,690 కి.మీ. రోడ్లకు మరమ్మతులు చేశారు. ఇది కాకుండా రాష్ట్రంలో రహదారుల వెడల్పు, అభివృద్ధి కార్యక్రమాల పేరిట ప్రభుత్వం మరో రూ.4564 కోట్ల వ్యయంతో 8987 కి.మీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. జాతీయ రహదారులతో పోలిస్తే రాష్ట్ర రోడ్లు అత్యంత అధ్వాన్నంగానే ఉన్నాయి. చిన్న పాటి వర్షాలకే పెద్ద పెద్ద గుంతలు పడుతున్నాయి. ఈ రోడ్లపై లారీలు, ఇతర భారీ వాహనాలు వెళ్తే గుంతలు మరింత లోతుగా పడడం ఖాయమైంది. రోడ్ల నిర్మాణంతోనే చేతులు దులుపుకుంటున్న సదరు కాంట్రాక్టర్లు వర్షాలకు గుంతలు పడితే అవి తమకేం సబంధం అన్న రీతిగా వ్యవహరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అయితే ఒక్క రోజులోనే కొట్టుకుపోతున్న రహదారులు కోకొల్లలుగానే ఉంటున్నాయి. నాణ్యతను పట్టించుకోక పోవడం, పైపై మరమ్మతుల చేసి చేతులు దులుపుకుంటుడం వల్లే గోతుల పూడిక సత్ఫలితాలివ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న చిన్న పాటి వానలకే హైదరాబాద్ రోడ్లు పెద్ద ఎత్తున గుంతలు పడుతున్నాయి. ప్రతి రోజూ 200 కి.మీ పొడవున కనీసం 600 గుంతలకు అయినా మరమ్మత్తుల చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకున్నా.. ఆచరణలో మాత్రం 450–500 గుంతకు మించి మరమ్మతుల చేయడం లేదు. దీనికి తోడు ఎప్పటికప్పుడు మరిన్ని కొత్త రోడ్లు మరమ్మతుల జాబితాలో చేరుతుండడంతో అధికారులు తలపట్టుకుంటున్నారు.

మబ్బుల మాటున చంద్ర గ్రహణం

న్యూఢిల్లీ: దేశంలో కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు, దట్టంగా మబ్బులు కమ్ముకుని ఉండటంతో చంద్ర గ్రహణ వీక్షణం సాధ్యం కాలేదు. ఈ ఏడాది తొలిసారిగా సంభవించిన పాక్షిక చంద్ర గ్రహణం భారతదేశంలో అన్ని చోట్లా కన్పిస్తుందని, ఇది ఖగోళ అద్భుతం అని, దీనిని నేరుగా చూడవచ్చునని ఖగోళ శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే సోమవారం ఢిల్లీ ఇతర ప్రాంతాలలో వర్షాలు పడటం, ఆకాశం మేఘావృతం అయి ఉండటంతో చంద్రుడే కన్పించని స్థితి ఏర్పడింది. గ్రహణం సమయంలో చంద్రుడి వీక్షణానికి నెహ్రూ ప్లానిటోరియంలో అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రహణం దశలను తీన్‌మూర్తి లాన్స్ నుంచి టెలీస్కోప్‌ల ద్వారా చూసేందుకు చేసిన ఏర్పాట్లు చేయాలనుకున్నా, వాతావరణం అనుకూలించలేదు. గ్రహణం వీక్షణం గురించి ప్లానిటోరియం డైరెక్టర్ ఎన్ రత్నశ్రీ అంతకు ముందు ప్రకటన వెలువరించారు. రాత్రి 9 గంటల తరువాత క్రమంగా మొదలైన గ్రహణం వివిధ దశలుగా సాగింది. పాక్షిక గ్రహణం రాత్రి 10.52 గంటలకు పూర్తి స్థాయిలో ఉంది. రాత్రి 12.48 గంటల వరకూ ఈ గ్రహణం కొనసాగింది.

ఐటికి డ్రగ్స్ ఇచ్చా

(మొదటిపేజీ తరువాయి)
మరిన్ని కీలక విషయాలకు సంబంధించిన అంశాలపై కమింగో సమాధానాలు చెప్పలేదని, తెలివిగా ప్రశ్నల నుంచి తప్పించుకున్నట్లు అధికారులు తెలిపారు. ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌లలోని డాటాను సేకరించేందుకు కమింగో నిరాకరించాడని చెప్పారు. కమింగో అరెస్టు రోజున సిట్ అధికారులు సినీ నటి చార్మీని విచారించారు. ఆయన అరెస్టు అయిన విషయాన్ని చార్మీకి చెప్పిన అధికారులు కమింగోకు సంబంధించిన సమాచారంపై ప్రశ్నించినట్లు తెలిసింది. కమింగోను అదుపులోకి తీసుకున్నామని అధికారులు చెప్పినపుడు చార్మీ కొంత విస్మయానికి గురయ్యారని, ఆయన గురించి అడిగినపుడు తమకేం తెలియదని, అతడెవరో కూడా పరిచయం లేదని సమాధానం చెప్పినట్లు తెలిసింది.
విక్టర్‌ను ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్న సిట్: నైజీరియాకు చెందిన విక్టర్‌ను ఎక్సైజ్ అధికారులు ఈ నెల 4 వ తేదీన అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కెల్విన్, కమింగోకు విక్టర్‌కు సంబంధాలున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. విక్టర్ నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌లో హైదరాబాద్‌కు చెందిన కొంత మంది నంబర్లను అధికారులు గుర్తించారు. ముంబై నుంచి విమానంలో హైదరాబాద్ చేరుకున్న వెంటనే ఎక్సైజ్ అధికారులు విమానాశ్రయంలోనే పట్టుకునేందుకు ప్రయత్నించగా వారిపై దాడికి తెబడ్డాడు. చివరకు అధికారులు స్థానికుల సహాయంతో అతడిని పట్టుకున్నారు. ప్రాథమికంగా అధికారులు ప్రశ్నించగా అతచెలాంటి సమాచారం చెప్పలేదు. కమింగో మాదిరిగా ఇతడు కూడా భాష సమస్య అని పేర్కొనడంతో చేసేదేమీ లేని అధికారులు అతడిని రిమాండ్‌కు తరలించారు. కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని ప్రశ్నించాలని భావిస్తున్న అధికారులు పిటిషన్ వేసేందుకు సిద్ధమయ్యారు.

జిఓ 130 మేరకే

(మొదటిపేజీ తరువాయి)
తెలిపారు. ఎ కేటగిరీలో సీట్లను 50 శాతానికి చేయడం బి, సి కేటగిరీ సీట్లను వరుసగా 35శాతం, 15 శాతానికి పెంచడంపై వీరు అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషనర్ల తరపున రచనా రెడ్డి వాదించారు. అంతకు ముందటి జివోలో ఉన్న సీట్ల శాతానికి ఇప్పటి జివోలోని శాతానికి తేడా ఉందని, మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లను పెంచడం, ఎ కేటగిరిలో సీట్లను తగ్గించడంతో మైనార్టీ విద్యార్థులు అత్యధిక నీట్ పరీక్ష ర్యాంకులు వచ్చినా తప్పనిసరిగా కేటగిరి బి సీట్లకు దరఖాస్తు చేసుకోవల్సి వస్తుందని, ఎ కేటగిరి సీట్లు తగ్గిపోయి భర్తీ కావడంతో మైనార్టీ విద్యార్థులకు ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. ప్రభుత్వం లాభాల యావలో పడిందని, కేటగిరి సిలోని మేనేజ్‌మెంట్ కోటా సీట్లు ఈ లాభార్జనకు సరిపోతాయని, అయితే కేటగిరి బిలోని సీట్లను కూడా ఈ మేరకు పెంచడం అనుచితం అని లాయర్ తెలిపారు. వాదనలు పరిశీలించిన ధర్మాసనం జివో ఎంఎస్ నెంబరు 115,117, 119లపై స్టేను విధిస్తున్నట్లు, ఇంతకు ముందటి 130 జివో పాటించి తీరాల్సి ఉంటుందని ఆదేశిస్తున్నట్లు స్పష్టం చేసింది. ప్రతివాదులకు ధర్మాసనం నోటీసు వెలువరించింది.

హైకోర్టు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)
తరపున హాజరైన అడ్వకేట్ కౌంటర్ దాఖలు చేసేందుకు రెండు వారాల గడువు కావాలని కోరగా అందుకు అనుమతించింది. గతంలో కౌంటర్ దాఖలు చేయాలని గ్లోబల్, కేర్ తదితర ఆసుపత్రులకు హైకోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విచారణ సందర్భంగా పిటీషనర్ తరపున న్యాయవాది అర్జున్ కుమార్, గ్లోబల్ ఆసుపత్రిలో నిఖిల్ రెడ్డి ఎత్తు పెంచుతామని చెప్పి మోసగించారని, అదే విధంగా కేర్ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ అనీల్‌కౌర్ చికిత్స సమయంలో సునీత అనే రోగికి ఉన్న క్యాన్సర్‌ను గుర్తించడంలో విఫలం కావడంతో ఆమె చనిపోయిందని వాదించారు. ఈ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున న్యాయవాది హాజరు కాలేదు.

కృష్ణా బోర్డు భేటీ

(మొదటిపేజీ తరువాయి)
విషయంపై సమావేశంలో చర్చిస్తారు. పట్టిసీమ ద్వారా గోదావరి నుంచి కృష్ణాకు మళ్ళిస్తున్న నీటిపై తమ వాటా తేల్చాలంటూ తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టనుంది. ఇటీవలే జరిగిన గోదావరి బోర్డు సమావేశంలో కూడా పట్టిసీమ నీటి ప్రస్తావన రాగా, ఆ విషయాన్ని కృష్ణా బోర్డులో చర్చిద్దామని చెప్పిన ఎపి జలవనరుల శాఖ మంత్రి శశిభూషణ్ సూచించారు. పోతిరెడ్డిపాడు టెలీమెట్రీ పాయింట్ ఏర్పాటు పూర్తైన నేపథ్యంలో జూరాల నీటి వినియోగంపై ఆంధ్రప్రదేశ్ అధికారులు గట్టిగానే ప్రశ్నించనున్నట్లు తెలిసింది. నారాయణపూర్ నుంచి కొద్దిగా జూరాలకు ఇన్‌ఫ్లో వస్తున్నప్పటికీ ప్రాజెక్టు పూర్తిగా నిండలేదు. వస్తున్న కొద్దిపాటి నీటిని కూడా నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాల ద్వారా పాలమూరు జిల్లాలో కొన్ని చెరువులు నింపడం, ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్నారు. దీంతో పాటు బజాజ్ కమిటీకి కృష్ణా బోర్డు తరపున ఇచ్చిన ఏకపక్ష నివేదికపైనా తెలంగాణ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవాస్తవ, సభ్య కార్యదర్శి సమీర్ ఛటర్జీతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సాగునీటి శాఖల కార్యదర్శులు ఎస్‌కె జోషి, శశిభూషణ్, రెండు రాష్ట్రాలు ఇఎన్‌సిలు సి.మురళీధర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారు.

భూ రికార్డుల క్షాళన



(మొదటిపేజీ తరువాయి)
సరళంగా ఉండాలని, గందరగోళానికి దారితీసే అంశాలకు తెరవేయాలని సిఎం సూచించారు. భూమి రికార్డులను ప్రక్షాళన చేయడంతో పాటు భవిష్యత్తులో సరళతరంగా లావాదేవీలు జరుపుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహం ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామం యూనిట్‌గా జరిగే సర్వే సెటిల్‌మెంట్ కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణను రూపొందించి, వీలైనంత తొందరగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. నిజాం కాలంలో 1963లో చేసిన బందోబస్తు తప్ప మళ్లీ రికార్డులన్నీ ప్రక్షాళన చేసే కార్యక్రమం జరగలేదు. దీని వల్ల అనేక ఇబ్బందులు, వివాదాలు తలెత్తుతున్నాయి. శాంతి, భద్రతల సమస్యలకు కూడా భూ వివాదాలు కారణమవుతున్నాయి. ఈ భూవివాదాలకు స్వస్తి చెప్పడానికి రాష్ట్రంలో భూభాగాన్నంతా సర్వే చేయాలని నిర్ణయించారు. ఏ భూమి ఎంత విస్తీర్ణంలో ఎవరి పేరు మీదుందో సర్వే నిర్వహించాలని, దీని కోసం సర్వే ఆఫ్ ఇండియాతో పాటు దేశంలోని వివిధ సర్వే ఏజెన్సీల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. ''వచ్చే ఏడాది నుంచి రైతులకు ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడిగా అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. కానీ వ్యవసాయ శాఖ సర్వేలో వెల్లడైన వివరాలు రెవెన్యూ లెక్కలతో సరిపోలడం లేదు. వ్యవసాయ శాఖ ఒక గ్రామంలో 300 మంది రైతులున్నారని తేల్చితే, రెవెన్యూ రికార్డుల్లో 1,100 మంది ఉన్నట్లు తేలింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి ఎవరికి ఇవ్వాలనే సంశయం వస్తుంది. లెక్కాపత్రం లేకుండా, భూమి కలిగిన అసలైన రైతులకే డబ్బులు పోకుంటే అది పెద్ద కుంభకోణంగా మారి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. అర్హులైన రైతులకు ఫలితం అందకుండా పోతుంది. ఇదొక్కడే కాకుండా భూరికార్డులు సరిగా లేకపోవడం వల్ల ఇంకా చాలా రకాల సమస్యలు వస్తున్నాయి. అవినీతి, శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. భూ వివాదాల వల్ల హత్యలు కూడా జరుగుతున్నాయి. వీటన్నింటికి చరమగీతం పాడాలంటే ఏ భూమి ఎవరికి చెందుతుందనే విషయంలో మరోసారి స్పష్టతకు రావడం అవసరం. దీనికోసం రెవెన్యూ శాఖ స్పెషల్ డ్రైవ్ చేయాలి. గ్రామం యూనిట్‌గా సర్వే జరగాలి. గ్రామంలో ఎంత భూమి ఉంది? ఏ భూమి ఎవరి పేరు మీద ఉంది? అనే విషయంలో స్పష్టతకు రావాలి. మొత్తం రాష్ట్రంలోని 2.70 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో కూడా ఏ భూమి దేని కింద ఉంది అనే వివరాలు తయారు చేయాలి. ఇలా ఒక్కసారి ప్రక్షాళన చేయడం ద్వారా ప్రభుత్వం అమలు చేసే వ్యవసాయానికి రూ.8వేల పెట్టుబడి పథకం సక్రమంగా అమలు కావడంతో పాటు వివాదాలకు తెరదింపినట్లవుతుంది'' అని సిఎం చెప్పారు.
''భూమి పెరగదు. తగ్గదు. ఎంత ఉండాల్నో అంతే ఉంటుంది. ఏది ఎవరి పేరు మీద ఉందో స్పష్టత ఉంటే సరిపోతుంది. గ్రామ పరిధిలో వివరాలు సరిగ్గా నమోదుచేస్తే సరిపోతుంది. రాష్ట్రంలోని 10,850 రెవెన్యూ గ్రామాల్లో సర్వే జరగాలి. రాష్ట్రంలోని 3,500 మంది రెవెన్యూ అధికారులను ఒక్కొక్కరిని మూడు గ్రామాలకు ఇన్‌ఛార్జీగా నియమించాలి. ఒక్కో గ్రామంలో పదిహేను రోజుల్లో గ్రామస్తులు, గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో సర్వే చేయాలి. సర్వే నిర్వహించడానికి అనేక ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇంత మంచి కార్యక్రమం కాబట్టి ప్రజలు కూడా సహకరిస్తారు. జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులకు ఈ సర్వే పూర్తయ్యే వరకు మరే పని అప్పగించేది లేదు. ప్రస్తుతం ఇస్తున్న పట్టాదార్ పాస్ పుస్తకాలు, పహాణీ పత్రాలలో అన్ని కాలమ్స్ అవసరం లేదు. ఒకసారి ప్రక్షాళన జరిగిన తరువాత ఆ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. సర్వే పూర్తయిన తరువాత కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలి. ప్రతీ భూమికి ప్రత్యేక నెంబర్ కేటాయించి, హద్దు రాళ్లు కూడా పాతాలి'' అని సిఎం కెసిఆర్ ఆదేశించారు.

ఉత్తమ్‌పై ఎత్తిన బాణం?

(మొదటిపేజీ తరువాయి)
కుంతియాకు ఇవ్వడం పట్ల పార్టీ నాయకుల్లో ఆశ్చర్యం వ్యక్తమైంది. దీంతో ఆయనకు త్వరలోనే ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి రాబోతుందని, ఈ నెల 8న జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఆహ్వానం కూడా లభించిందని ఉత్తమ్ సన్నిహితులు ధీమాగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే తనకు ఇబ్బందులు సృష్టిస్తున్న కోమటిరెడ్డి బ్రదర్స్‌ను పక్కకు పెట్టిన ఉత్తమ్ వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ తరుపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా లైన్ క్లియర్ చేసుకుంటున్నారనే చర్చ పార్టీలో సాగుతోంది. దీంతో అప్రమత్తమైన సీనియర్ నాయకులు తమ అవకాశాలపై సమాలోచనలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే జానారెడ్డి, భట్టి విక్రమార్క మధ్య చర్చలు జరిగినట్లు తెలిసింది. వాస్తవానికి గత సాధారణ ఎన్నికల సందర్భంగా జానారెడ్డి పిసిసి అధ్యక్ష పదవిని ఆశించారు. వచ్చే ఎన్నికల నాటికి ఆ పదవి వస్తే బాగుంటుందనే భావిస్తున్నారు. అయితే, ఉత్తమ్ పార్టీలో బలపడితే ఆ అవకాశం ఉండకపోవచ్చని అనుకుంటున్నారు. అక్టోబర్ నెల చివరి నాటికి కాంగ్రెస్ బూత్ స్థాయి నుండి అఖిల భారత స్థాయి వరకు సంస్థాగత ఎన్నికలు పూర్తవుతాయి. ఒకవేళ పిసిసిల్లో మార్పులు చేర్పులు ఉంటే ఇప్పుడే అవకాశం ఉంటుందని, ఆ తరువాత కష్టమవుతుందని పార్టీలో చర్చసాగుతుంది. దీంతో సీనియర్‌లు అప్రమత్తమై తమ అవ కాశాల గురించి ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమకు మద్దతుగా ఇతరులను కూడగట్టుకుంటున్నట్లు తెలిసింది.

సంక్షోభంలో కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)
మోడీ, బిజెపి అధ్యక్షులు అమిత్ షా నుంచి పార్టీకి గట్టి సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. ఓ ప్రముఖ వార్తా సంస్థకు జైరాం రమేష్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఏదో నడిచిపోతుందిలే అనుకునే తత్వం కుదరదని,మోడీ షాల షాక్‌లను తటుకోవడానికి తప్పనిసరిగా పంథా మార్చుకోవల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ కాలం చెల్లిన విధంగా ఉంటే సరిపోదని, కాలానికి అనుగుణంగా ఉండాలనుకుంటే తప్పనిసరిగా పట్టువిడుపులు అవసరం అన్నారు. 'అవును ..కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో ఉంది' అని ఆయన స్పష్టం చేశారు. అయితే అపజయాలు కాంగ్రెస్‌కు కొత్త కాదని, ఎన్నికల సంక్షోభాలు వరుస వైఫల్యాలు పార్టీకి ఇంతకు ముందు కూడా ఉన్నాయని వివరించారు. 1996–2004 వరకూ తరువాత 1977లో ఎమర్జెన్సీ అనంతరం కూడా ఇదే విధమైన సంక్షోభం ఉందని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ కొత్తగా అస్థిత్వ సమస్యను, ఉనికికికే ఆటుపోట్లను ఎదుర్కొంటోందని, దీనిని ఆషామాషీగా తీసుకోవడానికి వీల్లేదని తెలిపారు. ఎన్నికల సంక్షోభాలు అధిగమించవచ్చు, అయితే అస్తిత్వ సమస్యను ఎదుర్కోవడానికి ప్రత్యేక దృక్పథం అవసరం అన్నారు. నిజంగానే పార్టీ సుడిగుండంలో చిక్కిందని వ్యాఖ్యానించారు. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ఎన్నిక కావడానికి వీలుగా కాంగ్రెస్ పడరాని పాట్లు పడటం, ఏకంగా పార్టీ ఎమ్మెల్యేలను కర్నాటకలో శిబిరంలో ఉంచడం వంటి అంశాల నేపథ్యంలో జైరాం కీలక వ్యాఖ్యలు వెలువడ్డాయి. బిజెపి వారు కాంగ్రెస్‌ను అన్ని విధాలుగా వెంటాడుతున్నారు. ఈ విషయం గుజరాత్ పరిణామాలతో రుజువు అయింది. వేటగాళ్లకు తగ్గట్లుగా మన ప్రతిఘటన ఉండాల్సిందేనని పేర్కొన్న రమేష్ పరోక్షంగా ఈ వేటగాళ్లు మోడీ, షాలు అని తెలిపారు. బిజెపి గాలానికి చిక్కకుండా ఉండేందుకు తమ పార్టీ ఎమ్మెల్యేలను వేరే రాష్ట్రానికి తరలించడం సబబేనని సమర్థించారు. కాంగ్రెస్ పాలిత కర్నాటకు పార్టీ ఎమ్మెల్యేలను తరలించడంలో తప్పేమీ లేదని, కాషాయ పార్టీ కూడా చాలా సార్లు ఎమ్మెల్యే క్యాంపులు నిర్వహించిందని తెలిపారు.

అధికార వ్యతిరేకతను నమ్ముకోరాదు

బిజెపి పాలిత రాష్ట్రాలలో అధికార వ్యతిరేకత అంశంతోనే మోడీ ప్రభుత్వంపై ప్రతికూలత ఏర్పడుతుందని అనుకోరాదని జైరాం తెలిపారు. మోడీ, అమిత్‌లు అనేక కోణాల నుంచి స్పందిస్తూ ఉంటారు. కేవలం ఏదో ఒక అంశంతో వారిని ఢీకొనడం కష్టం. వారిని తట్టుకోవడానికి ఇప్పుడున్న వైఖరి సరిపోదని, పట్టువిడుపులు లేకుంటే అసలు వ్యూహాలే పండవని తెలిపారు.

పాత చింతకాయపచ్చడి కుదరదు

భారత్ మునుపటి భారత్ కాదనే విషయాన్ని పార్టీ గుర్తించాలి. పాత నినాదాలు చెల్లవు. పాత సమీకరణలు, సూత్రాలు, వ్యవహార శైలి కుదరదు. పాత మంత్రాలకు పనులు జరగవు. మారిన దేశానికి అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ మారాల్సి ఉందని రమేష్ స్పష్టం చేశారు. కీలక రాష్ట్రాలలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. తరువాత ఏడాదికే లోక్‌సభ ఎన్నికలు వస్తాయి. ఇప్పటికైనా రాహుల్ గాంధీ పార్టీ నాయకత్వం చేపట్టడంపై సందిగ్ధతను వదులుకోవాలి. ఎన్నికల పోరుకు శషభిషలు వదిలి శ్రేణులను సిద్ధం చేయాలని కోరారు. ఈ ఏడాది చివరి నాటికి రాహుల్ పార్టీ నాయకత్వం తీసుకుంటారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. చాలా కాలంగా తాను రాహుల్ పార్టీ పగ్గాలు తీసుకుంటారని అనుకుంటూ వస్తున్నానని, అయితే అంచనాలు తప్పాయని తెలిపారు. ఇప్పుడు రాహుల్ సారథ్యం కోసం డిమాండ్ చేయడానికి తాను అర్హుడిని కాదని భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైతే రాహుల్‌కు పగ్గాలు వస్తాయనే సంకేతాలు లేవని చెప్పారు. ఈ ఏడాది గడిచిపోతే వచ్చే ఏడాది నుంచి తిరిగి ఎన్నికల వాతావరణం ఉంటుందని, ఈ దశలో పార్టీలో ఎలాంటి సంకోచాలు, తటపటాయింపులు ఉన్నా అది మొదటికే మరోమారు మోసం తెస్తుందన్నారు. ఈ పరిస్థితి నుంచి గాంధీ కుటుంబం పార్టీని గట్టెక్కించాల్సి ఉందన్నారు.

సమష్టితత్వంతోనే మోడీకి సవాలు

వచ్చే లోక్‌సభ ఎన్నికలలో మోడీకి కాంగ్రెస్ తరపున గట్టి సవాలు విసిరే నాయకుడు ఎవరైనా ఉన్నారా? అని అడగ్గా కేవలం ఒక్క వ్యక్తితోనే మోడీకి సవాలు విసరడం కుదరదని, సమిష్టి నాయకత్వంతోనే ఇది సాధ్యం అవుతుందని జైరాం సమాధానం ఇచ్చారు. కేవలం ఒక్కరి మంత్రదండాలతోనే మోడీ గండం నుంచి గట్టెక్కలేమని స్పష్టం చేశారు. అంతా కలిస్తే ఏదైనా అనుకుంటే సాధించుకునేందుకు వీలేర్పడుతుందన్నారు.

కొందరు నేతలకు ఇప్పటికీ అధికార భ్రమ

పార్టీలో కొందరు నేతలు ఇప్పటికీ తాము అధికారంలోనే ఉన్నామనే విధంగా ఉంటున్నారని రమేష్ మండిపడ్డారు. తామేదో సుల్తాన్‌లం అనుకుంటున్నారని, రాజ్యాలు పోయినా వారికి ఇంకా వెనుకటి గుర్రాలు, రథాల గుర్తులు వీడటం లేదని చురకలు పెట్టారు. మన ఆలోచనా ధోరణి పూర్తిగా మారాల్సి ఉందని, మాటలు చేతలు, ప్రజల వద్దకు వెళ్లడం, సమాచార వినిమయం ఈ విధంగా అన్నింటిలోనూ మౌలిక మార్పులు రావాల్సి ఉందన్నారు.

పార్టీపై చెక్కుచెదరని ప్రజా సదభిప్రాయం

దేశంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలలో సరైన అభిప్రాయం ఉందని , అన్ని రకాలుగా అట్టడుగు స్థాయి నుంచి మద్దతు ఉందని, అయితే ప్రజానీకం కొత్త కాంగ్రెస్‌ను కోరుకొంటోందని జై తెలిపారు. పాత నినాదాలు, మంత్రాలు పనికిరావని తెలుసుకోవాలి. పెను సవాళ్లు ఉన్నాయని నిర్ధారించుకుంటే నిద్ర మేలుకోవడం సాధ్యం అవుతుందని ఘాటుగా స్పందించారు. నితీశ్ కుమార్ ఎన్‌డిఎ శిబిరంలోకి వెళ్లడం బిజెపి వ్యతిరేక కూటమికి ఎదురుదెబ్బనే అని అంగీకరించారు. ఇది పూర్తిగా ప్రజాతీర్పును ఖూనీ చేయడమే అన్నారు.



ఎస్ఆర్ఎస్‌పి నీటితో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తాం : మంత్రి ఈటల

మన తెలంగాణ / భైంసా: ఎస్ఆర్ఎస్‌పి పునరుజ్జీవం ద్వారా ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఈ నెల 10న ఎస్ఆర్ఎస్‌పి వద్ద జరిగే సభ ఏర్పాట్లలో భాగంగా పట్టణంలో ఎన్ఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన ముథోల్ నియోజకవర్గ స్థాయి టిఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మేడి గడ్డ నుంచి మిడ్‌మానేరు ద్వారా ఎస్ఆర్ఎస్‌పిలోకి 60 టిఎంసిల నీటిని నింపుతామని చెప్పారు. నీళ్ల వివాదంతోనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ప్రారంభమైందని మంత్రి గుర్తు చేశారు. రైతులకు సాగు నీరు అందితేనే వ్యవసాయ ఉత్పత్తులు పెరిగి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. మూడేళ్లలో కెసిఆర్ నాయకత్వంలోని ఇఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలచిందని అన్నారు. అంతకు ముందు పట్టణంలోని డాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో భైంసా సిటి స్కాన్ కేంద్రాన్ని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముథోల్ ఎంఎల్ఎ విఠల్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ఎంఎల్ఎ విఠల్ రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, మాజీ జడ్‌పి చైర్మన్ విలాస్ గాదేవార్, నాయకులు నూకం రామారావు, సాయిల మధుశేఖర్, డిఎస్‌పి అందె రాములు, పలువురు ఎంపిపిలు, జడ్‌పిటిసిలు సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో ఎక్సైజ్ దాడులు

అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలు ధ్వంసం

మన తెలంగాణ/రామాయంపేట : మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లో అధికారులు దాడులు చేసి అక్రమంగా సాగుచేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయితో పాటు, వాటి విత్తనాలను స్వాధీనం చేసుకుని సిద్దయ్య అనే రైతును అరెస్ట్ చేసినట్లు పేట ఎక్సైజ్ సిఐ రాధాకిషన్ విలేకరులతో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన కుంట సిద్దయ్య అనే రైతు తన వ్యవసాయ పొలంలో అక్రమంగా గంజాయిని సాగుచేస్తున్నాడన్న పక్కా సమాచారం మేరకు తాము దాడులు చేశామన్నారు. కాగా అతని వ్యవసాయ పొలంలోని పసుపు పంటలో అంతర పంటగా దీన్ని సాగుచేస్తున్నాడని ఎకరా పొలానికి సరిపడే సుమారు 5వందల మొక్కలను అక్కడ పెంచుతున్నాడని వాటిని పరిశీలించి ధ్వంసం చేశామన్నారు. అతని ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5వేల విలవగల 500గ్రాముల గంజాయితో పాటు 10వేల విలువగల విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పంటను సాగు చేస్తున్న రైతు సిద్దయ్యను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ యాదగిరి తోపాటు సిబ్బంది రాంలు, పవన్, కిషన్, విఆర్వో స్వామిలు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/తొర్రూరు : వరంగల్ జిల్లా తొర్రూరు మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన నక్క కుమారస్వామి యాదవ్(35) అప్పుల బాధతో సోమవారం గ్రామంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎఎస్ఐ లింగారెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సైబరాబాద్‌లో ఐదుగురు సిఐల బదిలీ

మన తెలంగాణ/సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్యా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై శాఖపరమైన విచారణ జరిపిన తరువాతనే వారిపై బదిలీ వేటు వేస్తున్నారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.రవి కుమార్ (సిఐ సెల్)ను పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు, వి.శ్రీకాంత్‌గౌడ్ (ట్రాఫిక్ అడ్మిన్)ను అల్వాల్ పిఎస్‌కు, టి.ఆనంద్‌రెడ్డి (అల్వాల్ పిఎస్)ను ప్రధాన కార్యాలయ (అటాచ్)కు, డి.భాస్కర్‌రెడ్డి (ఆర్‌జిఐ ట్రాఫిక్ పిఎస్)ను శామీర్‌పేట్ పిఎస్‌కు ఎ.సత్తయ్య(శామీర్‌పేట్ పిఎస్)ను ప్రధాన కార్యాలయం (అటాచ్)కు బదిలీ చేశారు.

60 రోజుల తరువాత సిస్టర్ మృతదేహానికి పోస్టుమార్టం

మనతెలంగాణ/జ్యోతినగర్: (పెద్దపల్లి జిల్లా) ఎన్‌టిపిసి కృష్ణానగర్ కాలనీలో గల పెంతగోస్ట్ చర్చిలో సిస్టర్‌గా సేవలందిస్తున్న రూతు(43)మృతి వివాదాస్పదంగా మారడంతో మృతదేహానికి హైదరాబాదులో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎన్‌టిపిసి ఎస్ఐ. చంద్రకుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని బోయినపల్లి సమాధుల స్థలం వద్ద రూతు మృతదేహానికి ఎస్ఐ. చంద్రకుమార్‌తో పాటు తిరుమలగిరి తహసీల్దార్ సునీల్ నతాని, గాంధీ ఆసుపత్రికి చెందిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ లక్ష్మ ణ్‌రావుల సమక్షంలో పోస్టుమార్టం జరిగిందన్నారు. విజయవాడ పట్టణానికి చెందిన పెంతగోస్ట్ చర్చిలో సిస్టర్‌గా సేవలందిస్తున్న రూతు జూన్ 7న మృతి చెందింది. అయితే మృతదేహాన్ని ఇక్కడ ఎవరికి సమాచారం ఇవ్వకుండా చర్చికి చెందిన పాస్టర్ తో పాటు కొంత మంది హైదరాబాద్‌లోని ప్రధాన చర్చికు అదే రోజు రాత్రి తరలించారన్నారు. అక్కడి నుండి మృతురాలి బంధువులకు సమాచారం ఇవ్వగా, రెండు రోజులు ఆలస్యం కావ దంతో బోయినపల్లి సమీపంలోని సమాధుల స్థలంలో ఆమె మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. ఆమె సోదరుడు అమినిశెట్టి రవీందర్‌కు అనుమానం రావడంతో జరిగిన సంఘటనపై చర్చి ఫాదర్‌తో పాటు తోటి సిస్టర్లను సంప్రదించగా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. రెండు రోజుల క్రితం ఎన్‌టిపిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో 60 రోజుల క్రితం మృతి చెందిన రూతు మృతదేహానికి రీ పోస్టుమార్టం జరిపించామన్నారు.

సర్కారీ గొర్రెల విక్రయ యత్నం

వల పన్ని పట్టుకొన్న పోలీసులు, నలుగురికి రిమాండ్

మన తెలంగాణ / బయ్యారం : మండలంలోని ఇర్సులాపురం పంచాయతీలోని ఇర్సులాపురంలో కెసిఆర్ తల పెట్టిన కురుమ, గొర్ల కాపర్లకు పలు యూనిట్‌ల క్రింద గత అయిదు రోజుల క్రితం గొర్ల యూనిట్‌లు మంజూరు కాగా వారిలో ఒక యూనిట్‌లోని ఇద్దరు సభ్యులు తమకు వచ్చిన గొర్లను అమ్మకానికి యత్నించగా పట్టుకున్నట్లు డిఎస్‌పి రాజమహేంద్ర నాయక్ విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఆదివారం ఎస్ఐ అశోక్ రామచంద్రాపురం రోడ్డులో ఆటోను తనిఖీ చేశారు. ఇందులో 20 గొర్రెలను గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా గొర్లు ర్సులాపురం గ్రామంలో కేశ వీరన్న, కాశం వీరయ్యల గొర్లు అదే గ్రామానికి చెందిన గొర్ల మారు బేరం చేసే పుణ్య పుర్తి క్రిష్ణయ్య కొనుగోలు చేసి వాటిని టాటా ఎసి వాహనంలో మాదాపురం గ్రామానికి అమ్మడానికి వెళ్తున్నారని తెలిపాడు. దీంతో ఆ నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వారు తెలిపారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో

గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్టు

మన తెలంగాణ/కాజీపేట : కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 20కిలోల గంజాయి తరలిస్తున్న నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన జరిగింది. సోమవారం కాజీపేట జిఆర్‌పి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డిఎస్‌పి శ్రీనివాసరావు వివరాలు తెలిపారు. భువనేశ్వర్ నుంచి ముంబాయికి వెళ్లుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో జిఆర్‌పి స్పెషల్ టీం తనిఖీలు నిర్వహిస్తుండగా రైలులో సాధారణ టికెట్ తీసుకుని రిజర్వేషన్ బోగీలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, జాన్‌పూర్ జిల్లా, మడార్టి గ్రామానికి చెందిన శంబు రత్నసింగ్ (62) సంచుల్లో గంజాయిని తీసుకువెళ్తున్నాడు. అనుమానాస్పదంగా కనిపించిన అతని వద్ద ఉన్న సంచులలో 18 పార్శిళ్ల బండిలో 20 కిలోల గంజాయి దొరికింది. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. నిందితున్ని పట్టుకున్న స్పెషల్ టీం బృందం హెడ్ కానిస్టేబుల్ ఎన్ విజయ్‌కుమార్ అతని సహచరులను అభినందించారు. సిఐ వెంకటేశ్, ఎస్ఐ దయాకర్, జిఆర్‌పి సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాక్టికల్ ట్రైనింగ్ పోలీసులకు ఎంతో దోహదం: డిజిపి అనురాగ్‌శర్మ

మన తెలంగాణ/సిటీబ్యూరో: టాక్టికల్ ట్రైనింగ్ వల్ల పోలీసు మనోధైర్యం పెరుగుతుందని అదీ వారి విధులకు దోహదపడుతుందని రాష్ట్ర డిజిపి అనురాగ్‌శర్మ పేర్కొన్నారు. గచిబౌలిలోని సైబరాబాద్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం టాక్టికల్ ట్రైనింగ్ పాస్ ఔట్ పరేడ్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగు రోజుల పాటు జరిగిన టాక్టికల్ ట్రైనింగ్‌లో నాలుగు కమిషనరేట్, ఏడు జిల్లాల నుంచి 55 పోలీసులు హాజరై వికారాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వీరికి అనురాగ్‌శర్మ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధనపు డిజి గోపికృష్ణ, ఐజీ అంజనీకుమార్, రవిగుప్తా, పోలీసు అకాడమీ డైరక్టర్ జితేందర్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు సందీప్ శాండిల్యా, మహేష్‌భగవత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

లీకేజీల్లో ప్యాకేజీలు

ప్రతిసారి నాణ్యత లేని మరమ్మతులు - వీటిపై కొరవడిన శాస్త్రీయత - పట్టించుకోని అధికారులు

- వృథాగా పోతున్న విలువైన నీరు
- పైపులైన్ల మరమ్మతుల పేరిట దోపిడీ
- ప్రతి నెలా కోటిన్నర వ్యయం



మన తెలంగాణ / సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలో మంచినీటి, డ్రైనేజీ పైపులైన్ల లీకేజీలు జలమండలి అధికారులు, కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తున్నాయి. లీకేజీలు వారికి ప్యాకేజీలుగా మారాయి. ప్రతి రోజూ నగరంలోని ఏదో ఒక ప్రాంతంలో మంచినీటి పైపులైన్లుపగిలిపోయి లీకేజీలు ఏర్పడి విలువైన నీరు వృథాగా పోతుంది. అలాగే తరుచూ డ్రైనేజీ పైపులైన్లు పగిలిపోయి మంచినీటిలో మురుగునీరు కలుస్తూ కలుషితమైన నీరు సరఫరా అవుతుంది. జలమండలి పరిధిలో ప్రస్తుతం 9.65 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. అదేస్థాయిలో డ్రైనేజీ కనెక్షన్లు ఉన్నాయి. వీటి నిర్వహణను ఎప్పుడికప్పుడు పర్యవేక్షిస్తూ ఇందుకు అనుగుణంగా లీకేజీలను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే వివిధ డివిజన్లలో పనిచేస్తున్న కొంతమంది క్షేత్రస్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై మంచినీరు, డ్రైనేజీ పైపులైన్ల లీకేజీలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నట్లు తెలిసింది. ప్రధానంగా పైపులైన్ల లీకేజీలకు మరమ్మత్తులు చేయడంలో సదరు కాంట్రాక్టర్లు నాణ్యత పాటించడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగా మరమత్తులు చేసిన మూన్నాళ్లకే సమస్య తిరిగి ఉత్పన్నమవుతోంది. అధికారులు లీకేజీలు లేని చోట లీకేజీలు ఉన్నాయని పేర్కొంటూ, మరమ్మతుల పేరిట బిల్లులు పెట్టి జలమండలి సొత్తును స్వాహా చేస్తున్నట్లు తెలిసింది. లీకేజీలకు శాశ్వత పరిష్కరం చూపకపోగా, పైపులైన్ల మరమ్మతుల పేరిట లక్షలాది రూపాయలు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి నెలా పైపులైన్ల లీకేజీల మరమత్తుల పేరిట జలమండలి కోటిన్నర వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు లాభసాటిగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయి అధజకారులు స్వలాభం కోసం తూతూ మంత్రంగా లీకేజీలకు మరమ్మతులు చేయిస్తూ సమస్యకు శాశ్వ త పరిష్కారం చూపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మొత్తానికి నిర్వహణ వ్యయంపై ఎలాంటి శాస్త్రీయత లేకపోవడంతో అవినీతి ఆజ్యం పోస్తుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన మంచినీరు వృథాగా కావడమే కాక, మరమత్తుల పేరిట పెడుతున్న బిల్లుల కారణంగా ఖాజానాకు భారీ గండి పడుతోంది.

కొంతమంది అధికారులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ డివిజన్లలో పని చేస్తున్న జిఎం, డిజిఎం, మేనేజర్ స్థాయి లో అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా నామినేషన్ పనులలో సదరు అధికారులు కాంట్రాక్టర్ల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నట్లు తెలిసింది. ప్రధానంగా పైపులైన్ల లీకేజీల మరమ్మతులు పనులను తమకు డబ్బులిచ్చే కంట్రాక్టర్లకే అప్పగిస్తున్నట్లు తెలిసింది. జలమండలి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా మురికివాడ బస్తీలకు మంచినీటిని సరఫరా చేస్తోంది. కోరిన డబ్బు ఇవ్వని యజమాన్యాలకు ట్యాంకర్ల ట్రిప్పు లు కేటాయించకుండా వేధిస్తున్నట్లు తెలిసింది.గత ఏడాది ఏప్రిల్‌లో టిప్పులు కేటాయించడానికి ఓ ప్రైవేట్ ట్యాంకర్ యజమాని నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ ఎర్రగడ్డ సెక్షన్ మేనేజర్ అశోక్ కుమార్ ఎసిబి అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా అవినీతిని అరికట్టి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చేనేత అభివృద్ధికి కృషి: మంత్రి జగదీశ్‌రెడ్డి



మనతెలంగాణ/భూదాన్‌పోచంపల్లి : చేనేత కార్మికుల పరిశ్రమ అభివృద్ధికి పలు పథకాలతో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని విద్యుత్ శాఖా మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం మంత్రి జూపల్లి కృష్ణా రావ్, భువనగిరి ఎంపి బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్సీ ఎలిమినేటి క్రిష్ణారెడ్డి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి,తో కలిసి చేనేత ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత సహకార సంఘంలో చేనేత వస్త్రాలను పరిశీలించి మాట్లాడతూ చేనేత కార్మికుల ఆదాయం పెరిగే విదంగా రాష్ట్ర బడ్జెట్ లో నిధులు కేటాయించామని చేనేత కార్మికులు ఆత్మ హత్యలు చేసుకోకుండా ప్రత్యేక పథకాలు రూపొందిస్తున్నామని అన్నారు. తెలంగాణకు అవసరమైన నూలు రంగుల రసాయనాలను చేనేత సొసైటీల్లో 50 శాతం సబ్సీడీతో అందజేస్తున్నామని సహకార సంఘాలలో వస్త్ర నిలువలను కొనుగోలు చేస్తున్నామని అన్నారు. బతుకమ్మ సందర్భంగా కోట్లాది రూపాయల బడ్జెట్ తో బతుకమ్మ చీరెలను మహిళల కోసం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం అన్ని విధాల ప్రభుత్వం కృషి చేస్తుందని వారంలో రెండు సార్లు విధిగా చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ అనితా రామ చంద్రన్, ఏడి శోభ, ఎంపిపి సార సరస్వతి బాలయ్య గౌడ్, జడ్పిటిసి సభ్యులు మాద్గుల ప్రభాకర్ రెడ్డి, టీఆర్ఎస్ మండల పార్టీ పాటి సుధాకర్ రెడ్డి, సర్పంచ్ తడ్క లతా వెంకటేశ్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారత వాసుదేవ్ పాల్గొన్నారు.


ఆకుపచ్చ తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం

- శాఖ మంత్రి హరీశ్‌రావు



మన తెలంగాణ/వెల్దుర్తి :పోరాడి సాధించుకున్న తెలంగాణను ఆకుపచ్చ తెలంగాణగా మార్చడానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని భారీ నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మండలంలోని కొప్పులపల్లి, వెల్దుర్తిలో పర్యటించిన మంత్రి శాసనసభ ఉప సభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి, జడ్‌పి చైర్ పర్సన్ రాజమని మురలీయాదవ్, ఎంఎల్ఎ మదన్‌రెడ్డిలతో కలిసి కొప్పులపల్లి గ్రామశివారులో నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం వెల్దుర్తిలో మిషన్ కాకతీయ పథకం కింద చేపడుతున్న కుడి చెరువు మరమ్మతు పనులను పరిశీలించారు. మండలానికి మొదటి విడత మంజూరైన డబుల్ బెడ్‌రూం నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. దాత వెంకటేశ్వర్‌రావ్ సహకారంతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావ్ మాట్లాడుతూ భారత దేశం లో ఎక్కడా అమలుకాని సంక్షేమ పథకాలను ముఖ్య మంత్రి కెసిఆర్ చేపడుతున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాల కంటే అదనంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నామన్నారు. టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళలోనే అభివృద్ధి పథం లో దూసుకుపోతున్నామన్నారు. ఎరువులు, విత్తనాలు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కోసం అన్నదాతలు ప్రతియేటా రోడ్లు, కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌ల ఎదుట ధర్నా, రాస్తారోకోలు చేపట్టేవారన్నారు. అలాంటిది తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే విద్యుత్ సమస్యను శాశ్వతంగా పారద్రోలారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు పూర్తయితే నర్సాపూర్ నియోజకవర్గంలో అధికంగా లాభపడేది వెల్దుర్తి మండలమేనన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గానికి 94వేల ఎకరాలకు నీరస్తే అందులో వెల్దుర్తి ఒక్క మండలానికే 32,800 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. మల్లన్నసాగర్ నిర్మాణానికి రెండు, మూడేళ్ళు సమయం పట్టే అవకాశం ఉన్నందున రైతులకు నష్టం వాటిల్లకుండా పంపుల ద్వారా వచ్చిన నీరు వచ్చినట్లే మన నర్సాపూర్ నియోజకవర్గానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

ఈ సమావేశాల్లోనే బిసి కమిషన్ బిల్లును ఆమోదించాలి



మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్: ఈ పార్లమెంట్ సమావేశాల్లోపే జాతీయ బిసి కమిషన్ బిల్లు రెండు సభల్లో ఆమోదం పొందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హంసరాజ్ గంగారామ్‌ను జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య బృందం వినతి పత్రాన్ని అందజేశారు. బిసిలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జాతీయ బిసి కమిషన్ బిల్లుకు రాజ్యాంగ హోదా కల్పించాలని ఒబిసి రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరణ చేయాలని, స్కాలర్‌షిప్‌లకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీములకు బడ్జెట్ ఇవ్వాలనే తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల ఐదో తేదీ నుంచి బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో హంసరాజ్ గంగారామ్, కేంద్ర మంత్రి రాందాసు ఆదవాలే తదితరులను బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బిసి నేతల బృందం కలిసి వినతి పత్రాలను అందజేశారు. జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పిస్తే ఓర్వలేని రాజకీయ పార్టీలు భవిష్యత్‌లో అసెంబ్లీ, పార్లమెంట్‌లో ఎన్నికలలో బిసిలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తే సహకరిస్తామని హామినిచ్చారని కృష్ణయ్య తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న మాదిరిగా ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పోస్ట్, మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి రాగిఫణి రవీంద్ర చారి, ఏపి, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్, నీల వెంకటేష్, కేశన శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు : జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించడానికి, చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి 36 రాజ కీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో అఖిలపక్ష సమావేశం జరపాలని మంత్రులను కృష్ణయ్య కోరారు.

ఫిట్‌నెస్ బిజినెస్‌లోకి నిఖిల్

సినిమాల్లో నటిస్తూనే విజయవంతమైన వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారు కొందరు నటీనటులు. తమ అభిరుచికి తగిన రంగాల్లో పెట్టుబడులు పెడుతూ బిజినెస్ చేస్తున్నారు. ఈ విషయంలో హీరోలకంటే హీరోయిన్లే కాస్త ముందంజలో ఉన్నారు. బాలీవుడ్‌లో అయితే ఈ బిజినెస్ ట్రెండ్ ఎక్కువగా కనిపిస్తుంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్ ఇటీవల ఇంటర్నేషనల్ ఫిట్‌నెస్ బ్రాండ్ ఎఫ్ 45తో కలిసి హైదరాబాద్‌లో కొన్ని చోట్ల జిమ్ సెంటర్లను ప్రారంభించింది. అయితే ఇప్పుడు అదే బ్రాండ్‌తో యంగ్ హీరో నిఖిల్ కూడా తాజాగా అసోసియేట్ అయినట్లుగా తెలిసింది. ఈ నేపథ్యంలో తాజాగా సికింద్రాబాద్‌లో నిఖిల్ ఎఫ్ 45 కొత్త జిమ్‌ను ప్రారంభించాడు. దీంతో పాటు త్వరలోనే ఆరు నూతన జిమ్ సెంటర్లను ఏర్పాటుచేసే పనిలో అతను ఉన్నాడని తెలిసింది. సినిమాలో బిజీగా ఉంటూనే బిజినెస్‌లో కూడా సక్సెస్ కొట్టాలని నిఖిల్ ప్లాన్ చేసినట్లు తెలిసింది. మొత్తానికి మొన్నటివరకు ఎఫ్ 45 జిమ్ అంటే రకుల్ ప్రీత్‌దే కదా అని సమాధానమిచ్చే వాళ్లు ఇకనుంచి ఎఫ్ 45 జిమ్ అంటే నిఖిల్‌ది కూడా అని అంటారేమో చూడాలి.





నితిన్

'అ..ఆ' వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత యంగ్ స్టార్ నితిన్ హీరోగా నటించిన చిత్రం 'లై'. అందాల రాక్షసి, కృష్ణగాడి వీర ప్రేమగాథ చిత్రాల దర్శకుడు హను రాఘవపూడి డైరెక్షన్‌లో మేఘా ఆకాష్ హీరోయిన్‌గా 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై.లి పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ సుంకర నిర్మించిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. మణిశర్మ సంగీతాన్ని అందించిన ఆడియోకు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రం ఈనెల 11న ప్రపంచవ్యాప్తంగా అత్యధిక స్క్రీన్‌లలో విడుదలకానుంది. ఈ సందర్భంగా నితిన్‌తో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు...



నా సినిమాలో పవన్ చిత్రంలోని ఏదో ఒక సీన్ ఉంటుంది

ఫస్ట్ సిట్టింగ్‌లో ఓకే... 'అ..ఆ' వంటి మంచి హిట్ తర్వాత ఏ సినిమా చేయాలి? ఎలాంటి కథను ఎంచుకోవాలి? అని కొంచెం డైలమాలో పడ్డాను. ఆ సమయంలో త్రివిక్రమ్ నాకు ఫోన్ చేశారు. నెక్స్ట్ రెగ్యులర్ మూవీ కాకుండా కొంచెం డిఫరెంట్‌గా ఉండే సినిమా చేయమని సలహా ఇచ్చారు. ఆతర్వాత చాలా కథలు విన్నాను. ఏదీ నచ్చలేదు. హను రాఘవపూడి అరగంట పాటు ఈ కథ చెప్పాడు. ఫస్ట్ సిట్టింగ్‌లోనే ఈ కథ ఓకే చేశాను.

లవ్ ట్రాక్ కొత్తగా...

రెగ్యులర్ మూవీలా కాకుండా లవ్, ఎమోషన్, స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'లై' సినిమా ఉంటుంది. హీరో, హీరోయిన్‌ల మధ్య లవ్ ట్రాక్ చాలా కొత్తగా ఉంటుంది. వారి మధ్య చిన్న చిన్న అబద్ధాలు ఆసక్తికరంగా ఉంటాయి.

చాలా థ్రిల్లింగ్‌గా...

ఆవారాగా తిరిగే ఓ యువకుడు యుఎస్ వెళ్లి బాగా డబ్బున్న అందమైన అమ్మాయిని పెళ్లాడి డాలర్స్ సంపాదించాలని అనుకుంటాడు. అలా యుఎస్ వెళ్లి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? అనేది మెయిన్ కాన్సెప్ట్. సినిమా ప్రారంభం నుండి చివరి వరకు ఆసక్తికరంగా, చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది.

స్టైలిష్ విలన్‌గా అర్జున్...

'శ్రీ ఆంజనేయం' చిత్రం తర్వాత అర్జున్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా అనిపించింది. తొలిసారి ఆయన విలన్‌గా నటించారు. ఎంతో స్టైలిష్‌గా ఆయన క్యారెక్టర్ ఉంటుంది. ఆయన లేకపోతే ఈ సినిమా ఇంత బాగా వచ్చి ఉండేది కాదు. మా ఇద్దరి మధ్య జరిగే గేమ్ చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఎత్తుకు పై ఎత్తులు వేసుకుంటూ ఇద్దరి క్యారెక్టర్స్ పోటాపోటీగా ఉంటాయి.

హాలీవుడ్ స్థాయిలో...

14 రీల్స్ నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ సుంకరలు నా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని కథకు ఎంత ఖర్చు పెట్టాలో అంత ఖర్చు పెట్టి ఈ సినిమాను హాలీవుడ్ స్థాయిలో నిర్మించారు. ఈ సినిమా ఎక్కువ శాతం షూటింగ్ యుఎస్‌లో జరిగింది. ఎవరూ చేయనటువంటి కాస్ట్లీ లొకేషన్స్‌లో షూటింగ్ చేశారు.

క్లైమాక్స్ ఫైట్ హైలైట్‌గా...

యాక్షన్ సీన్స్ కోసం బ్యాంకాక్ వెళ్లి కొంత ట్రైనింగ్ తీసుకున్నాను. కిచ్చ మాస్టర్ అబ్బురపరిచే యాక్షన్ సీన్‌లను కంపోజ్ చేశారు. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే ఫైట్ చాలా హైలైట్‌గా ఉంటుంది. ఈ ఫైట్‌లో అర్జున్ డూప్ లేకుండా రియలిస్టిక్‌గా చేశారు.

వంద శాతం స్ట్రాంగ్‌గా...

హను నాకు ఈ కథ చెప్పినప్పుడు ఎలాగైతే ఫీలయ్యానో... సినిమా చూసినప్పుడు కూడా అదే అనుభూతి కలిగింది. చెప్పిన దానికన్నా వంద శాతం స్ట్రాంగ్‌గా ఈ సినిమా తీశాడు. మంచి ఎమోషన్స్‌తో కూడిన స్టైలిష్ సినిమా చూశాం అనే అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది.

మేఘ గ్లామర్ ప్లస్‌గా...

చైత్ర క్యారెక్టర్‌లో మేఘా ఆకాష్ చక్కగా నటించింది. సినిమాలో డబ్బున్న అమ్మాయి పాత్రలో తను కనిపిస్తుంది. మేఘ గ్లామర్ సినిమాకు ఎంతో ప్లస్ అవుతుంది. ఆమె మంచి టాలెంట్ ఉన్న నటి. తప్పకుండా భవిష్యత్తులో పెద్ద హీరోయిన్ అవుతుంది.

ప్రాణం పెట్టి మ్యూజిక్ ఇచ్చారు...

మణిశర్మ లెజండరీ మ్యూజిక్ డైరెక్టర్. ఈ సినిమాకు ప్రాణం పెట్టి ఆయన మ్యూజిక్ ఇచ్చారు. ముఖ్యంగా ఇలాంటి సినిమాకు రీరికార్డింగ్ చాలా ముఖ్యం. మణిశర్మ అద్భుతమైన రీరికార్డింగ్ ఇచ్చారు. లగ్గం టైమ్.., సన్‌షైన్.., బొమ్మోట... పాటలు ఇదివరకే సూపర్ హిట్ అయ్యాయి. హాలీవుడ్ రేంజ్‌లో మంచి మ్యూజిక్ ఇచ్చారు.

కథలో భాగంగానే కామెడీ...

సినిమాలో విడిగా కామెడీ ట్రాక్ అని ఏమీ ఉండదు. కథలో భాగంగానే కామెడీ ఉంటుంది. ముఖ్యంగా హీరో,హీరోయిన్‌ల మధ్య వచ్చే లవ్ ట్రాక్ హ్యూమరస్‌గా ఉంటుంది. అలాగే మధు చేసిన కామెడీ ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంది. అన్ని రకాల కమర్షియల్ అంశాలు సినిమాలో ఉంటాయి.

ఆ సీన్‌ను ఉపయోగించుకున్నాం...

'తమ్ముడు' సినిమాలో పవన్‌కళ్యాణ్ లుంగీ కట్టుకొని బీడీ కాల్చే సీన్‌ను ఈ చిత్రంలో ఉపయోగించుకున్నాం. పవన్‌కు నేను వీరాభిమానిని. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. నేను చేసే సినిమాల్లో ఆయన చిత్రంలోని సీన్ ఏదో ఒకటి ఉపయోగిస్తాను. ఎందుకంటే ఆయనంటే నాకు అంత ఇష్టం.

కొత్త నితిన్‌ను చూస్తారు...

ఈ సినిమా కోసం దాదాపు ఐదు, ఆరు నెలలు ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేశాం. నా క్యారెక్టర్ పరంగా కానీ... లుక్స్ పరంగా కానీ చాలా శ్రద్ధ తీసుకున్నాం. ఈ సినిమాకు అలెగ్జాండర్ విజయ్ హెయిర్ స్టైలిస్ట్‌గా పని చేశారు. చాలా మంది పెద్ద హీరోల కోసం తను పనిచేస్తుంటారు. ఈ సినిమాలో చాలా రకాల గెటప్‌లలో కనిపిస్తాను. కాస్ట్యూమ్స్‌పరంగా, హెయిర్ స్టైల్ పరంగా ఒక కొత్త నితిన్‌ను ఈ సినిమాలో చూస్తారు.

హిట్, ఫ్లాపులు ప్రేక్షకుల చేతిలోనే...

కెరీర్ ప్రారంభంలో జయం, దిల్, సై వంటి వరుస హిట్ మూవీలతో ప్రేక్షకులను అలరించాను. దీంతో ప్రేక్షకుల హీరోగా నాకు పేరొచ్చింది. ఆతర్వాత హిట్, ఫ్లాప్‌లు వచ్చాయి. ఎప్పుడూ మంచి సినిమాలు చేయాలని తాపత్రయపడుతుంటాను. సంవత్సరానికి ఒక్క సినిమా చేసినా ప్రేక్షకులకు నచ్చేలా ఉండాలని కోరుకుంటాను. ఇక హిట్, ఫ్లాపులు అనేవి ప్రేక్షకుల చేతిలో ఉంటాయి.

తదుపరి చిత్రాలు...

ప్రస్తుతం పవన్‌కళ్యాణ్‌త్రివిక్రమ్ కలిసి నిర్మిస్తున్న సినిమా చేస్తున్నాను. కృష్ణచైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మేఘా ఆకాష్ హీరోయిన్‌గా నటిస్తోంది. కొన్ని కథలు కూడా వింటున్నాను. ఇంకా ఏదీ ఫైనలైజ్ కాలేదు. అన్నీ చర్చల దశలోనే ఉన్నాయి.



సమంత

చేనేత కార్మికుల కోసం..

టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సమంత. 'ఏ మాయ చేశావే' సినిమాతో కుర్రకారు మనసును దోచుకున్న ఈ బ్యూటీ ఆతర్వాత పలు హిట్ సినిమాల్లో నటించి టాప్ హీరోయిన్‌గా రాణించింది. అయితే అక్కినేని నాగచైతన్యతో ప్రేమలో పడిన ఆమె త్వరలో అతన్ని పెళ్లాడబోతోంది. అక్కినేని కుటుంబంలో కోడలిగా స్థానం సంపాదించుకోబోతున్న సమంత ప్రస్తుతం బిజీ షెడ్యూళ్లతో సినిమాలు చేస్తోంది. రామ్‌చరణ్‌సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రంగస్థలం 1985'తో పాటు సావిత్రి బయోపిక్ 'మహానటి' షూటింగ్‌లలో బిజీగా ఉంది.

అయితే చేనేత కార్మికుల కోసం ప్రచారకర్తగా సమంత తన బాధ్యతలను నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే. ఇంత బిజీ షెడ్యూల్‌లో కూడా సమయం దొరికితే ఆమె చేనేత వస్త్రాల ప్రచారంలో గడుపుతోంది. అంతేకాకుండా చేనేత కార్మికుల జీవితాలు, వారి కష్టాలను ఒక డాక్యుమెంటరీ ద్వారా ప్రజలకు తెలియజేయనుందని తెలిసింది.

తెలంగాణకు చెందిన దూలం సత్యనారాయణ ఈ డాక్యుమెంటరీని తెరకెక్కించనున్నాడు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇది రూపుదిద్దుకోనుంది. మరి ఈ డాక్యుమెంటరీలో సమంత ఏ పాత్ర చేస్తుందా అని ప్రతి ఒక్కరిలో ఆసక్తి నెలకొంది. ఈ స్టార్ హీరోయిన్ ఎంతవరకు ఈ ప్రయోగాన్ని సక్సెస్ చేస్తుందో చూడాలి.

డిఫరెంట్‌గా లవకుమార్ లుక్



ఎన్టీఆర్ మొన్నటి లుక్‌తో అదరగొట్టేశాడు. ఇప్పుడు కూడా అలాంటి లుక్ కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎదురుచూశారు. ఈ తరుణంలో 'జై లవ కుశ'లోని ఎన్టీఆర్ రెండో లుక్ రిలీజైంది. ఈ కొత్త లుక్ డిఫరెంట్‌గా ఉంది. కె.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జై లవ కుశ' చిత్రంలో ఎన్టీఆర్ మూడు విభిన్నమైన పాత్రల్లో నటిస్తున్నాడు. ఇందులోని జై క్యారెక్టర్ ఎలా ఉంటాడో ఇదివరకే పరిచయం చేశారు ఫిల్మ్‌మేకర్స్. ముఖ్యంగా ఆ క్యారెక్టర్‌కు సంబంధించిన ఫస్ట్‌లుక్‌కంటే ఆ పాత్రను పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన టీజర్ విపరీతంగా ఆకట్టుకుంది. సముద్రమంత ధైర్యం కావాలా... అంటూ జై చేసిన విన్యాసం అదిరిపోయింది. ఇప్పుడు ఇక లవకుమార్ లుక్‌ను రిలీజ్‌చేశారు ఫిల్మ్‌మేకర్స్. ఈ లుక్‌లో చూస్తుంటే లవకుమార్ కొంత విభిన్నంగా కనిపించాడు. అయితే ఈ క్యారెక్టర్ గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే మరో టీజర్ రావాల్సిందే. ఈ చిత్రాన్ని కళ్యాణ్ రామ్ నిర్మిస్తుండగా దసరా పండుగ కానుకగా సెప్టెంబర్ 21న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.



'ప్రతిక్షణం' ప్రేక్షకులు థ్రిల్ ఫీలవుతారు

మనీష్‌బాబు, తేజస్విని నాయకానాయికలుగా తెరకెక్కిన చిత్రం 'ప్రతిక్షణం'. శ్రీ భాగ్యలక్ష్మీ మూవీ మేకర్స్ పతాకంపై జి.మల్లిఖార్జున రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి నాగేంద్రప్రసాద్ దర్శకత్వం వహించారు. ఈనెల 18న ఈ చిత్రం విడుదలకానున్న సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. ఇదే వేదికపై సినిమా ప్లాటినమ్ డిస్క్ వేడుక కూడా జరిగింది. అతిథుల చేతుల మీదుగా చిత్ర బృందానికి జ్ఞాపికల ప్రదానం జరిగింది. ఈ సందర్భం గా ముఖ్య అతిథి రాజ్ కందుకూరి మాట్లాడుతూ ''సినిమా టైటిల్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. మంచి కంటెంట్ ఉంటే ఎలాంటి సినిమా అయినా ఆడుతుం ది. ఈ సినిమా పెద్ద విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. చిత్ర నిర్మాత జి.మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ ''ప్రేక్షకులంతా థ్రిల్లయ్యేలా ఈ చిత్రం ఉంటుంది. రఘురాం అందించిన పాటలకు చాలా మంచి స్పందన లభించింది. సినిమాలోని ప్రతి సన్నివేశం కొత్త అనుభూతిని కలిగిస్తుంది''అని తెలిపారు. చిత్ర హీరో మనీష్ బాబు మాట్లాడుతూ ''హర్రర్ సినిమాల్లో చెప్పుకోదగ్గ సినిమా ఇదవుతుంది. హీరోగా నాకు మంచి పేరు తెచ్చే చిత్రమిది''అని చెప్పారు. సంగీత దర్శకుడు రఘురాం మాట్లాడుతూ ''నా కెరీర్ ఆరంభంలోనే వైవిధ్యమైన సంగీతాన్ని అందించే అవకాశం రా వడం అదృష్టంగా భావిస్తున్నను. పాటలు హి ట్ కావడం ఆనందంగా ఉంది''అని అన్నా రు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి రామసత్యనారాయణ, మల్కాపురం శివకుమార్, సాయి వెంకట్, దేవారెడ్డి, ఓంనాథ్ రెడ్డి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మనుషుల్ని ప్రేమించే దెయ్యం!



సోని టీమ్ సమర్పణలో సోని ప్రధాన పాత్రలో సాయి హాసిని ప్రొడక్షన్ పతాకంపై సుజయ్, తనిష్క్, చంద్రకాంత్, రష్మీ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'నాకు మనసున్నది'. రాజశేఖర్ దర్శకత్వంలో దేవశంకర్ గౌడ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. ట్రైలర్‌ను ప్రతాని రామకృష్ణగౌడ్ విడుదల చేశారు. బిగ్ సీడీని కవిత, ఆడియో సీడీలను భానుచందర్ విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ ''దర్శకుడు రాజశేఖర్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. నిర్మాతకు ఈ చిత్రం మంచి లాభాలు తీసుకురావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. సాయి వెంకట్ మాట్లాడుతూ ''సినిమా ట్రైలర్ ఎంతో బాగుంది. దెయ్యం మనుషుల్ని ప్రేమించడమనే కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రం అద్భుతంగా తెరకెక్కింది''అని తెలిపారు. కవిత మాట్లాడుతూ ''టైటిల్‌కు తగ్గట్టుగానే సినిమా అందంగా రూపుదిద్దుకుంది. సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని ఆశిస్తున్నాను''అని చెప్పారు. అప్పారావు, సూర్య, సతీష్, నవ్వుల వినోద్, యర్రం శెట్టి వీరన్న, నట నరసింహ, బేబి హాసిని, నవ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పెద్దాడ వెంకట రమణ, పాటలు: మణికుమార్ దుల్లా, రాజు, సంగీతం: ఉదయకిరణ్, ఎడిటింగ్: చందు ఐశ్వర్య.



కత్రినాకైఫ్

ఎర్రటి ఎండలో యాక్షన్ సీన్స్

సాధారణంగా ఇప్పటి యంగ్ హీరోయిన్లు ఎక్కువ కాలం పాటు వెండితెరపై మెరువలేరు. కానీ కొందరు సీనియర్ హీరోయిన్లు సినిమా రంగంలోకి అడుగుపెట్టి 15 ఏళ్లవుతున్నా జయాపజయాలతో సంబంధం లేకుండా స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూనే ఉంటారు. నేటి తరం యంగ్ హీరోయిన్లకు సవాలు విసురుతుంటారు. మూడు పదుల వయసుదాటినా ఇంకా ఇరవై ఏళ్ల అమ్మాయిల్లానే అందచందాలతో ప్రేక్షకులను మురిపిస్తారు. అలాంటి హీరోయిన్లలో కత్రినాకైఫ్ ఒకరు. తెలుగులో మల్లీశ్వరి సినిమాలో మహారాణిగా నటించిన ఈ భామ ఆతర్వాత బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ముఖ్యంగా బాలీవుడ్ ఖాన్ త్రయంగా చెప్పుకునే షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ సినిమాలలో ఆడిపాడింది. అయితే ఈమధ్యన కత్రినా కెరీర్ కాస్త నెమ్మదించింది. ఊహించని ఫ్లాపులతో సతమతమవుతోంది. అయినాకూడా ఆమెకు ఆఫర్లు ఏమాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం సల్మాన్‌తో 'టైగర్ జిందా హై' సినిమాలో నటిస్తోంది ఈ బ్యూటీ. యాక్షన్ సీన్స్ కోసం సినిమా యూనిట్ 44 డిగ్రీల ఎర్రటి ఎండలో కత్రినాపై కొన్ని షాట్స్‌ను తెరకెక్కించారట. అంతటి ఎండలో కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా హుషారుగా షూటింగ్‌లో పాల్గొందట ఈ బ్యూటీ. వయసు పెరుగుతున్నా తనలో సినిమాల పట్ల ప్యాషన్ ఏమాత్రం తగ్గలేదని నిరూపిస్తోంది కత్రినా. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఈ చిత్రంతో పాటు అమీర్‌ఖాన్, షారుఖ్ ఖాన్ సినిమాల్లోనూ నటిస్తోంది.

అందాలొలికించిన సురభి



క్రేజ్ కోసం గ్లామర్ డోస్ పెంచడం హీరోయిన్లకు అలవాటే. అయితే అందాలు ఆరబోసినప్పటికీ కొంత మంది ముద్దుగుమ్మలకు కాలం కలిసి రాదు. సరైన అవకాశాలు రావు. రఘువరన్ బీటెక్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన అందాల తార సురభి ఆతర్వాత తెలుగులో 'బీరువా' సినిమా చేసింది. అనంతరం జెంటిల్‌మన్, ఎక్స్‌ప్రెస్‌రాజా చిత్రాలతో మంచి విజయాలను తన ఖాతాలో వేసుకుంది ఈ బ్యూటీ. అయితే స్టార్ హీరోల సరసన నటించాలని తహతహలాడుతోంది సురభి. అందుకోసం గ్లామర్ డోస్ పెంచాలని నిర్ణయించుకుందట. ప్రస్తుతం సురభి చేతిలో ఒకే సినిమా ఉంది. ఈ సినిమాలో మెగా హీరో అల్లు శిరీష్ సరసన ఆమె హీరోయిన్‌గా చేస్తోంది. మెగా ఫ్యాన్స్‌ను తనవైపు తిప్పుకోవడానికి ఈ భామ సినిమాలో హద్దులు దాటి అందాలొలికించిందని తెలిసింది. సురభి గ్లామర్‌కు కుర్రకారు ఫిదా అయిపోవడం ఖాయమని అంటున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాకు ఓ వినూత్నమైన టైటిల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు.



16.38 శాతం పెరిగిన మహీంద్రా చైర్మన్ వేతనం

న్యూఢిల్లీ : గత ఆర్థిక సంవత్సరంలో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) చైర్మన్ ఆనం ద్ మహీంద్రా వేతనం 16.38 శాతం పెరిగింది. వార్షికంగా ఆయన వేతనం రూ.7.67 కోట్లుగా ఉంది. ఈమేరకు కంపెనీ వార్షిక నివేదిక వెల్లడిం చింది. కంపెనీలోని మధ్యస్థాయి ఉద్యోగులతో పోలిస్తే ఆయన వేతనం 108.27 శాతం ఎక్కువ అని పేర్కొంది. అదేవిధంగా మేనేజింగ్ డైరెక్టర్ పవన్ గోయెంక వేతన కూడా రూ.7.6 కోట్లతో 15.86 శాతం పెరిగిందని కంపెనీ వెల్లడించింది. 2016–17లో అమలుచేసిన ఇఎస్ఒపి కార ణంగా ఇది 15.86 శాతం పెరిగిందని పేర్కింది. ఉద్యోగుల మధ్యస్థ వేతనంతో పోలిస్తే గోయెంకా వేతనం 104.43 శాతం వృద్ధిని సాధించింది. సంస్థ అందించిన నివేదిక ప్రకారం, 2016–17లో సంస్థ ఉద్యోగుల సగటు వేతనం రూ.7. 08 లక్షలు, 0.43శాతం పెరుగుదల నమోదైంది. పలు కంపెనీల సిఇఒల వేతనాలు భారీగా పెరుగుతున్నాయి. అయితే సాధారణ ఉద్యోగుల వేతనాలు మాత్రమే అదే విధంగా ఉండడం గమనించదగిన విషయం. ఇటీవల రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ వేతనంలో కొన్నేళ్లుగా మార్పు లేదనే విషయం ప్రకటించిన విషయం తెలిసిందే.

నకిలీ పాన్‌కార్డుల ఏరివేత

- **11.44 లక్షల కార్డులను రద్దు చేసిన ప్రభుత్వం**
- **ఒకే వ్యక్తికి అనేక కార్డులున్నాయని గుర్తించిన ఆదాయం పన్ను శాఖ**

న్యూఢిల్లీ : నకిలీ పాన్ కార్డుల ఏరివేతను కేంద్రం వేగవం తం చేసింది. దాదాపు 11.44 లక్షల పాన్(పర్మనెంట్ అ కౌంట్ నంబర్) కార్డులను నకిలీవిగా గుర్తిస్తూ ప్రభుత్వం రద్దు చేసింది. ఒకే వ్యక్తికి బహుళ పాన్ కార్డులను గుర్తించామని, ఇటువంటి పాన్ కార్డులు 11,44,211 ఉన్నాయని, అందుకే వీటిని డియాక్టివేట్ చేశామని ఆర్థికశాఖ సహాయ మంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు. ఈమేరకు రాజ్యసభలో లిఖిత పూర్వక సమాధానమిచ్చి నట్టు ఆయన మీడియాతో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకే వ్యక్తి అనేక కార్డులను కల్గి ఉండరాదని అన్నారు. ఒకేవ్యక్తి పలు పాన్ నంబర్లు కల్గివుండటం, నకిలీ పాన్‌కార్డులను నియంత్రించడంలో భాగంగా కేం ద్రం ఈ చర్యలు చేపట్టింది. ఆధార్‌కార్డును పాన్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని గతంలో ప్రభుత్వం ప్రక టించిన విషయం తెలిసిందే. ఇందుకు ఆగస్టు 31 ఆఖరి గడువుగా నిర్ణయించింది. కేంద్రం చేపట్టిన ఈ చర్యతో ప్రజలు పాన్‌కార్డు గురించి తెలుసుకోవాలంటే ఆదాయం పన్నుశాఖ ఇ–ఫైలింగ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి చెక్ చేసుకోవాలి. హోమ్‌పేజీలో ఉన్న 'నో యువర్ పాన్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి మీ ఇంటిపేరు, మొదటి పేరు, పాన్ స్టేటస్, జెండర్, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్‌తో నమోదు చేయాలి. ఆ తర్వాత రిజిస్టర్ మొబైల్ నంబర్‌కి ఒటిపి వస్తుంది. అప్పుడు పాన్ కార్డు వాలిడ్ అయితే, యాక్టివ్ అని చూపిస్తుంది. ఒకే విధమైన వివరాలతో పలు పాన్ నంబర్లు కల్గి ఉంటే పేజీలో అలర్ట్ వస్తుంది. ఒకవేళ ఆధార్‌తో పాన్ అనుసంధానం చేసుకోకపోతే డిసెంబర్ 2017 నాటికి పాన్ రద్దు అవుతుంది.



పాన్ కార్డు యాక్టివ్‌గా ఉందా, లేదా, తెలుసుకోవాలంటే?

- ఆదాయం పన్ను ఇఫైలింగ్ పోర్టల్ www.incometaxindiaefiling.gov.in ను సందర్శించాలి.
- హోమ్ పేజీలో 'సర్వీసెస్' అనే టాబ్ క్రింద 'నో యువర్ పాన్' క్లిక్ చేయాలి.
- వెబ్‌సైట్ కొత్త పేజీలోకి వెళ్తుంది. అక్కడ పేరు, జెండర్, మతం, జనన తేదీ, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ ఎంటర్ చేసి 'సబ్ మిట్ అనే ఆప్షన్ ను క్లిక్ చేయండి.
- రిజిస్టర్డ్ మొబైల్ నంబరుకు ఒటిపి(వన్ టైమ్ పాస్‌వర్డ్) వస్తుంది. దీన్ని ఎంటర్ చేసి వేలిడేట్ అనే బటన్ క్లిక్ చేయండి.



- ఇప్పుడు పాన్ కార్డు యాక్టివ్‌గా ఉందా? లేదా తెలియజేస్తుంది.

పాన్‌తో ఆధార్ అనుసంధానం ఎలా?

- incometaxindiaefiling.gov.in. లాగిన్ కావాలి. ఇది తప్పనిసరేమీ కాదు.. లాగిన్ కాకుండా మీరు డైరెక్టుగా స్టెప్–2కు వెళ్లవచ్చు. ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్ ద్వారా చాలా సులువుగా ఆధార్‌తో పాన్ లింక్ చేయవచ్చు.
- 'లింక్ ఆధార్' అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.
- డైరెక్టుగా లింక్ ఆధార్ అంటే పాప్ అప్ విండో ఒకటి ఓపెన్ అవుతుంది. అక్కడ ఆధార్ నెంబర్, పాన్ నంబర్ ఎంట్రీ చేయాలి.
- కాప్చా కోడ్‌ను ఎంటర్ చేసి, 'లింక్ ఆధార్'పై క్లిక్ చేయాలి.
- పుట్టిన తేదీ, ఇంటిపేరు, పేరు, ఆధార్, పాన్‌తో సరిపోలితే వెంటనే ఆధార్‌తో పాన్ విజయవంతంగా అనుసంధానమైనట్టుగా ఒక మెసేజ్ వస్తుంది.

ఎస్ఎమ్ఎస్ ద్వారా ఎలా?

- ఈ కింద ఫార్మాట్ ప్రకారంగా 567678 లేదా 56161 కు ఎస్ఎంఎస్ చేయాలి.
- UIDPAN<SPACE><12 అంకెల ఆధార్><Space><10 అంకెల పాన్>
- ఆ తర్వాత పైన చెప్పిన 567678 లేదా 56161 నెంబరుకు ఎస్ఎంఎస్ చేస్తే సరిపోతుంది.
- దీన్ని నిర్ధారిస్తూ మన మొబైల్‌కు ఒక సందేశం వస్తుంది. దీంతో కీలకమైన ఆధార్‌తో పాన్ అనుసంధానం పూర్తవుతుంది.
- ఆగస్టు 31 లోపు ఆధార్‌తో అనుసంధానం కానీ పాన్ కార్డులు రద్దవుతాయని ఆదాయ పన్ను శాఖ ప్రకటించింది.

ఆగస్టు 22న బ్యాంకు యూనియన్ల సమ్మె



చెన్నై: ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనం, ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగుల యూనియన్లు ఆగస్టు 22న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. తమ డిమాం డ్లను నెరవేర్చాలని బ్యాంకు సంఘాలు మరోసారి సమ్మె కు దిగుతున్నాయి. ఈనెల 22న ఆలిండియా బ్యాంకర్ల సమ్మె తలపెట్టినట్టు ఎఐబిఇఎ (ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్) ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం ప్రకటించారు. ఆగస్టు 22 న మొత్తం బ్యాంకింగ్ రంగంపై సమ్మె జరుగుతుందని, వేతనాలు పెంపుతోపాటు బ్యాంకింగ్ రంగ సమస్యలను పరిష్కరిం చాలనే డిమాండ్‌తో ఈ సమ్మెకు దిగనున్నామని చెప్పా రు. దీనిపై రెండు రోజుల క్రితమే నోటీసులు అందజేశా మన్నారు. బ్యాంకింగ్ రంగంలో తొమ్మిది యూనియ న్లతో కూడిన ఎఐబిఇఎ ఈ సమ్మెలో పాల్గొంటోంద న్నారు. అలాగే వేతనం సమీక్షలాంటి, ఇతర సమస్య లను వేగంగా పరిష్కరించాలన్నారు. బ్యాంకుల్లో ఎన్‌పి ఎ(నిరర్థక ఆస్తులు) రద్దు చేయవద్దని, విలీనం, ప్రైవేటీ కరణ ఆలోచనలను మానుకోవాలని డిమాండ్ చేస్తున్నా మని అన్నారు.

హైదరాబాద్‌లో జీవాశ్రీ మూడో శాఖ ప్రారంభం

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆయుర్వేదిక్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సంస్థ జీవాశ్రీ హైదరాబాద్‌లో తన మూడవ వెల్‌నెస్ శాఖను ఏర్పాటు చేసుకు న్నట్లు జీవాశ్రీ మేనేజింగ్ డైరెక్టర్ ఫణిశ్రీ కొంతె, డైరెక్టర్ కిరణ్ ముతే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేట్‌బషీర్‌బాద్, మీనాక్షి ఎస్టేట్ కాలనీలో ఏర్పా టు చేసిన ఈ వెల్‌నెస్ కేంద్రంతో హైదరాబాద్‌లో తమకు మొత్తం మూడు శాఖలు అయ్యాయన్నా రు. ఆయుర్వేదంలోని పలు ప్రయోజనాలను విని యోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చి తెలంగాణ ప్రజలకు వాటిని ఉపయుక్తంగా ఉంచా లన్నది తమ ప్రయత్నమన్నారు.

పెరగనున్న ఎస్‌యువి, లగ్జరీ కార్ల ధరలు

- **జిఎస్‌టి సుంకం 25 శాతం పెంపు**

న్యూఢిల్లీ : ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్ల ధరలను పెంచుతోంది. జులై 1 నుంచి జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు చేసిన తర్వాత ఎస్‌యువి(స్పోర్ట్స్ యుటిలిటీ వెహి కిల్స్), మధ్యస్థాయి, భారీ, లగ్జరీ కార్ల ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే ప్రస్తుతం ఉన్న సుంకం 15 శాతం నుం చి 25 శాతానికి పెంచాలని జిఎస్‌టి కౌన్సిల్ తాజాగా తీసు కుంది. ఈ నిర్ణయం కార్ల ధరలకు రెక్కలొచ్చేలా చేసింది. జిఎస్‌టి కింద కార్లపై అధిక పన్ను రేటు 28 శాతం వసూ లు చేస్తున్నారు. దీనిపై ఇప్పుడు సెస్(సుంకం) 1–15 శాతం విధిస్తారు. జిఎస్‌టి అమలులో ఆదాయం నష్టానికి రాష్ట్రాలకు నష్టపరిహారం కింద ఈ సుంకం నిధి ఉంటుంది. ప్రస్తుతం ఎస్‌యువిలు, హైఎండ్ కార్లపై 28 శాతం జిఎ



స్‌టి పన్ను ఉండగా, అన్ని సుంకాలు కలుపుకుని కార్లపై మొత్తంగా 43 శాతం పన్ను పడుతోంది. అయితే చట్టాని సవరణ చేసి దీన్ని 53 శాతం వరకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కస్టర్డ్ ఫౌడర్, ఇడ్లి, దోష నుంచి విగ్ర హాలు, ప్రార్థన పూసల వరకు స్థానికుడు ఎక్కువగా వాడే ఉత్పత్తుల రేట్లను తగ్గించడానికి, ఎస్‌యువి, లగ్జరీ కార్లపై వేటు వేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తున్నట్టు అధికార వర్గా లు చెబుతున్నాయి. ఇటీవల సిగరెట్లపైనా ప్రభుత్వం సుం కాన్ని పెంచిన విషయం తెలిసిందే. సిగరెట్ల మాదిరిగానే హైఎండ్ కార్లపైనా కూడా సెస్‌ను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ మార్పులు వెంటనే చోటుచేసుకో వని, సెస్‌ను పెంచాలంటే శాసన సవరణలు అవసరం పడ తాయని పేర్కొంటున్నాయి. కార్లపై విధించే ఎక్కువ సుం కంతో, జిఎస్‌టి అమలుతో భారీగా రెవెన్యూలు కోల్పో తున్న రాష్ట్రాలకు పరిహార నిధిగా చెల్లించడానికి ఉపయో గించాలని ప్రభుత్వ వర్గాలు చూస్తున్నాయి. ప్రస్తుతం చిన్న కార్లపై 28 శాతం పన్ను, 1 శాతం సెస్ ఉంది. వాటిలో ఎ లాంటి మార్పులు చోటుచేసుకోవు.




ఎన్ఎండిసికి పిఆర్ఎస్ఐ అవార్డు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఐరన్ ఓర్ ఉత్పాదక సంస్థ ఎన్ఎండిసికి ప్రతిష్ఠాత్మక పిఆర్ ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ అవార్డు వరించింది. ఖనిజ భారతి కార్పొరేట్ డైరీ2017కు , ఎన్ఎం డిసి కో ఇన్ వెబ్‌సైట్ నిర్వహణకు గాను ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించింది. గ్రేటర్ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ సలహాదారు కెవి. రమణా చారిల నుండి ఎన్ఎండిసి సంస్థ తరఫున సిహెచ్ శ్రీనివాసరావు, ఎజిఎం (కార్పొరేట్ కమ్యూనికేషన్స్) అందుకున్నారు. ఈ కార్యక్ర మంలో కాన్ఫరెన్స్ ఛైర్మన్ సివి నర్సింహారెడ్డి తది తరులు పాల్గొన్నారు.

జియోకు దీటుగా ప్రత్యర్థి కంపెనీల ఆఫర్లు

న్యూఢిల్లీ : రిలయన్స్ జియో టెలికామ్ రంగంలోకి ప్రవే శించినప్పటి నుంచి ప్రత్యర్థి కంపెనీలకు కంటిమీద కును కులేకుండా పోయింది. జియో ఆఫర్లకు దీటుగా ప్రత్యర్థి కంపెనీలు కూడా ఆఫర్లను ప్రకటించాల్సిన తప్పని పరిస్థితి ఏర్పడింది. జియో ధన్ ధనా ధన్ ఆఫర్ రూ.399కు సరిస మానంగా ఇతర ప్రత్యర్థి కంపెనీలు కూడా ఆఫర్లను ప్రక టించాయి. వొడాఫోన్, ఐడియా, ఎయిర్‌సెల్ 84 రోజుల వ్యాలిడిటీతో 84 జిబి డాటాను అందిస్తున్నాయి. ఇప్పుడు ఎయిర్‌టెల్ కూడా ఈ జాబితాలో చేరి.. రూ.399 ప్లాన్ ఆఫర్‌తో రోజూ 1 జిబి డాటాను అందివ్వనున్నట్టు ప్రకటిం చింది. 84 జిబి డాటాతో పాటు అపరిమితి లోకల్, ఎస్‌టిడి కాల్స్‌ను అందిస్తోంది. రిలయన్స్ జియో తాజాగా బ్రాడ్ బ్యాండ్ రంగంపైనా దృష్టి.. భారీ ఆఫర్లతో వినియోగదారు లను తనవైపు తిప్పుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. జియో ఈ రంగంలోకి అడుగుపెట్టకముందే మేల్కొన్న ఎయిర్‌టెల్ వినియోగదారులను కాపాడుకునేందుకు సంచ లన ఆఫర్లతో ముందుకొచ్చింది. కొత్త కస్టమర్లకు బోనస్ డాటా ఆఫర్ కింద 1000 జిబి అదనంగా ఇవ్వనున్నట్టు ప్రకటించింది. అన్నిటికంటే తక్కువ ధరకు లభించే నెల వారీ టారిఫ్ ప్లాన్ రూ.899గా ఎయిర్‌టెల్ వెబ్‌సైట్‌లో పేర్కొంది. దీనికింద నెలకు 60 జిబి డాటా, అదనంగా ఏడాది పాటు 500 జిబి డాటా అందుకోవచ్చు. వేగం 40 ఎంబిపిఎస్ వరకు లభిస్తుంది. రూ.1099 ప్లాన్‌తో నెలకు 100 జిబి డాటా, స్పీడ్ 40 ఎంబిపిఎస్‌గా ఉంటుంది. 1000 జిబి డాటా బోనస్‌గా లభిస్తుంది. రూ.1299 ప్లాన్ తీసుకుంటే 100 ఎంబిపిఎస్ వేగంతో నెలకు 130 జిబి డాటా, అదనంగా 1000జిబి వరకు బోనస్ డాటాను అందిస్తుంది.



మార్కెట్‌పై ఐటి స్టాక్స్ దెబ్బ



న్యూఢిల్లీ : ఈక్విటీ మార్కెట్లు సోమవారం డీలాపడ్డాయి. కొన్ని కార్పొరేట్ కంపెనీల ఫలితాలు అధ్వాన్నంగా ఉండ డం, లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు మొగ్గుచూపడంతో సూచీలు స్వల్పంగా నష్టపోయాయి. రూపాయితో పోలిస్తే డాలర్ల బలహీనపడడంతో ఐటి స్టాక్స్‌పై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బిఎస్ఇ సూచీలో ఇన్ఫోసిస్ స్టాక్ భారీగా పతనమైంది. దాదాపు 1.75 శాతం మేరకు ఈ స్టాక్ పడి పోగా, టిసిఎస్, విప్రో షేర్లు కూడా నష్టాల దిశగానే పయ నించాయి. 30 షేర్ల బిఎస్ఇ సెన్సెక్స్ ఓ దశలో 32,377 పాయింట్లకు చేరుకుంది. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్ర వాహం, అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా ఉండ డంతో ప్రారంభంలో ఈ సూచీ అత్యంత గరిష్ఠ స్థాయి 32,396 పాయింట్లకు చేరుకుంది. ట్రేడింగ్ ముగిసే సమ యానికి సెన్సెక్స్ 52 పాయింట్లు నష్టపోయి 32,274 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 9 పాయింట్లు కోల్పోయి 10,057 పాయింట్ల వద్ద స్థిరపడింది. బ్యాంకిం గ్, ఐటి, టెక్, రంగాలతో పాటు, మెటల్, రియల్ ఎస్టేట్, వాహన రంగాల షేర్లలో మదుపరులు పెట్టుబడులు పెట్ట డం మార్కెట్‌కు మరింత బలాన్ని ఇచ్చింది. అయితే మా ర్కెట్ ఆఖరి సమయంలో నేలచూపులు చూశాయి. దీంతో అప్పటిదాకా లాభాలతో ట్రేడ్ అయిన సూచీలు ఒక్కసా రిగా ఒడిదొడుకులకు లోనవగా, ఇన్వెస్టర్లు లాభాల స్వీకర ణకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లో మునిగాయి. ఆఖరికి టాటా స్టీల్, ఎస్‌బిఐ, బిపిసిఎల్, అదానీ పోర్ట్స్, ఐసిఐసిఐ బ్యాంకు తదితర షేర్లు లాభాలను నమోదు చేశా యి. మరోవైపు ఎన్‌టిపిసి, ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, టాటామోటర్స్(డి) షేర్లు నష్టాల్లో ముగిశాయి. బిఎస్ఇ రంగాలవారీ సూచీల్లో ఐటి అత్యధి కంగా 0.94 శాతం నష్టపోగా, ఆ తర్వాత టెక్ 0.83 శశాతం డౌన్ అయింది.

అక్టోబర్‌లో విదేశాలకు గో ఎయిర్ విమానాలు

కోల్‌కతా : బడ్జెట్ ప్రైవేటు విమానయాన సంస్థ గో ఎయిర్ ఈ ఏడాది అక్టోబర్ నుంచి విదేశాలకు విమాన సేవలను ప్రారంభించనుంది. ఈమేరకు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ హెహ్ వాడియా ప్రకటన చేశారు. తక్కువ ఖర్చుతో నడిచే విదేశీ విమాన సర్వీసులు ప్రారంభించనున్నామని, ఆసి యా ప్రాంతాలకు తమ విమాన సంస్థ వెళ్లనుం దని, అక్కడ గమ్యాలపై పరిశీలించనుందని ఆయ న తెలిపారు. ప్రారంభంలో ఆసియా ప్రాంతంలో తమ సేవలను ప్రారంభించనున్నామని, ప్రస్తుతం ఉన్న 24 విమానాల పాటు నియో ఎ320 143 ఎయిర్ బస్‌లకు ఆర్డర్ చేశామని ఆయన తెలిపా రు. వీటిలో అయిదు అందాయని, ఇంజిన్ లోపా ల కారణంగా డెలివరీ ఆలస్యమవుతోందని వాడి యా వెల్లడించారు.





జాతీయ స్థాయిలో గీతం వర్సిటీ విద్యార్థుల ప్రతిభ

మన తెలంగాణ / హైదరాబాద్ : గీతం విశ్వవిద్యాలయం హైదరా బాద్ విద్యార్థులు వర్చువల్ బాజా ఎస్ఏఈ ఇండియా2017 జాతీయ స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి తమ ప్రతిభను చాటారు. పంజాబ్ రాష్ట్రం పాటియాలలోని చిత్కార విశ్వవిద్యాలయంలో నిర్వ హించిన పోటీలో ఈ ఘనతను సాధించినట్లు గీతం ప్రో వైస్ ఛాన్స్ల ర్ ప్రొ. ఎన్. శివప్రసాద్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్ల డించారు. జాతీయ స్థాయి తొలి రౌండ్ పోటీలలో ట్రైడెంట్ పేరిట జట్టుగా ఏర్పడిన గీతం విద్యార్థులు మొత్తం 200 మార్కులకు గాను 167.8 పాయింట్లు సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.పి. ఈశ్వరయ్య పర్యవేక్షణలో డా. పి. శ్రీనివాస్, జి. భాస్కర రావుల మార్గదర్శనంలో వచ్చే ఏడాది జనవరిలో మధ్యప్రదేశ్‌లో నిర్వహించే తుది పోటీలకు సిద్ధమవుతోందని ఆయన పేర్కొన్నారు. మంచి ప్రతిభ చాటిన జట్టు సభ్యులను స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ ప్రొ. సిహెచ్. సంజయ్, రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, పలువురు అధ్యాపకులు అభినందించినట్లు తెలిపారు.

టాటా స్టీల్ లాభం రూ.921 కోట్లు

న్యూఢిల్లీ : జూన్ ముగింపునాటి తొలి త్రైమాసిక ఫలితాల్లో టాటా స్టీల్ లాభాలను నమోదు చేసింది. కంపెనీ నికర లాభం రూ.921 కోట్లు నమోదు చేయగా, గత ఏడాది ఇదే సమయంలో సంస్థ నికర నష్టం రూ.3,183 కోట్లుగా ఉంది. అత్యధిక ఉత్పత్తి, పెట్టుబడుల ఉపసంహరణ నుంచి ఒకేసారి ఆదాయం వంటివి కంపెనీ లాభాల్లోకి వెళ్లేందుకు దోహదం చేశాయి. అంచాలనకనుగుణంగానే ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాల్లో నష్టాలనుంచి కోలుకొని లాభాలను నమోదు చేసింది. కంపెనీ అమ్మకాలు రూ.30,803 కోట్ల తో 19 శాతం వృద్ధిని నమోదు చేయగా, గతేడాదిలో ఇది రూ. 25,897 కోట్లుగా ఉంది. ప్రధానంగా కళింగ నగర్ ప్లాంట్ ద్వారా అమ్మకాలు సంస్థ లాభాలు పెరిగేందుకు దోహదం చేశాయి. మరో వైపు ఫలితాలు మెరుగ్గా ఉండనున్నాయనే నేపథ్యంలో బిఎస్ఇలో టాటా స్టీల్ 4.33 శాతం పెరిగి 600 రూపాయలకు చేరుకుంది.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	32273.67	-51.74	0.16%
నిఫ్టీ	10057.40	-9.00	0.09%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27110	28994.65	0.04%
ముంబై	28070	30021.39	0%
ఢిల్లీ	27400	29304.81	0%
కోల్‌కతా	27850	29786.10	0.57%
కేరళ	26400	28235.29	0.75%
బెంగళూరు	26550	28395.72	0%
హైదరాబాద్	27120	29005.35	0%
గల్ఫ్	1337.28	1430.25	0%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	40800.00	40600.00	0.49
ముంబై	40800.00	40600.00	0.49
ఢిల్లీ	40800.00	40600.00	0.49
కోల్‌కత్తా	40800.00	40600.00	0.49
హైదరాబాద్	40800.00	40600.00	0.49



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	321	విశాఖపట్నం	330
వరంగల్	320	చిత్తూరు	365
విజయవాడ	323	చెన్నై	372
గోదావరి	323	బెంగళూరు	360

త్వరలోనే పన్నీర్ విలీనం: పళని



చెన్నై : అన్నాడిఎంకె మునుపటిలాగానే సంఘటితం అవుతుందని, చీలిక వర్గాల విలీనం జరుగుతుందని తమిళనాడు ముఖ్యమంత్రి కె పళనిస్వామి తెలిపారు. చాలా కాలంగా రెండు వర్గాల విలీనం జరగాలని తాను ఆశిస్తున్నానని, త్వరలోనే ఇది సాధ్యం అవుతుందని ముఖ్యమంత్రి సోమవారం విలేకరులకు చెప్పారు. అయితే ఎప్పుడు ఈ ప్రక్రియ ఉంటుంది? ఏ విధంగా సాధ్యం అవుతుందనే వివరాలు వెల్లడించలేదు. అధికార ఎఐఎడిఎంకె (అమ్మ) వర్గం నుంచి సరైన విధంగా స్పందన లేదని ప్రత్యర్థి వర్గం నేత పన్నీరుసెల్వం చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి మాట్లాడారు. చాలా కాలంగా రెండు వర్గాల సయోధ్య ప్రతిపాదనపై చర్చలు సాగుతున్నాయని వివరించారు. పళనిస్వామి వర్గీయులు ఎప్పటికప్పుడు దాటవేతకు దిగుతున్నారని, కలిసి ఉంటే బాగుంటుందనే మాటలు చెపుతున్నారు తప్ప చేసిందేమి లేదని ఇటీవలే పన్నీరు సెల్వం వ్యాఖ్యానించారు. అధికార పార్టీలో ప్రాధాన్యతను కోల్పోయిన శశికళ మేనల్లుడు దినకరన్ ఇప్పుడు తిరిగి పార్టీలో ప్రాబల్యం చాటుకునే యత్నాలకు దిగడంతో ఇప్పుడు ముఖ్యమంత్రి నుంచి విలీన ప్రస్తావన వెలువడింది. ఓ వైపు దినకరన్ పార్టీలో ఆధిపత్యం కోసం వేగం పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటన ఉంటుందని ప్రకటించారు. తనకు తానుగా తన పార్టీ పదవిని వాడుకుంటూ పార్టీ కార్యవర్గ సభ్యులను నియమించారు. ఇదంతా కూడా ఇప్పుడు పళనిస్వామి వర్గానికి ఇబ్బందిని తెచ్చిపెట్టింది.

ఆర్టికల్ 35ఎ రద్దుకు వ్యతిరేకం

శ్రీనగర్ : రాజ్యాంగంలోని ఆర్టికల్ 35ఎని రద్దు చేసే ఆలోచనను విపక్ష పార్టీలు, ప్రజలు వ్యతిరేకిస్తారని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా సోమవారం స్పష్టం చేశారు. ఇక్కడ ఆయన అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభాగం, సిపిఎంకి చెందిన నాయకులు, పలువురు స్వతంత్రులు సహా వివిధ పార్టీలు ఒక సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశానంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ....'ఆర్టికల్ 35ఎ రద్దుకు ప్రభుత్వం ఉపక్రమిస్తే, ప్రజల ఆగ్రహాన్ని చవిచూస్తుంది. అమర్‌నాథ్ యాత్ర భూ వివాదం తలెత్తినపుడు ప్రజల ప్రతిస్పందనను మరిచిపోరాదు. ఇపుడు ఆర్టికల్ 35ఎ రద్దుకు నిర్ణయిస్తే పరిణామాలు అంతకంటే తీవ్రంగానే ఉంటాయి. ఆర్టికల్ 35ఎని ప్రభుత్వం అలాగే కొనసాగించకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది' అని అబ్దుల్లా అన్నారు. ఈ విషయంలో విపక్ష పార్టీలు ఐక్యంగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఆర్టికల్ 35ఎ అనేది జమ్ము-కశ్మీర్‌లోని శాశ్వత నివాసుల నిర్ధారణకు రాష్ట్ర అసెంబ్లీకి అవకాశం కల్పిస్తుంది. అందువల్ల ఈ విషయాన్ని తాము ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు.

ఆగస్టు 15న సంకల్ప్ పర్వం

న్యూఢిల్లీ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని సంకల్ప్ పర్వగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రజలు సామాజిక సమస్యల పరిష్కారానికి సంకల్పం తీసుకోవాలని, నూతన భారత నిర్మాణంలో తమ అభిప్రాయాలను పంచుకోవాలని పిలుపు నిచ్చారు. 70వ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 సంకల్ప్ దీక్షగా ఉంటుందని సంబంధిత వ్యక్తిగత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన వెలువరించింది. ఈ ఏడాది క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సం ఉంటుంది. 1942 ఆగస్టు 9న దేశ వ్యాప్తంగా మహాత్మా గాంధీ నాయకత్వంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమం పిలుపు వెలువడిందని, ఆగస్టు తొమ్మిదిన ఈ నేపథ్యంలో పలు కార్యక్రమాలు ఉంటాయని మంత్రిత్వశాఖ తెలిపింది. 2017 -2022 వరకూ మన సంకల్పం సిద్ధి దశకు చేరుకోవాలని భావిస్తూ ఆగస్టు 15వ తేదీని సంకల్ప పర్వం ఆరంభంగా నిర్ణయించారని వెల్లడించారు.

ఐటి విచారణకు కర్నాటక మంత్రి

బెంగళూరు : కర్నాటక మంత్రి డి.శివకుమార్ సోమవారం ఆదాయపు పన్ను శాఖ (ఐటి) అధికారులు ముందు హాజరయ్యారు. గత వారం ఆయనకు సంబంధించిన ఆస్తులపై ఐటి దాడులు జరిగాయి. ఆదాయపు పన్ను ఎగవేత కేసులో మూడు రోజులుగా దర్యాప్తు చేసిన అధికారులు తమ ఎదుట విచారణకు హాజరు కావాలని సమర్లు జారీ చేశారు. దీంతో ఆయన తన సోదరుడు, బెంగళూరు రూరల్ ఎంపి డికె సురేష్‌తో కలిసి ఇక్కడి ఐటి కార్యాలయానికి వచ్చారు. అవసరమైతే మరోసారి విచారణకు తనను పిలిచే అవకాశం ఉందని శివకుమార్ తెలిపారు. ఆదాయపు పన్ను విషయంలో సాధారణ పౌరుడు లేదా వ్యాపారులు ఎవరికైనా సమన్లు జారీ చేసే, ప్రశ్నించే అధికారం ఆదాయపు పన్ను అధికారులకు ఉందని, తాను ఇంతకు ముందు పలుమార్లు ఇక్కడికి వచ్చానని ఆయన పేర్కొన్నారు. తాను ఇంతకు ముందు చేసిన ప్రకటనపై అధికారులు తనతో చర్చించారని, తనతో వారు చాలా మర్యాదపూర్వకంగా వ్యవహరించారని అన్నారు.

'అయోధ్య'పై త్రిసభ్య ధర్మాసనం

న్యూఢిల్లీ : అయోధ్య భూ వివాదం కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 11 నుండి విచారణ చేపట్టేందుకు జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలో ఒక త్రిసభ్య ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు సోమవారం నియమించింది. న్యాయమూర్తులు అశోక్ భూషణ్, అబ్దుల్ నజీర్‌లు కూడా సభ్యులుగా ఉన్న ఈ ధర్మాసనం రామ మందిరం, బాబ్రీ మసీదు స్థల యాజమాన్యంపై నెలకొన్న వివాదంపై విచారణ చేపట్టి తీర్పునిస్తుంది. కాగా, 2010లో అయోధ్యలోని రామ్ జన్మభూమి, బాబ్రీమసీదు ప్రాంతం వద్ద ఉన్న వివాదాస్పద 2.77 ఎకరాల స్థలాన్ని మూడు సమాన భాగాలుగా విభజిస్తూ అలహాబాద్ హైకోర్టులోని లక్నో బెంచ్ తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ముగ్గురు న్యాయమూర్తుల లక్నో బెంచ్ 2:1 మెజార్టీతో వివాదాస్పద

13 గంటల్లోనే ముంబై టు ఢిల్లీ

న్యూఢిల్లీ : త్వరలో ముంబై-ఢిల్లీ నగరాల మధ్య రైలు ప్రయాణానికి పట్టే సమయం మూడు గంటల మేర తగ్గనుంది. 13 గంటల్లోనే ప్రయాణం ముగిసేలా రైల్వే శాఖ చర్యలు తీసుకుంటోంది. అత్యధిక రద్దీ ఉన్న ఈ మార్గంలో ప్రయాణానికి ప్రస్తుతం 16 గంటల సమయం పడుతోంది. తాజా మార్పుల ప్రకారం, ప్రయాణం ఒక్క రాత్రిలోనే ముగిసిపోయేలా ప్రణాళికను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం, ఈ మార్గంలో రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణానికి దాదాపు 16 గంటల సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో రాజధాని ఎక్స్‌ప్రెస్ లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బి) బోగీలను ఉపయోగించి రైల్వే శాఖ ఒక ప్రయోగాన్ని చేపట్టి, ఫలితాలను అంచనా వేస్తోంది. ఈ కొత్త ప్రాజెక్టు కింద 14 బోగీల రైలును అందుబాటులోకి తీసుకువస్తారు. వేగం పరంగా ప్రస్తుతం అమల్లో ఉన్న వ్యవస్థలు స్థాయికి తగ్గట్టుగా పనిచేయడం లేదు. ఈ కొత్త రైలు గంటకు 180 కిలోమీటర్ల మేర వేగంతో ప్రయాణిస్తుంది.

ఎన్‌కౌంటర్‌లో బందిపోటు హతం

సాట్నా (మధ్యప్రదేశ్) : మధ్యప్రదేశ్‌లోని పుఖార్వర్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో పేరుమోసిన ఓ బందిపోటు హతమయ్యాడు. తలపై రూ.50 వేల రివార్డు ఉన్న లలిత్ పటేల్ (23) పుఖార్వర్ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు అందిన సమాచారంతో గాలిస్తుండగా లలిత్ పోలీసులపై కాల్పులు ప్రారంభించాడు. పోలీసులు ఎదురు కాల్పులు జరపడంతో లలిత్ అక్కడికక్కడే మృతి చెందినట్టు సాట్నా పోలీసు సూపరింటెండెంట్ హింగాంకర్ తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఒక రైఫిల్, కాట్రిడ్జ్, కొన్ని దుస్తులు, ఒక సంచిని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. గత నెలలో పోలీసు ఇన్‌ఫార్మర్లనే నెపంతో లలిత్ ముగ్గురు వ్యక్తులను సజీవ దహనం చేశాడని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. గత నెలలో ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని అపహరించిన కేసులో లలిత్ ప్రమేయం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్ : దాదాపు నలభై రోజుల పాటు కొనసాగిన దక్షిణ కశ్మీర్ హిమాలయ పర్వత శిఖరాల్లోని పవిత్ర అమర్‌నాథ్ యాత్ర సోమవారం నాటితో ముగిసింది. సాధారణంగా ఈ యాత్ర ప్రతి యేటా రక్షాబంధన్ పర్వదినాన ముగుస్తుంటుంది. యాత్రికుల బస్సుపై ఉగ్రవాదుల దాడి జరిగినప్పటికీ, ఈ ఏడాది మొత్తం 2.6 లక్షల మంది భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నారు. ఈ ఏడాది దర్శించుకున్న భక్తుల సంఖ్య గడచిన 14 ఏళ్లలో రెండో అత్యల్పమైనది కావడం గమనార్హం. వేసవి తాపం వల్ల గతేడాది 2.2 లక్షల మంది యాత్రికులు మాత్రమే దర్శించుకున్నారు. స్వామివారి పవిత్ర 'ఛారి ముబారక్ (వెండి కర్ర)'ని తెల్లవారుజామున సాధువులు, భక్తుల బృందం భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లిందని శ్రీ అమర్‌నాథ్‌జి ష్రైన్ బోర్డు (ఎస్ఎఎస్‌బి) అధికారులు తెలిపారు. గర్భగుడిలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను పూర్తి చేసిన తర్వాత సూర్యాస్తమయానికి ముందే ఛారి ముబారక్ తిరుగు ప్రయాణం మొదలవుతుంది. ఛారి ముబారక్ ఇక్కడ దాష్నమి అఖారా వద్ద ఉన్న అమరేశ్వర్ దేవాలయానికి తిరిగి చేరుకుంటుంది.



రాష్ట్రపతికి రాఖీ



ప్రధానికి రాఖీ

రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం నల్లొండ జిల్లాకు చెందిన అంధుల పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల తరపున ప్రధాని మోడీని కలిసి రాఖీ కట్టారు. పాఠశాల తరపున ప్రధానికి ఒక మెమెంటోతోపాటు, పాఠశాల వివరాలను తెలిపే బ్రోచర్ అందజేశారు. తెలంగాణకి వచ్చినప్పుడు పాఠశాలను తప్పనిసరిగా సందర్శిస్తానని ప్రధాని హామీ ఇచ్చారని, పాఠశాలకు సంబంధించిన వివరాలను ఆసక్తిగా అడిగితెలుసుకోవడం తమకు చాలా ఆనందం కలిగించిందని నిర్వాహకులు తెలిపారు. ప్రధానిని కలసిన బృందంలో రాజ్యలక్ష్మి, నాగమణి, కార్యవర్గ సభ్యుడు కర్నాటి విజయకుమార్, చంద్రశేఖర్ ఉన్నారు.

రాజ్యసభ ఎన్నికలు రసవత్తరం!

గుజరాత్ చేరుకున్న కాంగ్రెస్ ఎంఎల్ఎలు, నేడు పోలింగ్

అహ్మదాబాద్ : గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. మంగళవారంనాడు అధికార బిజెపి, విపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య హోరాహోరీ పోరు జరగనున్నట్లు తాజా పరిస్థితులు తెలియజేస్తున్నాయి. మొత్తం మూడు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున సీనియర్ నేత, సోనియా గాంధీ రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్, బిజెపి తరపున ఆ పార్టీ చీఫ్ అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలు బరిలో ఉన్నారు. వారిద్దరితో పాటు ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరిన బల్వంత్‌సిన్హ రాజ్‌పుత్ కూడా పోటీ చేస్తున్నారు. దీంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. శంకర్‌సిన్హ వాఘేలా తిరుగుబావుటా ఎగరవేయడంతో పాటు ఆరుగురు ఎంఎల్ఎలు ఇటీవల రాజీనామా చేయడం కాంగ్రెస్ పార్టీకి పెద్ద దెబ్బ. ఎంఎల్ఎల రాజీనామాతో 182 మంది సభ్యులున్న గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ బలం 57 నుండి 51కి తగ్గింది. మరోవైపు కర్నాటకలోని ఒక రిసార్టుకు తరలించబడిన గుజరాత్‌కి చెందిన 44 మంది కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎలు సోమవారం ఉదయం తిరిగి స్వరాష్ట్రానికి చేరుకున్నారు. ఆనంద్ పట్టణంలోని ఒక రిసార్టులో ఉన్న వారు అక్కడ నుండి ఓటేయడానికి నేరుగా గాంధీనగర్ చేరుకుంటారు. ఈ ఎన్నికల్లో 44 మంది ఎంఎల్ఎల్లో ఏ ఒక్కరూ క్రాస్‌ఓటింగ్ చేయడం లేదా నోటా ఆప్షన్‌ని ఎంచుకోవడం చేయకపోయినప్పటికీ, అహ్మద్ పటేల్ గెలుపుకు మరో ఓటు అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఎన్‌సిపి సభ్యులు, జెడి (యు), గుజరాత్ పరివర్తన్ పార్టీ (జిపిపి) నుండి ఒక్కో ఎంఎల్ఎ మద్దతుపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. అయితే, ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతివ్వాలన్న దానిపై ఇంతవరకు తాము నిర్ణయం తీసుకోలేదని ఎన్‌సిపి నేత ప్రఫుల్ పటేల్ బాంబు పేల్చడంతో కాంగ్రెస్ అయోమయంలో పడింది. మరోవైపు పార్టీని వీడిన ఏడుగురు ఎంఎల్ఎల్లో తిరిగి కొంతమంది తమవైపు వస్తారన్న ఆశాభావాన్ని



కూడా కాంగ్రెస్ వ్యక్తం చేస్తోంది. మరోవైపు అహ్మద్ పటేల్ గెలుపుపై ఇదివరకే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. తనకు 44 కంటే ఎక్కువ ఓట్లే వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారుల ప్రకారం, అభ్యర్థి గెలుపుకు మొత్తం ఓట్లలో నాలుగో వంతుతో పాటు మరో ఓటు అవసరం. ఒక అభ్యర్థి గెలవాలంటే 45 మంది సభ్యుల మద్దతు కావాలి. గుజరాత్ అసెంబ్లీలో 121 మంది ఎంఎల్ఎలున్న అధికార బిజెపి తేలికగా తన ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకుంటుంది. కానీ, మూడో అభ్యర్థి (రాజ్‌పుత్)కి 31 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉంది. దీంతో ఆయన గెలుపు కోసం బిజెపి నానా రకాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఇదిలా ఉంటే, గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మాత్రం మొత్తం మూడు సీట్లను తామే గెలుచుకుంటామంటూ ధీమాగా చెబుతున్నారు.

పేదలకు వంటగ్యాస్ సబ్సిడీ కొనసాగుతుంది : మంత్రి ప్రధాన్

అగర్తలా : పేదలకు వంటగ్యాసు సబ్సిడీ కొనసాగుతుందని కేంద్ర చమురు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పిజి, కిరోసిన్ సబ్సిడీలను ఎత్తివేసే ఆలోచన ఏదీ లేదని మంత్రి స్పష్టం చేశారు. పేదలకు, సామాన్యులకు ఈ సబ్సిడీ సౌకర్యం కొనసాగుతుందని సోమవారం ఆయన ఇక్కడ విలేకరులకు చెప్పారు. చిట్టగాంగ్ నుంచి త్రిపురకు సహజవాయువు తీసుకువెళ్లేందుకు పైప్‌లైన్ నిర్మాణ ప్రతిపాదన ఉందని, దీనికి బంగ్లాదేశ్ అనుమతి అవసరం అని, ఆ దేశంతో చర్చించామని మంత్రి వెల్లడించారు. ఈశాన్య ప్రాంతంలో వంటగ్యాసు కొరత నివారణకు ఈ సరఫరా అవసరం అని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి నుంచి బంగ్లాదేశ్‌లోని పర్వతీపూర్ వరకూ డీజిల్‌ను తీసుకువెళ్లేందుకు ఓ పైప్‌లైన్ వేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇప్పటికే అసోంలోని నుమలిఘర్ చమురు శుద్ధి క్షేత్రం నుంచి సిలిగురికి చమురు తీసుకువెళ్లే పైప్‌లైన్ ఉందని తెలిపారు. బంగ్లాదేశ్ నుంచి అనుమతి లభిస్తే చిట్టగాంగ్ -త్రిపుర మార్గం నిర్మాణ ప్రక్రియను చేపడుతారని , ఇది ఇండోబంగ్లా అంతర్జాతీయ సరిహద్దుల వద్ద ఉన్న రైల్వే మార్గానికి వెలుపల ఏర్పాటు అవుతుందని మంత్రి చెప్పారు. త్రిపురలో ప్రధాన మంత్రి ఉజ్వల యోజనను మంత్రి ప్రధాన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా పేదల మహిళలకు ఉచిత ఎల్‌పిజి సౌకర్యం కల్పించారు.

రజనీతో బిజెపి నాయకురాలు భేటీ



చెన్నై : తమిళ్ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను బిజెపి యువ మోర్చా జాతీయ అధ్యక్షురాలు పూనమ్ మహాజన్ కలిశారు. ఆమె రజనీ ఇంటికి వెళ్లి ఆయనతో కాసేపు మాట్లాడారు. అయితే ఈ సమావేశంలో ఎలాంటి రాజకీయ అంశాలు చర్చకురాలేదని బిజెపి నేతలు వెల్లడించారు. రజనీ రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయాల్లోకి వచ్చే విషయం గురించి ఆలోచిస్తున్నామని, ఓ నిర్ణయానికి వచ్చిన తర్వాత ప్రకటిస్తామని రజనీ చెబుతూ వస్తున్నారు.

వేధింపుల సాక్ష్యాలు మాయం!

హర్యానా బిజెపి చీఫ్ కొడుకు కేసులో కీలక మలుపు ● నిష్పాక్షిక విచారణకు డిమాండ్లు



చండీగఢ్: హర్యానాకు సీనియర్ ఐఎఎస్ అధికారి వీరేందర్ కుందు కూతురును రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సుభాష్ బరాల కుమారుడు వికాస్ వేధించిన ఘటనలో సిసిటివి ఫుటేజ్‌లు లభించలేదని చండీగఢ్ పోలీసులు సోమవారం వెల్లడించారు. యువతిని వేధించిన ఆ ప్రాంతం మొత్తంలో ఉన్న సిసిటివి ఫుటేజ్‌ల నుంచి ఎలాంటి సమాచారం లభించలేదని డిఎస్‌పి సతీశ్ కుమార్ మీడియాకు తెలిపారు. ఆ రూట్‌లో ఐదు కెమెరాలు ఉన్నాయని, కానీ అవి పనిచేయడంలేదని ట్రాఫిక్ పోలీసులు కూడా స్పష్టం చేశారు. కెమెరాల నిర్వహణ బాధ్యత అంతా కేంద్ర పాలిత పాలక వర్గానిదే. ఐఎఎస్ అధికారి కుమార్తెను వేధించాడనేందుకు సిసిటివి ఫుటేజీలే కేసులో కీలకం. కెమెరాలు లోరిజల్యూషన్‌తో ఉండడం వల్ల కవరేజి సరిగా లేదని అధికారులు చెప్పారు. ' ఇలాంటి హై-ప్రొఫైలింగ్ ప్రాంతంలో సిసిటివి కెమెరాలు పనిచేయకపోవడం అన్నది విచిత్రంగా ఉంది. ఇదంతా చూస్తుంటే కవరప్ చేశారనిపిస్తోంది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ జూనియర్ పోలీస్ అధికారి చెప్పారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించి జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సిడబ్ల్యు) స్పందించింది. నిష్పాక్షిక విచారణ జరపాలని కమిషన్ చైర్‌పర్సన్ లలిత కుమార మంగళం పోలీసులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. విచారణకు సంబంధించి ప్రతి దశలో ఎప్పుడు ఏం జరుగుతుందో తమకు సమాచారం అందజేయాలని సూచించారు. బిజెపి ఎంపి సుబ్రమణ్య స్వామి ఘటనపై సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హర్యానా హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేస్తానని వెల్లడించారు.


అవసరమేతే కోర్టుకు వెళతా : వీరేందర్ కుందు

కేసును తప్పుదోవ పట్టిస్తున్నట్టు తనకు అనిపిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని బాధితురాలి తండ్రి, ఐఎఎస్ అధికారిగా పనిచేస్తున్న వీరేందర్ కుందు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిందితులకు శిక్ష విధించకపోతే తప్పకుండా తాము ఎంచుకున్న పంథాను అనుసరిస్తామని ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా తమను పోలీసు అధికారులు ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉంటామని అన్నారు. వాళ్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విధులను నిర్వర్తించాలని వీరేందర్ డిమాండ్ చేశారు.

అసలేం జరిగింది..?

హర్యానాలో వీరేందర్ కుందు సీనియర్ ఐఎఎస్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె ఒంటరిగా కారులో వెళుతుండగా గత శుక్రవారంనాడు వికాస్ బరాల అతడి స్నేహితుడు ఆశిష్ వేధించే ప్రయత్నం చేశారు. ఆమెను నడిరోడ్డుపై వెంటాడారు. అప్పుడు వికాస్‌తో పాటు అతడి స్నేహితుడు మద్యం మత్తులో ఉన్నారు. కారు ఆపాలని యువతిని పదే పదే హెచ్చరించారు. దీంతో ఆమె పోలీస్ హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేసి విషయాన్ని తెలిపింది. పోలీసులు అక్కడికి చేరుకునేలోగా ఆమెను నిలువరించి మరీ ఆ ఇద్దరూ వేధించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలంలోనే వికాస్‌ను, ఆశిష్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం పోలీసులు ఇద్దరు నిందితుల్ని బెయిల్‌పై విడుదల చేశారు. రాజకీయ ప్రాబల్యమున్న కుటుంబానికి చెందిన నిందితులపై పోలీసులు కిడ్నాప్ అభియోగాలు నమోదుచేయకపోవడంతో హర్యానాలో బిజెపి సర్కారుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధాని పెదవి విప్పరేం



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ మహిళల రాఖీలు స్వీకరించారు కాని, 'హర్యానా కుమార్తె' గురించి ఒక్కమాట కూడా మాట్లాడలేదని సిపిఐ విమర్శించింది. హర్యానాలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ బలాల కుమారుడు వికాస్ చండీఘడ్‌లో ఓ యువతిని వేధించిన ఘటన నేపథ్యంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఈ వ్యాఖ్యలు చేశారు. సోదరీమణులచే రాఖీలు కట్టించుకున్న ప్రధాని 'హర్యానా ఆడబిడ్డ' వేధింపులకు గురైన ఘటనపై మౌనంగా ఉండిపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖత్తార్, కేంద్ర మంత్రులు ఈ ఘటనపై మాట్లాడకుండా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని సద్దుమణిగించేందుకు అధికార పార్టీ యత్నిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఒక్కముక్క కూడా మాట్లాడరు, ప్రధాని మహిళల రాఖీలు స్వీకరిస్తారు కాని, చండీఘడ్ మహిళ గురించి మాత్రం పెదవి విప్పరు అని విమర్శించారు. వారు ఈ విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. వికాస్‌తో పాటు మరో యువకుడు ఆశిష్ కుమార్‌లపై వేధించిన ఘటనలో కేసు నమోదైన విషయం విదితమే.

మేధాపాట్కర్ దీక్ష భగ్నం



భోపాల్ : సామాజిక ఉద్యమనాయకురాలు మేధా పాట్కర్ దీక్షను మధ్యప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. సర్దార్ సరోవర్ ప్రాజెక్టుతో నిర్వాసితులు అవుతున్న వారికి సరైన పునరావాసం,సాయం కోసం మేధా పాట్కర్ గత నెల 27 నుంచి ధార్ జిల్లాలోని ఛిక్‌హాల్దా గ్రామంలో నిరవధిక నిరాహార దీక్షలో ఉన్నారు. నర్మదా బచావో ఆందోళన్ సంస్థ వ్యవస్థాపకురాలు అయిన పాట్కర్‌ను, ఆమె వెంట ఉన్న 11 మందిని పోలీసులు ఆసుపత్రులకు తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ ఉన్నందున వారిని తరలించినట్లు ఇండోర్ డివిజన్ కమిషనర్ సంజయ్ దూబే తెలిపారు. అంబులెన్స్‌లలో వీరిని తరలించిన తరువాత ఏ ఆసుపత్రిలో చేర్చారనేది వెల్లడించలేదు. మేధా పాట్కర్‌ను, ఇతరులను దీక్షాస్థలి నుంచి పోలీసు బలగాలు బలవంతంగా తీసుకువెళ్లినట్లు, దీనిని ఉద్యమకారులు ప్రతిఘటించినట్లు , చాలా సేపటి వరకూ ఇక్కడ ఉద్రిక్తత నెలకొన్నట్లు వెల్లడైంది. అయితే వారిని అంబులెన్సలలో తరలించే క్రమంలో పోలీసులకు కొద్దిగా గాయాలు అయినట్లు సంజయ్ దూబే తెలిపారు. పొరుగున ఉన్న గుజరాత్‌లో సర్దార్ సరోవర్ డ్యాం గేట్లు మూసివేయడంతో మధ్యప్రదేశ్‌లో నర్మదా నది వెంబడి ఉన్న పలు గ్రామాల కుటుంబాలు ముంపు ప్రమాదానికి లోనయ్యాయి. ఆరోగ్యం క్షీణిస్తున్నందున మేధా వెంటనే దీక్ష విరమించుకోవాలని కేంద్ర జలవనరుల మంత్రి ఉమా భారతీ ఒక్కరోజు క్రితమే విజ్ఞప్తి చేశారు. అయితే నర్మద నది రక్షణలో మంత్రి మద్దతు కావాలని లేకపోతే దీక్ష విరమించేది లేదని పాట్కర్ స్పష్టం చేశారు.

మాయావతికి గడ్డుకాలం?

ఉద్వాసనకు దళిత, ఒబిసి, ముస్లిం సంస్థల యోచన



న్యూఢిల్లీ : బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతికి సమీప భవిష్యత్తులో గడ్డురోజులు ఎదురుకానున్నట్లు తెలుస్తోంది. పార్టీ నుండి ఆమెను తప్పించడానికి మాజీ నాయకులు తెరవెనుక వ్యూహాలు పన్నుతున్నారు. బిఎస్‌పి మాజీ నాయకుల నేతృత్వంలో 16 దళిత, ముస్లిం, ఒబిసిల సంస్థలు ఇక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఆదివారం రోజంతా కీలకమైన సమావేశాన్ని నిర్వహించడం ఇందుకు నిదర్శనంగా భావించాల్సి ఉంటుంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా పత్రిక ప్రకారం, మాయావతికి ఒకప్పటి అత్యంత సన్నిహితుడు నసీముద్దీన్ సిద్దిఖి ఈ సంస్థలను ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించారు. సమావేశానంతరం సిద్దిఖి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన పదహారు రాజకీయ, రాజకీయేతర సంస్థలు ఇక్కడ కలిశాయని ఆయన చెప్పారు. కమిటీ త్వరలోనే మరోసారి సమావేశమవుతుందని, సర్వ సమాజ్ పేరుతో ఒక ఉమ్మడి కూటమిని ఏర్పాటు చేసి, ఎన్నికల్లో పోటీ చేస్తామని ఆయన చెప్పారు. మరోవైపు మాయావతికి వ్యతిరేకంగా ఎందుకు కూటమిని ఏర్పాటు చేస్తున్నారన్న ప్రశ్నకు బిఎస్‌పి మాజీ ఎంపి, జాతీయ బహుజన్ కూటమి కన్వీనరు ప్రమోద్ కురీల్ బదులిస్తూ...మాయావతి ప్రాబవం ప్రస్తుతం మసకబారింది. ఇటీవల కాలంలో చాలా మంది నేతలు ఆమెను వీడారు. అయితే వారంతా వ్యవస్థీకృతం కాలేదు. కాన్షీరామ్ అనుచరులుగా వారు చెప్పుకుంటున్నారు. కానీ, విడివిడిగానే పనిచేస్తున్నారు. అందువల్ల వారందరినీ ఒక్కతాటిపైకి తీసుకురావాల్సిన అవసరముంది. ఒక గుర్తింపును దక్కించుకోవడంతో పాటు బిఎస్‌పికి ఒక ప్రత్యామ్నాయంగా అవతరించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు.

పార్టీ విడిచి స్వేచ్ఛగా వెళ్లిపోవచ్చు : అఖిలేశ్

లక్నో : పార్టీని విడిచి వెళ్లాలనుకునే వారు స్వేచ్ఛగా వెళ్లిపోవచ్చని, ఎలాంటి క్షమాపణలు కోరాల్సిన అవసరం లేదని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధినేత అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. ఎస్‌పికి చెందిన ముగ్గురు ఎంఎల్‌సిలు పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తద్వారా క్లిష్ట సమయంలో తనతో ఉండే వారెవరో నిర్ధారించుకునే చర్యకు ఉపక్రమించారు. రక్షాబంధన్ సందర్భంగా సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నుం చి వెళ్లిపోతూ ఎంఎల్‌సిలు బుక్కాల్ నవాబ్, సరోజినీ అగర్వాల్, యశ్వంత్ సింగ్‌లు క్షమాపణలు కోరిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ పార్టీ క్లిష్ట సమయంలో ఉన్నందున కొందరు ఈ పరిస్థితిలో ఉండలేకపోతున్నామని చెబుతున్నారని, పార్టీని విడిచి వెళ్లడానికి ఇలాంటి కారణం చెప్పడం క్షమార్హం కాదని అన్నారు. దీనికంటే మంచి కారణాన్ని వారు వెతుక్కోవచ్చని సూచించారు. తమ పార్టీ క్రియాశీలకంగా పనిచేస్తోందని, మహిళలు, రైతులు, యువ కులు భారీ సంఖ్యలో ఇటీవల పార్టీలో చేరారని ఆయన చెప్పారు. పార్టీని విడిచి వెళ్లాలనుకునే వారుఎలాంటి క్షమాపణలు కోరవద్దని పేర్కొనారు.



కేరళ శాసనసభను కుదిపేసిన 'రాజకీయ హింస'

తిరువనంతపురం : అధికార సిపిఐ(ఎం) సభ్యులు, బిజెపిల మధ్య 'రాజకీయ హింస' అంశం సోమవారం కేరళ శాసనసభను కుదిపేసింది. ఈ అంశంపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యుడిఎఫ్ చర్చకు పట్టుబట్టడంతో గందరగోళం మధ్య సమావేశాలు వాయిదా పడ్డాయి. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ హింసకు ప్రభుత్వమే కారణమని ప్రతిపక్ష నాయకుడు రమేష్ చెన్నితల ఈ సందర్భంగా నిందించారు. టీనేజర్ల మరణానికి కారణమవుతున్న 'బ్లూ వేల్ గేమ్'తో సిపిఐ(ఎం), బిజెపి కార్యకర్తల హింసను పోల్చారు. హింసకు కారణమైన వారిపై పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెబుతున్న తరుణంలో హింస ప్రజ్వరిల్లకుండా నిరోధించడంలో పోలీసులు విఫలమయ్యారని కాంగ్రెస్ విమర్శించడం గమనార్హం. ముఖ్యమంత్రి పార్టీ కార్యదర్శి స్థాయిలో దిగజారి వ్యవహరిస్తున్నారని చెన్నితల విమర్శించారు. ముఖ్యమంత్రి విజయ్ తన హోదాకు తగినట్టుగా వ్యవహరించాలని అప్పుడే రాష్ట్రంలో రాజకీయ హింసకు తెరపడుతుందని అన్నారు. సభలో తాము రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలన్న డిమాండ్‌పై మాట్లాడలేదని సభ వెలుపల బిజెపి ఎంఎల్ఎ ఓ.రాజగోపాల్ విలేకరులకు చెప్పారు.

ఐఎస్, తాలిబన్ దాడిలో 50 మంది హతం

కాబూల్: అఫ్ఘనిస్థాన్‌లోని సాయాద్ జిల్లాలోని ఒక గ్రామంలో తాలిబన్, ఐఎస్ ఉమ్మడిగా డజన్ల కొద్దీ పౌరులను సోమవారం నాడు ఊచకోత కోశాయి. ఇలా ఉగ్రవాద సంస్థలు ఉమ్మడిగా దాడి చేయడంతో అఫ్గన్ ప్రభుత్వంపై ఒత్తిడి అధికమైంది. దాదాపు 50 మంది పురుషులు, స్త్రీలు, పిల్లలను సారేపుల్ రాష్ట్రంలో ఉగ్రవాదులు సంహరించారు. శనివారం నాడు ఈ దుర్ఘటనలో 48 గంటల పాటు అఫ్ఘన్ స్థానిక పోలీసులతో ఉగ్రవాదులు ఘర్షణ పడ్డారు. దాయేష్ (ఐఎస్) తాలిబన్ ఉగ్రవాదులు ఉమ్మడిగా మీర్జావలాంగ్ గ్రామంపై దాడి జరిపినట్లు అధికారులు చెప్పారు. స్థానిక కమాండర్ సారథ్యంలో ఈ దాడి జరిగింది. అతడు తనకు ఐఎస్‌తో సంబంధాలున్నట్లు చాటుకున్నాడు.

మనీలాలో ఉభయ కొరియాల భేటీ

సియోల్: ఉభయ కొరియాల ఉన్నత స్థాయి దౌత్యాధికారులు మనీలాలో ప్రాంతీయ ఫోరం సమావేశం సందర్భంగా కలుసుకొన్నారు. దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి కాంగ్ క్యుంగ్ వా ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి రీయాంగ్ హో తో స్వల్ప భేటీ జరిపారు. ఆసియాన్ ప్రాంతీయ ఫోరం విందు సందర్భంగా ఆదివారం నాడు ఇది చోటు చేసుకుంది. సైనిక చర్చల కోసం దక్షిణ కొరియా సూచనకు ఉత్తర కొరియా సమ్మతించాలని కాంగ్ రీని కోరారు. కొరియాల మధ్య ఉద్రిక్తతల తగ్గింపునకు, ఉభయ కొరియాల ఐక్యం కావడానికి ఈ చర్చలు కీలకమని సూచించారు.

'దహీ హండీ' ఉత్సవంలో 14 ఏళ్ల లోపు వారికి ప్రవేశం లేదు

లక్నో : 'దహీ హండీ' ఉత్సవంలో 14 సంవత్సరాల లోపు వారికి ప్రవేశాన్ని నిషేధిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను బొంబాయి హైకోర్టు స్వాగతించింది. అయితే, ఉత్సవంలో నిర్వహించే మానవ పిరమిడ్‌లో ఎత్తుపై పరిమితులు విధించడాన్ని న్యాయమూర్తులు బిఆర్ గవాయ్, ఎంఎస్ కర్ణిక్‌లతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. 14 సంవత్సరాల లోపు వయస్సు గల బాలలు ఈ ఉత్సవంలో పాల్గొనడాన్ని నిషేధిస్తూ రాష్ట్రప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్టు న్యాయమూర్తి గవాయ్ పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టులో దహీ హండీని సాహస క్రీడగా ప్రకటించినందున బాల కార్మికులు (నిషేధ, నియంత్రణ) చట్టం ప్రకారం 14 ఏళ్ల లోపు బాలలను ఈ ఉత్సవంలో పాల్గొనడాన్ని రాష్ట ప్రభుత్వం నిషేధించిందని అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. మైనర్లు ఈ ఉత్సవంలో పాల్గొనడం, భద్రతా చర్యలు లేకపోవడం వల్ల అవాంఛనీయ ఘటనలు జరుతాయన్న అంశంపై సగర వాసులు వేసిన పిటిషన్లను హైకోర్టు సోమవారం విచారించింది. 18 సంవత్సరాల లోపు వారు ఈ ఉత్సవంలో పాల్గొనరాదని, మానవ పిరమిడ్‌ల ఎత్తు 20 అడుగులకు మించరాదని 2014లో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

భారీ కణితిని తొలగించిన రోబోటిక్ సర్జన్లు





మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలోనే తొలిసారిగా ఒక మహిళ క్లోమం నుంచి అతి భారీ కణితిని కిమ్స్ రోబోటిక్ సర్జన్లు తొలగించారు. 6X7 సెంటిమీటర్ల సైజులో ఉన్న సాలిడ్ సూడోపోలరి ఎపిథెలియల్ నియోప్లాజం (ఎస్‌పిఈఎన్) రకానికి చెందిన భారీ కణితిని తొలగించినట్లు కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) హాస్పిటల్ ఒక ప్రకటనలో తెలిపింది. వరంగల్ జిల్లాకు చెందిన ఇటీవల వివాహమైన మాధవి (27) తీవ్ర అస్వస్థతకు గురి కాగా పరీక్షలు నిర్వహించి ఆమెలో భారీ కణతి ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఎస్ఐ డావిన్సీ సిస్టమ్‌తో పాటు 6 సెంటిమీటర్ల మేర గాటు చేసి కణితి నమూనాను సేకరించారు. ఈ విధానంలో స్వల్పంగా గాయం కాగా తొందరలోనే మానుతుందని శస్త్రచికిత్స బృందానికి నేతృత్వం వహించిన సర్జికల్ అంకాలజిస్ట్, రొబొటిక్ సర్జన్ డాక్టర్ మధు దేవరశెట్టి తెలిపారు.

ఉస్మానియాలో అరుదైన శస్త్రచికిత్స

మన తెలంగాణ/సిటీబ్యూరో: ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో ఓ యువకుడికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సనిర్వహించారు. వరంగల్ జిల్లా సంగ్యం గ్రామానికి చెందిన రమేష్(24) తండ్రి సాంబయ్య ఎల్రక్టిసిటీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు విద్యుత్ స్తంబాన్ని ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడ్డారు. కింద పెద్ద ఇనుపరాడు ఉండటంతో రమేష్ వెన్ను బాగంలో దిగింది. అక్కడ నుంచి రమేష్‌ను వరంగల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వారు ఉస్మానియాకు రిఫర్ చేశారు. రాత్రి 9గంటలకు ఉస్మానియాకు చేరుకున్న రమేష్‌కు అత్యవసర విభాగంలో చికిత్స అందించి అన్ని విభాగాల వైద్యులు కలిసి సోమవారం ఉదయం 11గంటలకు శస్త్రచికిత్స నిర్వహించి ఇనుపరాడును తొలగించారు. సుమారు 5గంటలపాటు జరిగిన ఈ సర్జరీలో డాక్టర్ ఆర్ పాండునాయక్, డాక్టర్ మస్తాన్‌రెడి,డాక్టర్డ్ లక్ష్మన్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి,డాక్టర్ జ్యోతి,డాక్టర్ నర్సింహారావు,డాక్టర్ వినయ్‌సాగర్, డాక్టర్ బీప్ రాజ్‌సింగ్‌లతో పాటు వైద్య సిబ్బంది పాల్గొని విజయవతంగా నిర్వహించారు. ప్రస్తుతం రమేష్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు డాక్టర్ పాండునాయక్ తెలిపారు.

7.35% మందికి ఆస్టియో అర్థరైటిస్

మన తెలంగాణ/ హైదరాబాద్ : మోకాలి నొప్పి ఏర్పడేందుకు ప్రధానమైన కారణాలతో అస్టియో అర్థరైటిస్ ఒకటి. భారతదేశపు జనాభాలో మోకాలి నొప్పికి ప్రధాన కారణమైనటువంటి అస్టియో అర్ధరైటిస్‌తో 7.35 శాతం వరకు బాధపడుతున్నారు. అస్టియో అర్ధరైటిస్‌ను వాడుక భాషల్లో కీళ్లు అరిగిపోవడం అంటారు. ఇందులో కీళ్లు– మృదులాస్థి మధ్య సహజమైన కుషనింగ్ అనేది దెబ్బతింటుంది. మోకాలి నొప్పి అనేది ప్రతి ఒక్కరు తమ జీవితంలో బాధపడే ఒక సాధారణ సమస్య. తీవ్ర గాయాల నుండి తీవ్రమైన వైద్య సమస్యలు (కాంప్లికేషన్స్ ఆఫ్ మెడికల్ కండిషన్స్) వంటి అనేక కారణాల వలన ఈ నొప్పి ఏర్పడవచ్చు. పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ (పిజిడబ్ల్యుఎ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ అర్థోపెడిక్ సర్జన్ (అపోలో హాస్పిటల్స్) డా॥ కె.జె రెడ్డి ప్రసంగిస్తూ, మోకాలి నొప్పి అనేది ఆకస్మిక గాయం వలన కానీ, మోకాలిని అతిగా ఉపయోగించడం వలన ఏర్పడిన గాయం లేదా కీళ్లనొప్పులు వంటి అంతర్లీనంగా ఏర్పడే స్థితి వలన కూడా రావచ్చు. మోకాలి నొప్పి మోకాలి యొక్క ఒక నిర్ధిష్ట ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండడమై లేదా మోకాలు అంతటా వ్యాపించి ఉండడమో జరుగుతుంది. మోకాలికినొప్పికి జతగా శారీరక పరిమితి (ఫిజికల్ రెస్ట్రిక్షన్) కూడా ఉంటుం ది. రోగిని శారీరక పరీక్ష చేయడం ద్వారా మోకాలి నొప్పిని నిర్ధారణ చేయవచ్చు. అంతర్లీన కారణానికి సంబంధించిన మోకాలి చికిత్స ఆధారపడి ఉంటుంది. శస్త్ర చికిత్స లేదా ఇతర చికిత్సలు అవసరమైనప్పటికీ కూడా మోకాలి నొప్పి రోగ నిర్ధారణ చేయడం మంచిదేనని పేర్కొన్నారు.

భారత్ వైదొలగితేనే పరిష్కారం: పిఎల్ఎ

మన జర్నలిస్టుల బృందం ద్వారా సందేశం



బీజింగ్: చైనా భూభాగం నుంచి భారత సైన్యం వైదొలగకపోతే సంఘర్షణ తప్పదని చైనా దేశపు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ ప్రజా విమోచన సైన్యం) సీనియర్ కల్నల్ లీలీ హెచ్చరించారు. చైనా ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యటిస్తున్న భారతీయ జర్నలిస్టుల బృందం ద్వారా సోమవారం నాడు చైనా సైన్యం తన సందేశాన్ని భారత్‌కు తెలిపింది. ఇరు దేశాల సేనలు సిక్కిం సెక్టార్‌లోని డోక్లాం సరిహద్దు ప్రాంతంలో మోహరించడంతో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగింపునకు భారత సైన్యం వెనక్కి మళ్లడమే ఏకైక మార్గమని చైనా సైన్యం ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. భారత సైన్యం తమ భూభాగంలోకి చొరబడిందని కల్నల్ లీ ప్రకటించారు. తాను ఒక సైనికుడిగా తన మాతృదేశం భూభాగాల రక్షణకు కట్టుబడి ఉన్నట్లు ఆయన చెప్పారు. జర్నలిస్టుల పర్యటనలో అరుదైన చైనా పోరాట పటిమను పిఎల్ఎ ప్రదర్శించి చూపింది. ఆ ప్రదర్శనలో చిన్న ఆయుధాలతో కాల్పులు జరపడం, శత్రు సైన్యాన్ని బందీలుగా పట్టుకునే తీరు, టెర్రరిజం తిప్పికొట్టడం, లేజర్ కిరణాలతో పోరాటం, పదాతి బలగాల శిక్షణ వగైరాలు భారతీయ జర్నలిస్టులకు చైనా సైన్యం చూపింది. అయితే ఈ ప్రదర్శనకు డోక్లాం ప్రతిష్టంభనతో ఎటువంటి సంబంధం లేదని కూడా సీనియర్ కల్నల్ లీ పేర్కొన్నారు. భారత సైన్యం తదుపరి కార్యాచరణపై పిఎల్ఎ భవిష్య కార్యాచరణ ఆధారపడి ఉందని కూడా ఆయన చెప్పారు. అధికారంలోగల చైనా కమ్యూనిస్టు పార్టీ ఉత్తర్వులను ఆచరిస్తామని ఆయన చెప్పారు. సిపిసికి చైనా అధ్యక్షుడి జీ జిన్‌పింగ్ అత్యున్నత కమాండర్. పిఎల్ఎ అత్యున్నత శిక్షణ స్థావరం హువాయిరోలో ఉంది. దానిని మన జర్నలిస్టులు సందర్శించారు. అక్కడ 11,000 మంది సైనికులు శిక్షణ పొందుతున్నారు. భారత దేశం సరిహద్దులు అతిక్రమించడం వెనుక భౌగోళిక తప్పుడు వ్యూహాలు కారణమని చైనా అధికారిక వార్తా పత్రిక 'చైనా డైయిలీ' ఒక వ్యాసంలో విమర్శించింది. అది అనూహ్యం, అనామోదనీయం అని ఆ వ్యాసం పేర్కొంది.

ఐరాస ఆంక్షలను ఖండించిన ఉత్తరకొరియా

● అణు చర్చల్లో పాల్గొనబోమని స్పష్టీకరణ ● అమెరికా మూల్యం చెల్లించుకోక తప్పదని వార్నింగ్



సియోల్ : అణు పరీక్షల నేపథ్యంలో ఐరాస భద్రతా మండలి (యుఎన్ఎస్‌సి) తనపై ఆంక్షలను మరింత కఠినతరం చేయడాన్ని ఉత్తరకొరియా సోమవారం ఖండించింది. అమెరికా నుంచి బెదిరింపులు ఉన్నప్పటికీ, అణు చర్చల్లో పాల్గొనేది లేదని తెగేసి చెప్పింది. గతవారాంతంలో భద్రతా మండలి తమపై విధించిన ఆంక్షలు తమ సార్వభౌమాధికారాన్ని దారుణంగా ఉల్లంఘించడమేనని ఉత్తరకొరియా స్పష్టం చేసినట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కెసిఎన్ఎ) తెలిపింది. 'మా స్వీయరక్షణ అణు నిరాయుధీకరణ కార్యక్రమాలకు అమెరికా నుండి హెచ్చరికలు ఉన్నా సరే వాటిపై చర్చలకు మేము సిద్ధంగా లేము. మా అణ్వస్త్ర సంపత్తిని మరింత పెంచుకునే విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తేలేదు' అని ఉత్తరకొరియా తేల్చి చెప్పింది. అంతేకాకుండా తమపై కఠిన ఆంక్షల విధింపుకు కారణమయిన అమెరికా ఈ నేరానికి వేలాది రెట్లు మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించింది. 'అమెరికా సురక్షితంగా ఉంటుందని భావిస్తే అది పొరపాటే. ఆ దేశ ప్రధాన భూభాగం మాకు ఒక మహాసముద్రం దూరంలో మాత్రమే ఉంది. మాపై ఆంక్షలకు అమెరికా రూపొందించిన తీర్మానానికి మద్దతు పలికిన ఇతర దేశాలు కూడా బాధ్యులే' అని ఉత్తరకొరియా తీవ్ర హెచ్చరిక చేసింది. ఉత్తరకొరియా గతనెలలో రెండు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలను చేపట్టిన నేపథ్యంలో ఆ దేశంపై ఆంక్షలను మరింత కఠినతరం చేయాలంటూ అమెరికా ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానాన్ని ఐరాస భద్రతా మండలి ఏకగ్రీవంగా ఆమోదించిన సంగతి తెలిసిందే. తాజా ఆంక్షల ప్రకారం, ఉత్తరకొరియా బొగ్గు, ఇనుము, ముడి ఇనుము ఎగుమతులపై సంపూర్ణ నిషేధం విధించబడింది. ఈ ఆంక్షలకు ఉత్తరకొరియా మిత్రదేశాలు చైనా, రష్యాలు సైతం అంగీకరించడం గమనార్హం.

'ఉత్తర కొరియాతో ప్రపంచానికి ప్రమాదం'

ట్రంప్, మూన్ జె ఇన్ ఫోన్ టాక్

వాషింగ్టన్: ఉత్తర కొరియా ప్రపంచంలో చాలా దేశాలకు ప్రమాదకరమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జె ఇన్ సోమవారం జరిపిన టెలిఫోన్ సంభాషణలో అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఉత్తర కొరియాపై విధించిన తాజా ఆంక్షల పట్ల ఆ నేతలు ఇరువురూ హర్షం ప్రకటించారు. ఐరాస భద్రతా మండలి అమెరికా ఆంక్షల తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన మరునాడు ఈ భేటీ చోటు చేసుకుంది. ఉత్తర కొరియా అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులను సమకూర్చుకొనే కార్యక్రమం విషయంలో అవలంబిస్తున్న మొండి వైఖరినికగాను ఆ ఆంక్షలు విధించారు.



కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడితే కెసిఆర్‌కు మద్దతు

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మన తెలంగాణ/న్యూఢిల్లీ: జీఎస్టీలో లోపాల విషయంలో కేంద్రానికి వ్యతిరేకంగా కెసిఆర్ పోరాడితే తమ పార్టీ మద్దతు ఇస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రకటించారు. సోమవారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ... కేరళలో బిజెపి చేస్తున్న రాజకీయాలపై, తెలంగాణలో కెసిఆర్ ఇటీవల నిర్వహించిన మీడి యా సమావేశం గురించి స్పందించారు. తెలంగాణలో ప్రభుత్వ విధానాలను మేము విమర్శిస్తే, కెసిఆర్ తిట్లదండకం అందుకోవడం సరికాదన్నారు. మాట్లాడితే తానే నిజమైన కమ్యూనిస్టు అని గర్వంగా చెప్పుకుంటు న్న కెసిఆర్, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లిందని ఎలా అంటారు అని నారాయణ ప్రశ్నించారు. దేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీ ఎప్పటికీ సజీవంగానే ఉంటుందని, కెసిఆర్ తర్వాత , టిఆర్ఎస్ మాయమై పోతుందని అన్నారు. సిరిసిల్ల నియోజక వర్గంలో రోజుకు 1700 లారీల ఇసుకను, ఒక్కో లారీని రూ.65వేలకు అమ్ముతున్నారని, దీన్ని ప్రశ్నించిన స్థానికులను కొట్టి చంపుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్ల పే రు చెపితే శవాలై వస్తారని ఎస్పీ విశ్వజిత్ బెదిరిస్తున్నారు. ఇది సరి కాదు..ఆయన అహంభావ వైఖరి తగ్గించుకోవాలని నారాయణ సూచించారు. జిఎస్టీ పేరుతో కేంద్రం దోపిడీ చేస్తుందని టిఆర్ఎస్ బాధపడడలో అర్థం లేదన్నారు. ఎన్‌డిఎకు మద్దతివ్వకుం డా బయటకు వస్తే మేము సహకరిస్తామని కెసిఆర్‌కి నారాయణ సూచించారు. రాజకీ య పరమైన దాడులు కేరళలోనే జరుగుతున్నాయా? మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దాడులు జరగడం లేదా? అని బీజేపి జాతీ య నాయకత్వాన్ని ప్రశ్నించారు. గో రక్షణ పేరుతో హత్యలు చేస్తున్నారని విమర్శించా రు. బిజెపి తన రాజ్యసభ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అధికార దుర్వినియోగం చేస్తూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని ఆరోపించారు.

ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు

పొన్నం దీక్షా శిబిరంలో పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి



మన తెలంగాణ/కరీంనగర్ ప్రతినిధి : ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం లోక్‌సభ మాజీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ ఆమరణ దీక్షకు ఆటకం కలిగించే విధంగా ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం మాట ఇచ్చి తప్పిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు దాని కోసం పోరాడుతున్న ప్రభాకర్‌కు అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాల సాధన కోసం మూడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పొన్నం ప్రభాకర్‌ను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటయ్యేంతవరకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటం ఆగదన్నారు. తెలంగాణ ఉద్యమం నుండి రాష్ట్ర ఏర్పాటు వరకు వెన్నంటి నిలిచిన కరీంనగర్ జిల్లాను 7 ముక్కలుగా విడగొట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న జిల్లాను ముక్కలు చేసిన టిఆర్ఎస్‌కు రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మెడికల్ కళాశాల సాధన కోసం దీక్ష చేపడుతామంటే అనుమతి ఇవ్వని ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పోలీసులచే బెదిరింపులకు గురి చేయిస్తూ దిగజారుడు తనానికి పాల్పడుతుందని విమర్శించారు. స్థానిక శాతవాహన విశ్వవిద్యాలయానికి మూడేళ్ళుగా ఉపకులపతి లేరని, అందులో కనీస వసతులు కూడా లేవని, ఇక్కడ వైద్య కళాశాల ఏర్పాటుకు మూడేళ్ళ క్రితం హామీ ఇచ్చి తన స్వంత నియోజకవర్గం సిద్దిపేటలో వైద్య కళాశాల ఏర్పాటు చేసుకోవడం బంగారు తెలంగాణకు నిదర్శనమా అని ప్రశ్నించారు. జీఎస్టీ తో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని కోర్టుకు వెళతానంటున్న ముఖ్యమంత్రి రాష్ట్రంలోని దళితులు, గిరిజనులు, మైనార్టీలు, బలహీన వర్గాలు, చిన్న, సన్నకారు రైతులు ప్రాజెక్టుల పేరుతో తమ భూములు బలవంతంగా తీసుకోవద్దని కోర్టులకు వెళితే ఇదే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. గత మూడేళ్ళ కాలంలో సీఎం కెసీఆర్ కరీంనగర్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని టిపిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెప్పర్ స్ప్రే దాడి జరిగిన నిలబడి లోక్‌సభలో తెలంగాణ బిల్లు పాస్ కావడానికి దోహద పడిన అతి కొద్ది మంది వ్యక్తుల్లో పొన్నం ప్రభాకర్ ఒకరని చెప్పారు. కాంగ్రెస్ పాలనలలో ఆనాటి ముఖ్యమంత్రి కె. రోశయ్య నేదునూరు గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రానికి శంకుస్థాపన చేస్తే నేటికి పనులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. కరీంనగర్‌ను లండన్ మాదిరిగా తీర్చిదిద్దుతాన్న ముఖ్యమంత్రి హామీ ఎక్కడ పోయిందన్నారు. టిఆర్ఎస్ పరిపాలనలలో కరీంనగర్ జిల్లాకు పూర్తి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర కోసం 542 ఎంపీలను ఒప్పించి బిల్లు పాస్ చేసిన మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ నేరేళ్ళ ఘటనలో బాధితులైన దళితులను పరమార్శించడానికి వస్తే ఆమె పట్ల సీఎం కేసీఆర్ అర్థరహింతంగా మాట్లాడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమాన్నారు.

మోడీ దగ్గర కెసిఆర్ చెక్క భజన



మన తెలంగాణ/న్యూఢిల్లీ : తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే సిఎం కెసిఆర్ మోడీ దగ్గర చెక్క భజన చేస్తున్నారా ? అని తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి డా. దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన, కెసిఆర్ పైన, తెలంగాణ ఎంపీల పైన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పూటకో మాటతో కెసిఆర్ ప్రభుత్వం తుగ్లక్ పాలనని తలపిస్తుందన్నారు. దేశ అధ్యక్ష మరియు ఉపాధ్యక్ష ఎన్నికలలో బిజెపికి మద్దతు ఇచ్చి, ఇప్పుడు కొత్త డ్రామా చేస్తూ ప్రజల చెవిలో పూలు పెడుతున్నారని ఆరోపించారు. నిజంగా జీఎస్టీ వల్ల తెలంగాణకి అన్యాయం జరిగినట్లయితే జీఎస్టీ మండలి సమావేశంలో తెలంగాణ తరపున పాల్గొన్న కెటిఆర్ ఆ సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తూ, ఎందుకు బహిష్కరించి రాలేదని ప్రశ్నించారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయించలేని కెటిఆర్, చేనేత సంబురాలు నిర్వహించడం ఒక మోసం అన్నారు. జీఎస్టీ వల్ల తెలంగాణ కు వస్తున్న నష్టాలపై శ్వేత పత్రం ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. వెంటనే అఖిల సమావేశం నిర్వహించి, అన్ని విష యాలు చర్చించాలన్నారు.తెలంగాణానికి అన్యాయం జరుగుతుంటే టీఆర్ ఎస్‌కి చెందిన ఎంపిలు ఢిల్లీలో ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. జీఎస్టీ తో రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం వస్తుందని కాంగ్రెస్ పార్టీ, అధికారులు ఎంత మొత్తుకున్నా వినకుండా, దేశంలో ఏ రాష్ట్రం కూడా అసెంబ్లీ తీర్మానం చేయక ముందే ఎలాంటి చర్చ లేకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కి అసెంబ్లీ తీర్మానం చేసి జీఎస్టీ వల్ల చాలా లాభం, చాలా మంచిదని కేసీఆర్ ప్రకటించారని ఎద్దేవా వేశారు. తాను చెప్పడం వల్లనే మోడీ రాష్ట్రపతి అభ్యర్థినగా దళిత నేతను ప్రకటిం చారని గొప్పలు చెప్తున్న కేసీఆర్, జీఎస్టీ లాంటి చిన్న పనికి న్యాయ పోరాటం ఎందుకు చేయాలని ప్రశ్నించారు. మోడీ వద్ద తన పలుకుబడి పెంచుకోవడం ద్వారా తన సీబీఐ, ఈడీ కేసులను బయటకు రాకుండా చూసుకునేందుకు కేసీఆర్ జీఎస్టీకి భేశరతుగా మద్దతు ఇచ్చారని ఆరోపించారు. గతంలో ముస్లిం రేసేర్వేషన్లను అమలు చేయకపోతే ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేస్తా అన్న కేసీఆర్, ఎందుకు తోక ముడిచారని డా.శ్రావణ్ ప్రశ్నించారు.కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఒక చట్టపరమైన హామీ ఇంతవరకు అమలు కాలేదు, విభజన చట్టంలో రావాల్సిన హక్కులు అమలు కాలేదు, మరి వాటి విషయంలో కేసీఆర్ ఎందుకు పోరాటం చేయడం లేదో ఆయన సమాధానం చెప్పాలని అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి ఈటెల, ఒక రబ్బర్ స్టాంప్ లా తయారయ్యాడని ఎద్దేవా వేశారు.



బిజెపిలోకి టిఎంసి ఎమ్మెల్యేలు

అగర్తలా : త్రిపురలో టిఎంసి నుంచి బర్తరఫ్ అయిన ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం బిజెపిలో చేరారు. గత నెలలో టిఎంసి నుంచి వీరిని బహిష్కరించారు.అగర్తలాలో జరిగిన బహిరంగ సభ సందర్భంగా ఎమ్మెల్యే సుదీప్ రాయ్ బర్మన్, ఆశిష్ కుమార్ సాహాతో పాటు మొత్తం ఆరుగురు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమక్షం లో బిజెపిలో చేరారు. ఈ విషయాన్ని బిజెపి ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ తెలిపారు.

కేంద్రం స్పందించకపోతే ఉద్యమం తీవ్రం

డార్జిలింగ్ : గూర్ఖాలాండ్ వేర్పాటుపై కేంద్రం వెంటనే స్పందించాలని గూర్ఖా జన ముక్తి మోర్చా (జిజెఎం) డిమాండ్ చేసింది. జిజెఎం అధినేత బిలమ్ గురుంగ్ సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. డార్జిలింగ్ పర్వత ప్రాంతంలో గత 54 రోజులుగా ఉద్యమం సాగుతోంది. కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం అవుతుందని గురుంగ్ హెచ్చరించారు. గత నెల 30ననే తాము సంక్షోభ నివారణపై కేంద్రం జోక్యానికి కేంద్రానికి పదిరోజుల గడువుపెట్టామని, ఇది ముగుస్తోందని, ఇప్పటికీ కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకున్నా ఇక ఉద్యమాన్ని తీవ్రం చేయడం తప్ప మరో మార్గం లేదని ఈ నేత స్పష్టం చేశారు. జిజెఎం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షం అని, బిజెపి వెంటనే జోక్యం చేసుకుని తీరుతుందని నమ్ముతున్నట్లు తెలిపారు.

బిజెపి నేత ఆగడం అంబులెన్స్‌లోనే రోగి మృతి

హిసార్ : హర్యానాలో బిజెపి నేత ఆగడం ఓ రోగి ప్రాణాలు తీసింది. హిసార్ బిజెపి మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షులు దర్శన్ నాగ్‌పాల్ ప్రయాణిస్తున్న కారును రోగితో వెళ్లుతున్న అంబులెన్స్‌ను ఢీకొంది. దీనితో ఆగ్రహించిన బిజెపి నేత అంబులెన్స్‌ను నిలిపివేశారు. గొడవకు దిగారు. అరగంట సేపు వాహనాన్ని కదలనివ్వకపోవడంతో సకాలంలో చికిత్స అందకపోవడంతో రోగి నవీన్‌కుమార్ మృతి చెందాడు. హర్యానా బిజెపి అధ్యక్షుడి కుమారుడు ఓ యువతిని కారులో వెంబడించి వేధించిన ఘటన జరిగిన రెండు రోజులకే ఈ బిజెపి నేత యవ్వారం జరిగింది. తన మామయ్యను గుండెచికిత్స కోసం డాక్టరు వద్దకు అంబులెన్స్‌లో తీసుకువెళ్లుతుండగా నాగ్‌పాల్ అడ్డుకున్నారని అరుణ్‌కుమార్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా లాల్ బట్టి చౌక్ వద్ద ఆయన కారును వెనుక వైపు నుంచి అంబులెన్స్ కొద్దిగా ఢీకొందని దీనికే ఆయన హంగామా చేసి చివరికి ప్రాణాలు దక్కకుండా చేశాడని ఫిర్యాదులో తెలిపారు. అయితే తాను అంబులెన్స్ డ్రైవర్‌ను ఆపలేదని, హాస్పిటల్‌కు వాహనం చేరిన తరువాతనే కారు దెబ్బతిన్న విషయం గురించి మాట్లాడానని నాగ్‌పాల్ తెలిపారు. అంబులెన్స్‌ను అరగంట సేపు ఆపినట్లు వచ్చిన వార్తలను ఖండించారు. ఎలాంటి దర్యాప్తునకు అయినా సిద్ధం అని తెలిపారు. ఇక దీనిపై తమకు ఫిర్యాదు అందిందని పోలీసులు విచారిస్తున్నారని ఫతేహాబాద్ ఎస్‌పి కుల్దీప్ సింగ్ తెలిపారు. దీనిపై కేసు నమోదు కాలేదని వివరించారు.


నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలన ఆదర్శప్రాయం

మన తెలంగాణ/హైదరాబాద్: నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలన ఆదర్శప్రాయమని ఉప ముఖ్యమంత్రి మమ్మద్ మహముద్ అలీఅన్నారు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 51వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని కింగ్‌కోఠిలోని జుదిమసీద్‌లో ఆయన సమాది వద్ద మహమూద్‌అలీ నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మాన్‌అలీఖాన్ లౌకిక విధానాన్ని అనుసరించి పాలనను కొనసాగించారని, విద్యారంగాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఆయన హయాంలోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఉస్మానియా ఆస్పత్రి నిర్మించారని గుర్తు చేశారు. రైతుకు సాగునీరును అందించే ఉద్దేశంతో నిజాం సాగర్‌ను నిర్మించారని చెప్పారు.






మన వ్యవసాయం



తెలుగు రాష్ట్రాల్లో మేలుగడ్డ

బంగాళదుంప స్వల్పకాలంలో పండించే శీతాకాలపు పంట. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 70 వేల హెక్టార్లలో లక్షా 42 వేల టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. ముఖ్యంగా మెదక్, చిత్తూరు జిల్లాల్లో అధికంగా , రంగారెడ్డి జిల్లాలో కొద్దిపాటి విస్తీర్ణంలో సాగులో ఉంది. చల్లని వాతావరణం అవసరం. పగటి ఉష్ణోగ్రత 32 సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రత 15-20 సెల్సియస్ మధ్య చాలా అనుకూలం. అధిక ఉష్ణోగ్రతలో దుంపల పెరుగుదల ఉండదు. నీటి పారుదల, మురుగు నీటి వసతి గల ఇసుక లేక ఎర్రగరప నేలలు అనుకూలం. పి.హెచ్.5.2-7 ఉండాలి. ఆమ్ల లక్షణాలు గల నేలలు, బరువైన నేలలు దుంపల పెరుగుదలకు అనుకూలం కాదు.



నేల తయారీ

నేలను 45 సార్లు దున్ని, ఎకరాకు 1012 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్ని చదును చేయాలి. 50సెం.మీ. ఎడంతో బోదెలు , కాలువలు చేయాలి.

త్వరగా మొలకెత్తటానికి

శీతల గిడ్డంగుల నిల్వ నుంచి తీసిన ఆలుగడ్డ విత్తన దుంపలను త్వరితంగా మొలకెత్తించడానికి, వాటిని 30 సెం.మీ. మందం కన్నా మించకుండా నీడలో పరచి కనీసం 710 రోజుల పాటు ఆరనీయాలి. గాలి చొరబడటానికి 23 సార్లు విత్తన దుంపలను తిరగ తిప్పాలి. పెద్ద సైజు దుంపలను శుభ్రంగా నీటిలో కడిగి 3040 గ్రా. ఉండేలా దుంపలను ముక్కలుగా కోయాలి. 100 గ్రా. థయోయూరియా, 10 మి.గ్రా ఆసిడ్ 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణంలో విత్తనం దుంపలను ముంచి తీసి బాగా ఆరబెట్టి, ఆతర్వాత కుప్పగా వేసి 2428 గంటలుంచిన తర్వాత విత్తుకుంటే మొలక శాతం ఉంటుంది.

విత్తటం

తెగులు సోకని, ఆరోగ్యమైన దుంపలను ఎన్నిక చేసుకోవాలి. దాదాపు 3040 గ్రా. బరువుతో 23 కళ్ళు ఉండి అప్పుడే మొలకెత్తటం ప్రారంభించిన వాటిని విత్తటానికి ఎంపిక చేయాలి. ముక్కలు చేసిన విత్తన దుంపలు ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ళు అవసరం ఉంటుంది. విత్తనాల ద్వారా వ్యాప్తి చెందే శిలీంద్రాల నివారణకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. లీటరు నీటికి 3 గ్రా. మాంకోజెట్ చొప్పున తయారు చేసిన ద్రావణంలో కూడా ఈ దుంపలను సుమారు 30 నిమిషములుంచి విత్తన శుద్ధి చేసుకోవాలి.

నీటి యాజమాన్యం

నేలను, వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు పెట్టాలి. చల్కా నేలల్లో, మొలకెత్తడానికి ముందు 78 రోజులు, దుంప ఏర్పడేటప్పుడు 45 రోజుల వ్యవధితోనూ నీరు పెట్టాలి.

కలుపు నివారణ, అంతర కృషి

అభివృద్ధి చెందుతున్న దుంపలపై సూర్యరశ్మి., దుంప ఆకుపచ్చ రంగులకు మారుతుంది. కాబట్టి విత్తిన 30 రోజుల తర్వాత సుమారు 34 సార్లు మట్టిని ఎగదోయాలి. విత్తిన 23 రోజుల్లో ఎకరాకు ఒక లీటరు అలాక్లోరో పిచికారి చేయాలి. అలాగే 300 గ్రా. మెట్రిబుజిన్ కూడా పిచికారి చేసి కలుపు నివారించుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం

ఎకరాకు 1012 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 40కిలోల యూరియా, 150 కిలో సూపర్, 30 పొటాష్ వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత 40 కిలోల యూరియా, 50 రోజులకు మరో 20కిలోల యూరియా, 30కి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.

సమగ్ర సస్యరక్షణ

- ఎండాకాలంలో లోతుగా దున్ని, పురుగుల యొక్క వివిధ దశలను బయటపెట్టాలి.
- దుంపలను బోదెలు, కాలువలు చేసి నాటాలి.
- పంటమార్పిడిని పాటించాలి.
- నిలువకు ముందు మాంకోజెట్ 2 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 20 నిమిషాలు ఉంచి నిలువ చేయాలి.
- పొలంలో కలుపు లేకుండా చూడాలి.
- చిన్న పురుగులు, ప్యూపాదశలు, వేరుపురుగులు, ఆకుమాడు తెగులు సోకిన ఆకులను, దెబ్బతిన్న ఎకరానికి 6 కిలోల చొప్ప వేయాలి. లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి 10 కిలో చొప్పన వేయాలి.
- ఆకు ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటికి చొప్పన కలిపిన పిచికారి చేయాలి.
- వేరు పురుగు ఆశించకుండా దుంపలను పెట్టిన 30 రోజులకు మట్టి ఎగదోసేటప్పడు గుళికలు ఎకరానికి 6 కిలోల చొప్పన వేయాలి.
- ఆకు ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటికి చొప్పన కలిపి పిచికారీ చేయాలి.

పంట కోత

నేల పైభాగంలో మొక్క వాలిపోయి, పసుపువర్ణం నుంచి గోధుమ వర్ణంలోకి మారి పడిపోతుంది. సాధారణంగా నాటిన 90100 రోజుల్లో కోతకు సిద్ధమవుతుంది. దుంపలకు తగలకుండా జాగ్రత్తగా గడ్డపారతో త్రవ్వి, నీడలో ఆరబెట్టి, నిల్వ చేయాలి. ఎకరాకు 1014టన్నుల వరకూ దిగుబడి వస్తుంది.

శ్రీనివాస్‌రెడ్డి పులసాని, రిపోర్టర్
ఫోన్: 9010385659

ముఖ్యాంశాలు

మొలక శాతం పెంచడానికి దుంపలను 1 పిపిఎం జిబ్బరిల్లిక్ ఆమ్ల ద్రావణంలో గంటసేపు ఉంచి తర్వాత ఆరబెట్టి 10 రోజులు ఉంచాలి. దుంపల పెరుగుదల దశలో సూర్యరశ్మి సోకకుండా మట్టిన ఎగదోయాలి. ఈ దశలోని తప్పనిసరిగా నీటిని పెటట్టాలి. విత్తిన 35 రోజుల తర్వాత మట్టిని తప్పనిసరిగా ఎగదోయాలి. మరల 30 రోజుల తర్వాత రెండోసారి మట్టిని ఎగదోయాలి. దుంపలను 1 సెల్సియస్ 2.7 సెల్సియస్, 90 శాతం నిల్వ చేసుకోవాలి.

దుంప తొలిచే పురుగులు

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పుడు దీని ప్రభావం ఎక్కువగా ఉం టుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ పురుగు ఉధృతి చాలా తక్కువగా ఉంది. ఈ పురుగు ప్రభావం పొలంలో పంటపైన మొదట ప్రారంభమై గోడౌన్‌లో నిల్వ చేసినప్పుడు అధికమ వుతుంది. ఈ పురుగు తొలచడంతో గుల్లబారి, పుచ్చిపో తాయి. 30 శాతం వరకూ దిగుబడులు లేదా నిల్వలలో నష్టం వస్తుంది.

నివారణ పద్ధతులు

దుంపలు బయటపడకుండా ఎప్పటికప్పుడు బోదెల పైకి మట్టి ఎగదోయాలి. పురుగు ఆశించిన దుంపలను గుర్తించి ఏరి నా శనం చేయాలి. దుంపలను 3 సెం.మీ. మందం ఇసుక పేర్చి వాటిపై ఉంచాలి. పొలంలో ఈ పురుగును అరికట్టడానికి లీట రు నీటికి 3 గ్రాములు కార్బరిల్ పొడి మందును పిచికారి చే యాలి. నిల్వ చేసేటప్పుడు గోడౌన్‌లో సంచులపై మలాథి యాన్ 3 మి.లీ. నీటికి చొప్పున ఫ్యూమిగేషన్ వేయాలి.

రసం పీల్చే పురుగులు

ఆకుల నుంచి రసాన్ని పీల్చి నాశనం చేస్తాయి. ఆకులు ముడ తలు పడి పసుపు రంగుకు మారిపోతాయి. నివారణకు మి థైల్ డెమెటాన్ లేదా డైమిథోయేట్ 2మిలీ నీటికి కలిపి పిచికా రీ చేయాలి. పేను బంకతో ఆకుముడత తెగులు వ్యాపిస్తుంది.

తెల్లనల్లి

ఇది ఆకుల కింది భాగంలో గుంపులుగా ఉండి రసం పీల్చి వైరస్ తెగుళ్ళను వ్యాప్తి చేస్తుంది. ఆకులు కురచబారి ముడు చుకుంటాయి. దీని నివారణకు లీటరు నీటికి 2.5మిలీ ట్రై జోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

పొగాకు లద్దెపురుగు

పిల్ల పురుగులు ఆకుల్లోని ఆకుపచ్చని పదార్థాన్ని, దుంపలను తొలిచి పంటకు నష్టాన్ని కలుగజేస్తాయి. ప్రత్యేకించి రాత్రివే ళల్లో ఆశిస్తాయి. నివారణకు ఎండాకాలంలో లోతుగా దుక్కి దున్నాలి. ఆముదపు పంటను ఎరపంటగా చేయాలి. గుడ్ల స ముదాయాన్ని ఏరి నాశనం చేయాలి.

రింగ్ తెగులు

ఆకులు పసుపు బారి, వాడిపోతాయి. మొక్క వడలినట్లుగా ఉంటుంది. గడ్డను కోసి చూస్తే ఒక వలయం వలె పెద్ద మచ్చ కనిపిస్తుంది. ఈతెగులు విత్తనం ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఆరోగ్యవంతమైన విత్తాన్ని ఎన్నుకోవాలి. దుంపలను 25గ్రా. కార్బండైజియ్ 10 లీటర్ల నీటితో కలిపిన ద్రావణంలో 30నిమిషాలు నానబెట్టి నాటుకోవాలి.





శ్రీశాంత్‌కు ఊరట!

- **జీవితకాలం నిషేధం ఎత్తివేయండంటూ బిసిసిఐకి కేరళ హైకోర్టు ఆదేశాలు**
- **హర్షం వ్యక్తం చేసిన శ్రీశాంత్**

కొచ్చి: తనపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ న్యాయపోరాటం చేస్తున్న క్రికెటర్ శ్రీశాంత్‌కు కేరళ హైకోర్టు ఊరటనిచ్చింది. బిసిసిఐ అతడిపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేస్తూ సోమవారం కేరళ హైకోర్టు తీర్పునిచ్చింది. శ్రీకాంత్ పెట్టుకున్న పిటిషన్‌పై తీర్పునిస్తూ బిసిసిఐ క్రమశిక్షణా కమిటీకి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. న్యాయమూర్తి ఎ. ముహమ్మద్ ముస్తాఖ్ శ్రీశాంత్‌పై క్రికెట్ బోర్డు చేపట్టిన అన్ని చర్యలను పక్కన పెట్టేశారు. పైగా బిసిసిఐ క్రమశిక్షణా కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. 2013లో జరిగిన ఐపిఎల్–6 సీజన్‌లో స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణం ఆరోపణలో శ్రీకాంత్ అరెస్టయ్యాడు. అయితే ఢిల్లీ హైకోర్టు 2015లో అతడిని నిర్దోషని తీర్పునిచ్చింది. అతడితోపాటు అంకిత్ చవాన్, అజిత్ చండీలాలను కూడా నిర్దోషులని తేల్చింది. వారిపై ఉన్న అభియోగాలన్నింటినీ కొట్టివేస్తూ పటియాలా హౌస్ కోర్టు వారిని విడుదల చేసింది. ఆ తర్వాత స్థానిక టోర్నీల్లో ఆడేందుకు శ్రీశాంత్ ప్రయత్నించినా బిసిసిఐ మాత్రం నిషేధాన్ని అలాగే కొనసాగిస్తూ వచ్చింది. దాంతో శ్రీకాంత్ కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. తాను నిర్దోషిగా తేలినా, బిసిసిఐ కావాలనే నిషేధాన్ని కొనసాగిస్తోందని కోర్టుకు విన్నవించుకున్నాడు. కేరళ హైకోర్టు తాజా తీర్పుపై శ్రీశాంత్ హర్షం వ్యక్తం చేశాడు. తాను మళ్లీ క్రికెట్ ఆటలోకి వచ్చే ఆశలు సజీవంగా ఉన్నాయని శ్రీకాంత్ చెప్పాడు. తాను క్రికెట్ ఆడటానికి ఇంకా కేవలం 6 నుంచి 8 ఏళ్లే మిగిలి ఉన్నాయని చెప్పుకొచ్చాడు. తాను మళ్లీ టెస్ట్ క్రికెట్ ఆడతానన్నాడు. ఏ రంగానికి చెందిన వాడినో ఆ రంగానికే తిరిగి వస్తున్నందుకు ఆనందంగా ఉన్నదని శ్రీశాంత్ అన్నాడు. 'కష్ట సమయాలు వస్తుంటాయి. పోతుంటాయి. రంజీ క్రికెట్‌కు ఫిట్‌గా తయారవ్వడమే ప్రస్తుత తన లక్ష్యం' అని చెప్పాడు. ఇప్పటికే ప్రాక్టీస్ చేస్తున్న ఈ 34 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ తన సత్తాను చాటుకోవల్సి ఉందన్నాడు. 'నా ఇంట్లో చిన్న ఇండోర్ నెట్ ఉంది. అక్కడే నేను ప్రాక్టీసు చేస్తున్నా. అయితే నా సత్తాను నేను రుజువు చేసుకోవలసి ఉంది' అన్నాడు ఈ కేరళ పేసర్.



జస్టిన్ గాట్లిన్‌కు చేదు అనుభవం

- **బోల్ట్‌కు హర్షధ్వానాలు**





లండన్ : 100 మీటర్ల పరుగు పందెంలో కొత్తగా ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న జస్టిన్ గాట్లిన్‌కు సోమవారం ఒలింపిక్ స్టేడియంలో చేదు అనుభవం ఎదురైంది. లండన్ వేదికగా జరిగిన ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో బోల్ట్ తన చివరి 100 మీ. పరుగులో మూడోస్థానాన్ని పొంది కాంస్యానికి పరిమితమయ్యాడు. దీంతో పతకాల వేడుకలో ప్రేక్షకులు జస్టిన్‌ను ఛీకొడుతూ, బోల్ట్‌ను ప్రశంసిస్తూ హర్షధ్వానాలు చేశారు. '2006లో డోపింగ్‌లో దొరికిపోయిన అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్‌ను జీవితాంతం నిషేధించాల్సింది' అని ఐఎఎఎఫ్ పాలక సంస్థ చీఫ్ సెబాస్టియన్ కో అన్న కొద్ది గంటలకే గాట్లిన్‌కు జనం నుంచి ఛీత్కారం ఎదురైంది. డోపింగ్ నేరానికి పాల్పడినందుకు జస్టిన్ గాట్లిన్(35) రెండుసార్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. జమైకా దేశానికి చెందిన స్ప్రింట్ సూపర్‌స్టార్ ఉసేన్ బోల్ట్ 100మీ. పరుగు చివరి పోటీలో యాంటీక్లైమాక్స్ టచ్ ఇచ్చాడు. 12న జరిగే పురుషుల 4 x 100 మీ. రిలేలో జమైకా టైటిల్ డిఫెన్స్‌లో బోల్ట్ భాగస్వామి అవుతారనుకుంటే అతడు ఆదివారం జరిగిన పోటీలో అమెరికా అథ్లెట్ జస్టిన్ గ్లాటిన్, మరో అమెరికన్ అథ్లెట్ క్రిస్టియన్ కోల్మ్‌న్ కన్నా వెనుకబడిపోయాడు. తమ ఫేవరేట్ బోల్ట్ రేసు ఓడిపోవడంతో అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 'ఉసేన్ బోల్ట్, ఉసేన్ బోల్ట్' అని అరుస్తూనే గ్లాటిన్‌ను నిరసించారు. అయినప్పటికీ జస్టిన్ గ్లాటిన్ లండన్ ప్రజల అసంతృప్తి ఖాతరు చేయలేదు. 'నోరు మూయండి' అనే సంజ్ఞలా నోటి మీద చూపుడు వేలును ఉంచి సూచించాడు.

అయితే సోమవారం జరిగిన పతకాల ప్రదానోత్సవంలో జస్టిన్ గ్లాటిన్‌కు లండన్ ప్రజల నుంచి ఛీత్కారం ఎదురైంది. కాంస్య పతక విజేతగా బోల్ట్ పేరును ప్రకటించినప్పుడు జనం హర్షధ్వానాలు చేశారు. కానీ అనౌన్సర్ ఫ్రెంచి భాషలో గాట్లిన్ పేరును ఉచ్చరి స్తుండగా జనం ఛీకొట్టారు. అయితే ఆ ఛీత్కారం ఎక్కువ సేపు కొనసాగలేదు. ఎందుకంటే జనంలో కొంత మంది జస్టిన్ గ్లాటిన్ గెలుపును హర్షిస్తూ చప్పట్లు చరిచారు. అయితే గ్లాటిన్ ఎలాంటి భావోద్వేగాలు చూపకుండా పో డియంలో నిలకడగా నిలుచున్నాడు. అంతేకాక ఫోటోలు తీసుకునే వారికి ఫోజులివ్వడానికి బోల్ట్‌ను, కోల్మన్‌ను పిలిచాడు. విశేషమేమిటంటే సాంప్రదాయం ప్రకారం గాట్లిన్, కోల్మన్, బోల్ట్‌లకు ఐఎఎఎఫ్ అధ్యక్షుడు కో పతకాలు ప్రదానం చేశారు. పతాకాలు ప్రదానం చేసే ముందు వారితో కరచాలనం కూడా చేశారు. డోపింగ్ పరీ క్షలో దొరికిపోయిన గ్లాటిన్ 2001లో రెండేళ్ల పాటు, 2006లో ఎనిమిదేళ్లపాటు నిషేధానికి గురయ్యాడు. అయితే ఆర్బిట్రేషన్ ప్యానెల్ 2007లో గ్లాటిన్ నిషేధాన్ని సగానికి తగ్గించింది. దాదాపు దశాబ్ద కాలంగా 100 మీటర్ల పరుగు(స్ప్రింట్) పందేలాలో తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తూ వచ్చిన ఉసేన్ బోల్ట్ క్లైమాక్స్ పోటీలో మాత్రం అభిమానులను నిరాశపరిచాడు.

షరపోవాకు చైనా ఓపెన్ వైల్డ్‌కార్డ్




బీజింగ్ : చైనా ఓపెన్‌లో ఆడేందుకు రష్యా టెన్నిస్ స్టార్ మరియా షరపోవా(30) ఆహ్వానాన్ని అంగీకరించింది. ఆమె ఈ టోర్నీలో ఏడోసారి కనిపించబోతున్నది. ఐదు సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత అయిన షరపోవా తొడ గాయం కారణంగా గ్రాస్‌కోర్ట్ సీజన్ మొత్తాన్ని, వింబుల్డన్‌ను మిస్సయింది. గత వారం స్టాన్‌ఫోర్డ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో మోచేతి గాయం కారణంగా ఆమె విరమించుకోక తప్పలేదు. మెలోడియంను ఉపయోగించినందుకు 15 నెలల డోపింగ్ నిషేధానికి గురైన షరపోవా మళ్లీ ఆడేందుకు తిరిగి వచ్చాక ఆడింది కేవలం నాలుగు టోర్నమెంటులే. 'అక్టోబర్‌లో చైనా ఓపెన్ ఆడేందుకు బీజింగ్‌కు వస్తానని ప్రకటించేందుకు సంతోషిస్తున్నా' అని షరపోవా తెలిపింది. 'ఈ ఏడాది ఆసియాలో తనకిదే తొలి టోర్నమెంట్ అయినందుకు ఉత్తేజకరంగా ఉంది' అని కూడా పేర్కొంది. బీజింగ్‌లో జరగనున్న చైనా ఓపెన్ టోర్నమెంట్‌లో వింబుల్డన్ ఛాంపియన్ గర్బైన్ ముగురుజా, కారోలిన్ వోజ్నియాకీ, వీనస్ విలియమ్స్, స్థానిక ఫేవరేట్లు జాంగ్ షుయి, పెంగ్ షుయి వంటి హేమాహేమి క్రీడాకారిణులు పాల్గొననున్నారు.

పరిహారం ప్యాకేజికై బిసిసిఐ, సివోఎకు అజర్ లేఖ



న్యూఢిల్లీ: మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజరుద్దీన్‌పై జీవితకాల నిషేధాన్ని ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చి దాదాపు ఐదేళ్లు కావస్తున్నా బిసిసిఐ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కనీసం కోర్టులో ఆ తీర్పును సవాలు చేయలేదు. నిషేధాన్ని ఎత్తివేయనూ లేదు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో అజర్ పోటీచేయాలనుకున్నప్పుడు ఈ సమస్య అతడిని వెంటాడింది. పైగా బిసిసిఐ నిషేధాన్ని అతడిపై నుంచి ఎత్తివేయనందున రిటర్నింగ్ అధికారి అజర్‌ను అనర్హుడిగా ప్రకటించారు. అయితే ఇప్పుడు తనకు రావలసిన బకాయిలను ఇవ్వాల్సిందిగా అధ్యక్షుడు సి.కె.ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి సహా బిసిసిఐకి, ఇంకా కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్(సివోఎ)లకు రాశారని తెలిసింది. అతడు కాంపెన్‌సేషన్ ప్యాకేజి కోరారని సమాచారం. గత ఏడాది కాన్పూర్‌లో న్యూజిలాండ్‌తో భారత్ జట్టు ఆడిన 500వ టెస్ట్ ఉత్సవానికి అజర్‌ను ఆహ్వానించారు. సచిన్ టెండూల్కర్, కపిల్‌దేవ్, సునీల్ గవాస్కర్, ఎం.ఎస్. ధోనీ. రవిశాస్త్రిలతో పాటుగా అజర్‌ను కూడా సన్మానించారు.

గ్లాస్గో ఈవెంట్‌లో అత్యున్నత సీడెడ్‌గా సింధు



స్కాట్‌లాండ్ : గ్లాస్గోలో ఆగస్ట్ 21 నుంచి బాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ఆరంభం కానున్నాయి. మహిళల సింగిల్స్ కేటగిరిలో సీడెడ్ భారతీయ బ్యాడ్మిం టన్ క్రీడాకారిణిగా పి.వి.సింధు బరిలోకి దిగుతోంది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 8వ సీడె డ్‌గా ఆడబోతున్నాడు. కారోలినా మారిన్, జపాన్‌కు చెందిన అకనె యమగుచి, కొరియా కు చెందిన సుంగ్‌జి హ్యున్‌లతో పాటు నాలుగో సీడెడ్‌గా సింధు ఆడబోతుంది. ఇదిలా ఉండగా సైనా నెహ్వాల్ ఈ టోర్నమెం ట్‌లో 12వ సీడెడ్‌గా ఆడబోతున్నది. ప్రపంచ నెంబర్ వన్ తాయ్ జుయింగ్ ఆట నుంచి విరమించుకున్నం దున ప్రస్తుతం నెంబర్ రెండులో ఉన్న యమగుచిని టాప్ సీడ్‌గా పరిగణిస్తున్నారు. ఇప్పటికే ఇండోనేషి యా ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లను తన ఖాతాలో వేసుకున శ్రీకాంత్ అదే ఫామ్‌లో ఉన్నాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.